ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 211 పేజీలు: 10+4 వెల: 8.00

ఉద్యోగం పోతే అమెరికాను వీడాల్సిందే
నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు 5

## తాష్కెంట్‌లో మోడీ

### ప్రోటోకాల్ పక్కనపెట్టి ఎయిర్‌పోర్టులో మోడీకి స్వాగతం పలికిన అధ్యక్షుడు

### అనంతరం ఒకే కారులో ఇరువురు అధినేతల ప్రయాణం

**తాష్కెంట్, ఆగస్టు 29:** ప్రధాని మోడీ రెండు రోజుల పర్యటన కోసం శనివారం ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌కు చేరుకున్నారు. అక్కడ ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ స్వయంగా విమానాశ్రయానికి చేరుకుని మోడీకి ఘన స్వాగతం పలికారు. భారత్, >>2


తాష్కెంట్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు మిర్జియోయెవ్

## 7 నుంచి అసెంబ్లీ

### వర్షాకాల సమావేశాలకు అంతా సిద్ధం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు29:** సెప్టెంబర్ నెల 7 నుంచి అసెంబ్లీ, కౌన్సిల్ వర్షాకాల సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి, కౌన్సిల్ కార్యదర్శి వి. నరసింహాచార్యులు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు. 7వ తేదీన ఉదయం 10 గంటలకు సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఇటీవల సచివాలయంలో జరిగిన మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజునే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన, కౌన్సిల్ చైర్మన్ >>2

## కేబినెట్‌లో కొత్తదనం రావాలి



### 22ఎను రద్దు చేయాలి

### పార్టీలైన్ దాటిన వారిపై వేటు వేయాలి: కౌన్సిల్ చైర్మన్ సుఖేందర్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు29:** రాష్ట్ర కేబినెట్, ప్రభుత్వంలో మార్పు రావాలని, ఉన్న కేబినెట్ పునర్వ్యవస్థీకరణ(షఫ్లింగ్) చేస్తే కొత్త దనం వస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ తగాదాలు తగ్గించాలని, పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే పార్టీకే నష్టమని వ్యాఖ్యానించారు. శనివారం శాసన మండలిలోని తన ఛాంబర్‌లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియా చిట్ చాట్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీలోనూ క్రమ శిక్షణ లేదు. కాంగ్రెస్‌పార్టీలో గ్రూప్ తగాదాలు తగ్గించాలని, పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయక పోతే పార్టీకి నష్టం అని పేర్కొన్నారు. పార్టీలో లీకేజీలు కంట్రోల్ చేయాలి, పార్టీలో క్రమశిక్షణ ముఖ్యం అవన్నీ కంట్రోల్‌చేస్తే మళ్ళీ అధికారంలోకి రావచ్చునని పేర్కొన్నారు. ఇప్పుడిస్తున్న పింఛన్లు రూ.2 వేల నుంచి రూ.3వేలకు పెంచాలి, రైతు భరోసా కంటిన్యూ చేయాలి, అర్హులైనవారికి మాత్రమే ఇవ్వాలి అని చెప్పారు. బిఆర్ఎస్ హయంలో 22ఏ ఉంది, >>2

# గడువు పెంచండి



### 'సర్' అభ్యంతరాలకు మరో 4 వారాలు అవసరం

### తుది ఓటర్ల జాబితా తేదీని పొడిగించాలి

### ఇఆర్ఓ స్థాయి సిబ్బందిని కూడా పెంచాలి

### అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు పోకూడదు

### ఎన్నికల సంఘానికి సిఎం రేవంత్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు29:** తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-సర్) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా శనివారం భారతఎన్నికల సంఘం (ఈసిఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా (ఏఎస్‌డిడి) గుర్తించినట్లు ముఖ్యమంత్రి ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, >>2




## నేడు నీట్ పిజి పరీక్ష

### ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాత వార్త:** నీట్ పిజి పరీక్షలు ఆదివారం దేశ వ్యాప్తంగా జరగనుండగా ఇందులో భాగంగా గ్రేటర్ పరిధిలో పలు కేంద్రాలలో ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వేల500 మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్ష లకు హాజరవుతుండగా >>2

నీట్ పిజి విద్యార్థిని ఆత్మహత్య 3



## వచ్చే 8, 9న టెట్ పరీక్ష

### ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు29:** తెలంగాణలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల బోధనా అర్హత కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2026 విద్యా సంవత్సరానికిగాను సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక టెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రతిరోజూ షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9:00 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:30 వరకు వివిధ సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. సెప్టెంబర్ 8న పేపర్1, >>2

# ప్రాణహితకు పునరుజ్జీవం


శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్

### తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల బ్యారేజికి తెలంగాణ పట్టు

### 1న ఢిల్లీలో తెలంగాణ-మహారాష్ట్ర కీలక అంతర్రాష్ట్ర చర్చలు

### సిడబ్ల్యూసి చైర్మన్ నేతృత్వంలో రెండు రాష్ట్రాల జల సంప్రదింపులు

### విద్యుత్ వ్యయానికి కళ్లెం వేసే దిశగా అడుగులు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుజ్జీవింపజేసి తెలంగాణ రైతాంగానికి ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే తెలంగాణ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 80టిఎంసిల ప్రాణహిత జలాలను గురుత్వాకర్షణతో సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సిడబ్ల్యుసి చైర్మన్ అధ్యక్షతన సిడబ్ల్యుసిలోని కీలక డైరెక్టరేట్ల అధిపతుల సమక్షంలో తెలంగాణ-మహారాష్ట్ర మధ్య జరగనున్న కీలక అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో శనివారం సాయంత్రం ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబుతో పాటు నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీ సమావేశంలో తెలంగాణ తరఫున వినిపించాల్సిన సాంకేతిక, న్యాయపరమైన వాదనలు, రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గురుత్వాకర్షణ ద్వారా నీటి తరలింపు సాధ్యాసాధ్యాలను కూలంకషంగా సమీక్షించారు.. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు,ముంపు ప్రభావం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయని వెల్లడించారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం, నీటిపారుదల శాఖ కేంద్రంతో నిరంతరం జరిపిన సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగానే ఈ చర్చలకు మార్గం సుగమమైందన్నారు. డాక్టర్ >>2



మీరు దేవుడు అనుకుంటున్నారా? 3
ఎఫ్‌డిఎ అధికారులపై బాంబే హైకోర్టు ఆగ్రహం



సిఎం రేవంత్‌కు రైతు సంక్షేమ కమిషన్ నివేదిక 6



## ఎమ్మెల్సీ బేగ్ సస్పెన్షన్

### వేటు వేసిన మజ్లిస్ పార్టీ

### సోషల్ మీడియాలో లైంగికదాడి ఆరోపణలు

### ఫిర్యాదు రాలేదంటున్న పోలీసులు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** జంట నగరాలలో రాజకీయంగా చక్రం తిప్పుతున్న మజ్లిస్ పార్టీ నుంచి ఎంఎల్‌సిగా వున్న మీర్జా రహ మత్ బేగ్‌పై లైంగిక దాడి ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. ఐదు రోజుల క్రితం అత్తాపూర్‌లో ఓ మైనర్ బాలికపై ఎంఎల్‌సి బేగ్ లైంగిక దాడికి పాల్పడినట్లు రెండు రోజులుగా పాతబస్తీలో వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో బేగ్‌పై మజ్లిస్ >>2



శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్. చిత్రంలో మంత్రి జూపల్లి తదితరులు

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

### షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు

### సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు.. పిపిపి విధానంలో అభివృద్ధి

### పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం: మంత్రి జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు29:** తెలంగాణను ప్రపంచ స్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు >>2

## తొలగని ముప్పు


### నేపాల్‌కు మరో రెండు హిమానీనదుల నుంచి వరదలు!

### 700 దాటిన మృతులు, 2500 మందికిపైగా ఆచూకీ గల్లంతు

### ఆకస్మిక వరదల కష్టాల నుంచి ఇంకా కోలుకోని ప్రజలు

**కఠ్మాండు, ఆగస్టు 29:** నేపాల్‌లో వరదల నుంచి కోలుకోక ముందే మరో షాకింగ్ విషయం వెలుగు వచ్చింది. ప్రమాదానికి కారణమైన భోటే కోషి త్రిశూలి నదీ వ్యవస్థ సమీపంలోనే మరో రెండు హిమానీనద సరస్సులు ఏర్పడ్డాయని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధిపతి కృష్ణ వాట్సా తెలిపారు. అయితే వీటి నుంచి ఎంతమేర వరదనీరు బయటకు వచ్చే అవకాశం ఉందన్న దానిపై ప్రస్తుతం స్పష్టమైన అంచనాలు లేవని ఆయన వెల్లడించారు. ఒక సరస్సు 19.80 హెక్టార్లు, మరొకటి7.28 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లుపేర్కొన్నారు. సరస్సుల్లోని నీటి పరిమాణంపై ఇప్పటివరకు ఎలాంటి అంచనా లేదని ఆయన చెప్పుకొచ్చారు. అయితే అక్కడ హిమానీనదాలు >>2





యుపిలోని ప్రయాగ్‌రాజ్‌లో భారీ వర్షాల కారణంగా స్వామినారాయణ్ ఆలయ ప్రాంగణంలోని కొంత భాగం కూలిపోయిన దృశ్యం

# తాష్కెంట్‌లో మోడీ

>> ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మోడీ ఈ పర్యటన చేపట్టారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం ప్రధాని మోడీ ఎక్స్‌వేదికగా స్పందిస్తూ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయన చూపించిన ప్రత్యేక ఆతిథ్యానికి కృతజ్ఞతలు. ఉజ్బెకిస్థాన్‌కు ఇది నా నాలుగో పర్యటన. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాల లోతు, వాటిలో పెరుగుతున్న వేగానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ, అధ్యక్షుడు మిర్జియోయెవ్‌తో ప్రతినిధుల స్థాయి చర్చలు జరపనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలపై చర్చించే అవకాశం ఉంది. భవిష్యత్‌లో భారత్‌ఉజ్బెకిస్థాన్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికపై కూడా ఇరువురు నేతలు చర్చించనున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్‌ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో గణనీయమైన పురోగతి సాధించామనిమోడీ అన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచడంపై మిర్జియోయెవ్‌తో చర్చలు జరుపుతామని తెలిపారు. వికసిత్ భారత్, యాంగ్ ఉజ్బెకిస్థాన్ లక్ష్యాల విషయంలో ఇరు దేశాల ఉమ్మడి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం మోడీ యాంగ్ ఉజ్బెకిస్థాన్ పార్క్‌ను సందర్శించారు. అక్కడి స్వాతంత్ర్య స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అధ్యక్షుడు మిర్జియోయెవ్ కూడా మోడీ వెంట ఉన్నారు. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్రం సాధించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ స్మారకాన్ని ఏర్పాటు చేశారు. మోడీ తన పర్యటనలో భాగంగా తాష్కెంట్‌లోని శాస్త్రి స్మారకాన్ని, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్థాన్‌లో రెండు రోజుల పర్యటనను ముగించుకున్న అనంతరం 30న ప్రధాని మోడీ కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. అక్కడ జరిగే 26వ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొంటారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఈ సదస్సు జరగనుంది. ఎస్‌సివో ఏర్పాటై 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ సమావేశం జరుగుతోంది. భారత్ 2017 నుంచి ఎస్సీవోలో పూర్తి స్థాయి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఎస్‌సివో సదస్సులో భారత్ తన భద్రత, కనెక్టివిటీ, అవకాశాలు అనే దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుందని మోడీ తెలిపారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదానికి తావులేని ప్రాంతం కోసం సభ్యదేశాలతో కలిసి పనిచేయడమే భారత్ లక్ష్యమని పేర్కొన్నారు. బిష్కెక్‌లో కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్‌తో మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. ఇతర ఎస్సీవో దేశాల నేతలతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అలాగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొననున్నారు.

# ప్రాణహితకు పునరుజ్జీవం

>> బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రైతాంగానికి మొదట ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గత రాష్ట్ర ప్రభుత్వం 2016లో అంగీకరించిన 148 మీటర్ల స్థాయికి బదులుగా 152 మీటర్ల స్థాయిలో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించిన సాంకేతిక అధ్యయనాల ప్రకారం 148 మీటర్ల స్థాయిలో మహారాష్ట్ర భూభాగంలో సుమారు 1,150 ఎకరాలు, 152 మీటర్ల స్థాయిలో 2,500 ఎకరాలకు పైగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం సమర్థవంతంగా చర్చలు జరపకపోగా, రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను తగినంతగా పరిరక్షించకుండా 148 మీటర్లకు అంగీకరించడం వల్ల తెలంగాణ ఒక కీలక అవకాశాన్ని కోల్పోయింది" అని మంత్రి పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణం సాధ్యమైతే దాదాపు 80టిఎంసి ప్రాణహిత జలాలను సహజ గురుత్వాకర్షణతో సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ప్రాణహిత ప్రతిపాదనకు 1975, 1978 అంతర్రాష్ట్ర ఒప్పందాలు బలమైన న్యాయ, సంస్థాగత పునాదిగా ఉన్నాయని మంత్రి తెలిపారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలు ప్రాణహిత ప్రాజెక్టును పరస్పర ప్రయోజనాల కోసం సంయుక్తంగా లేదా స్వతంత్రంగా అభివృద్ధి చేసుకునేందుకు ఆ ఒప్పందాలు అవకాశం కల్పించాయని గుర్తుచేశారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రయత్నం కొత్తగా పుట్టుకొచ్చిన ఆలోచన కాదని, దశాబ్దాల క్రితం ఏర్పడిన అంతర్రాష్ట్ర అవగాహనకు అనుగుణంగా తెలంగాణ ప్రయోజనాలను సాధించే ప్రయత్నమని పేర్కొన్నారు.అసలు ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి పథకం సుమారు 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూపుదిద్దుకుందని మంత్రి గుర్తుచేశారు. అనంతరం జరిగిన ప్రాజెక్టు పునరాకృతి, పునర్వ్యవస్థీకరణలో అసలు ప్రతిపాదిత ఆయకట్టులోని గణనీయమైన ప్రాంతాలు సాగునీటి ప్రయోజనాలకు దూరమయ్యాయని తెలిపారు.ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని దాదాపు రెండు లక్షల ఎకరాలకు సమర్థమైన సాగునీటి వనరు లేకుండా పోయిందన్నారు. తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటినా అసలు ప్రాణహిత-చేవెళ్ల పథకం ద్వారా నీరందుతుందని ఆశించిన రైతుల నిరీక్షణ కొనసాగుతూనే ఉందని ఆవేదన చెందారు.ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని చివరి ఆయకట్టు ప్రాంతాలు కూడా అసలు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. మహారాష్ట్రతో సానుకూలంగా, నిర్మాణాత్మకంగా చర్చలు జరుపుతూనే తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నదీజల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు."తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను కాపాడటం మా ప్రభుత్వ బాధ్యత. మహారాష్ట్రతో సుహృద్భావ వాతావరణంలో నిర్మాణాత్మక చర్చలు జరుపుతాం. గరిష్ఠ ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ, భారీ ఎత్తిపోతలపై ఆధారాన్ని తగ్గించి, రాష్ట్రంపై ఏటా పడే విద్యుత్ వ్యయభారాన్ని గణనీయంగా తగ్గించగల ప్రాణహిత ప్రాజెక్టును పునరుజ్జీవింపజేయడమే మా సంకల్పం. తెలంగాణ రైతాంగానికి ఒకప్పుడు ఇచ్చిన జలహామీని కార్యరూపంలోకి తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

# నేడు నీట్ పిజి పరీక్ష

>> ఇందులో ఒక్క గ్రేటర్ పరిధిలోనే 15 వేల మంది వరకు వుండడం గమనార్హం. నీట్ పిజి పరీక్షల కోసం బండ్లగూడలోని ఐఒ ఎస్ డిజిటల్ జోన్, వ్యాసపూరిలోని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి, చంద్రాయణగుట్టలోని అరోరా అకాడమి, ప్యారడైజ్ లోని ఇన్నోవిజన్ టెక్నాలజీస్, అబిడ్స్‌లోని మెథడిస్ట్ కాలేజి, షేక్‌పేట్‌లోని నారాయణమ్మ ఇంజినీరింగ్ కాలేజిలను ఎంపిక చేశారు. ఈ పరీక్ష ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుంది. నీట్ పిజి పరీక్షల నేపథ్యంలో పరీక్షలు జరిగే కాలేజీల పరి సర ప్రాంతాలలో ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు ట్రాఫిక్ అవ సరాలరు బట్టి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ సమయంలో ట్రాఫిక్ రద్దీ వుండే వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ సమయంలో ఆ యా మార్గాలలో ప్రయాణాలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచిం చారు. అత్యవసర స మయంలో 9010203626 నంబర్‌కు ఫోన్ చేయాలని వారు సూచించారు. ట్రాఫిక్ ఆంక్షల సమయంలో పోలీసులకు వాహనదారులు సహక రించాలని అధికారులు కోరారు.

# కేబినెట్‌లో కొత్తదనం రావాలి

>> 22ఏను రద్దు చేయాలని చెప్పారు. ఉచితాలు తగ్గించాలి. జెన్యూన్ లబ్ధిదారులకు పథకాలు ఇవ్వాలని చెప్పారు. బిపిఎల్,ఏపిఎల్ కార్డులపై సూచనలు చేశాను అయితే ఎవరూ పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఉద్యమకారు లకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి బహిరంగంగా మాట్లాడ కుంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడు. ఆయనను పనిచేయనీయాలి, ఆయనకు ఆటం కాలు సృష్టించవద్దు, స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వాలి, ముఖ్యమంత్రికి స్వేచ్ఛ ఉండాలి అని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు కాంగ్రెస్ కంటిన్యూ చేస్తుంది. పాత పథకాలు అమలు చేస్తూనే కొత్తవి తెచ్చారు. ప్రస్తుతం సామాన్యుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు, పథకాలపై సామాన్య ప్రజల్లో అసంతృప్తి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రచారం ఇంకా ఎక్కువగా జరగాల్సి న అవసరం ఉందన్నారు.

## వారం - వర్జ్యం

30-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, మఖకార్తె
తి.విదియ ఉ.9.35
న.ఉత్తరాభాద్ర రా.3.44
వ.మ.1.18-మ.2.54
దు.సా.4.38-సా.5.28
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** వైద్యుని మార్పు చేయడం వలన లాభపడ గలుగుతామని భావిస్తారు. ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉంటారు.

**వృషభం :** సుపరిచితులు కొందరు మీ సహాయాన్ని అర్థిస్తారు. ప్రతివారిని అనుమానాస్పద దృష్టితో చూస్తారు.

**మిథునం :** వృత్తి, ఉద్యోగాల పరంగా మీ కృషికి తగినటువంటి మంచి ఫలితాలను అందుకోగలుగుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం :** అన్ని రంగాల వారికి గతంలో కంటే నేడు ఎంతో కొంత ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**సింహం :** పని భారం వలన వత్తిడి అధికంగా ఉంటుంది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ప్రముఖుల పరిచయాలు.

**కన్య :** కీలక విషయాలలో వాయిదాలు వేయకుండా వెనువెంటనే నిర్ణయాలు తీసుకుని లాభ పడ గలుగుతారు.

**తుల :** కార్యాలయంలో ఉన్న పెండింగ్ వర్క్‌ను పూర్తి చేయడానికి ప్రాముఖ్యనిస్తారు. స్వల్ప ధనలాభం గడిస్తారు.

**వృశ్చికం :** సంస్థాగతంగా పురోభివృద్ధిని సాధించటమే తక్షణ కర్తవ్యమని భావిస్తారు. నూతన మిత్రుల పరిచయాలు. వాహన సౌఖ్యం.

**ధనుస్సు :** మంచి మాటకారితనం వలన అనుకూల ఫలితాలను ఎంతగా సాధించవలెనని అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు.

**మకరం :** దూరప్రాంతాల నుండి రావలసిన ధనం కొంత వరకు చేతికంది వస్తుంది. నూతన వాహన కొనుగోలు చేస్తారు.

**కుంభం :** నిజంగా మీ శ్రేయస్సు కోరుకునే వారు ఎవరన్నది తెలుసుకుంటారు. ఆర్థిక అంశాలపై దృష్టిని పెడతారు. వస్త్ర లాభం.

**మీనం :** భూ, గృహ, యంత్ర సంబంధితమైన విషయములకు సంబంధినటువంటి లావాదేవీలు సానుకూల పడతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గడువు పెంచండి

>> ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సి న అవసరం ఉందన్నారు.

సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు.

నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు.

ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 172 ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధృవపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు.

హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది ఓటర్ల నమోదు అధికారుల నియామకం సరిపోదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు పరిపాలనా, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

# తొలగని ముప్పు

>> కదులుతున్నప్పుడు పేరుకుపోయే రాళ్లు, మట్టి, ఇతర శిథిలాల కుప్పలు ఉన్నాయని కృష్ణ వాట్సా వెల్లడించారు. నేపాల్‌లో ఏర్పడిన ఈ సహజ సరస్సుల పరిస్థితిని భారత్ నేరుగా పరిశీలించే అవకాశం పరిమితంగా ఉండటంతో నిరంతరం పర్యవేక్షించాల్సి న అవసరం ఉందన్నారు. సహజంగా ఏర్పడే ఇలాంటి సరస్సులు భవిష్యత్తులో ఎలా మారతాయో పూర్తిగా అంచనా వేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన సరస్సును నోయిడాకు చెందిన సుహోరా టెక్నాలజీస్ గుర్తించింది. ఆగస్టు 27న తీసిన అత్యంత స్పష్టమైన ఉపగ్రహ చిత్రాల్లో ఆ సరస్సు నేపాల్‌టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ఎత్తైన లెండే ఖోలా ప్రాంతంలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. సుమారు 20.25 హెక్టార్ల విస్తీర్ణంలో కొత్త నీటి మడుగు కనిపించిందని సుహోరా పేర్కొంది. ఈనెల 26న సంభవించిన వరదలతో ఈ కొత్త సరస్సు పరిణామాన్ని నిశితంగా గమనించాల్సి న అవసరం ఉందని చెప్పింది. దాని విస్తీర్ణం, స్థిరత్వాన్ని ఉపగ్రహ చిత్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పుకొచ్చింది. నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా మృతుల సంఖ్య 700 దాటింది. మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ ఎస్పీ రమేశ్వర్ పౌడెల్ తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముఖం గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగపడతాయి. కాస్కి జిల్లా పోలీస్ చీఫ్ నబిన్ కార్కి ప్రకారం, బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన 'ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మే' కార్యక్రమంలో భాగంగా న్యూఢిల్లీలోని ధ్యాన్ చంద్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న కేంద్ర మంత్రులు మన్సుఖ్ మాండవీయ, అర్జున్ రామ్ మేఘ్వాల్

# ఎమ్మెల్సీ బేగ్ సస్పెన్షన్

>> పార్టీ వేటు వేయడంతో పా టు వెంటనే ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేయాలని ఆదేశించింది. మరో వైపు ఎంఎల్‌సి బేగ్ లైంగిక దాడికి స ంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని అత్తాపూర్ పోలీసులు తెలిపారు. మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్లు అభియోగాలు రావడ ంతో దీనిపై నిగ్గు తేల్చేందుకు బాలల సంరక్షణ కేంద్రం రంగంలో దిగి సమాచారం సేకరించిందని తెలిసింది. అత్తాపూర్ పరిధిలో గల ఓ బస్తీలో ఐదు రోజుల క్రితం మజ్లిస్ పార్టీ ఎంఎల్‌సి బేగ్ మారువేషంలో ఓ ఇంటికి వెళ్లి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు, ఈ సందర్భంగా కొందరు యువకులు అతన్ని పట్టుకుని చితకబాదినట్లు సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతునా ్నయి. పాతబస్తీకి చెందిన ఓ ఆన్ లైన్ ఉర్దూ పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. దీని తరువాత ఈ విషయం మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓ వైసికి తెలియడంతో బేగ్‌ను కొన్ని రోజుల పాటు ఉమ్రాకు పంపారని ఆ పత్రిక తెలిపింది. ఇది కాస్త రాజకీయంగా దుమారం రేపడంతో బేగ్‌ను మజ్లిస్ పార్టీ శనివారం సస్పెండ్ చేసింది. పార్టీలో వుండేవారు కచ్చితమైన ప్రమాణాలను పాటించాలని, అడ్డగోలు పనులు చేసేవారు ఎవరైనా వేటువేస్తామని పార్టీ అధినేత ఎంపి అసదుద్దీన్ ఓవైసి హెచ్చరించారు. బేగ్ ఉదంతం శనివారం నాడు మరింత దుమారం రేపింది. ఇదే సమ యంలో బేగ్ ఉమ్రా నుంచి తిరిగివచ్చారు. పార్టీ తనపై వేటువేసినా తాను ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేసేది లేదని ఆయన పేరొన్నట్లు తెలిసింది. 2023లో బల్దియా కార్పొరేటర్ల కోటాలో ఎంఎల్‌సిగా ఎన్నికైన బేగ్ 2029 వరకు ఆ పదవిలో కొనసాగనుండగా తాజా వివాదంతో ముందుగానే రాజీనామా చేయాల్సి న పరిస్థితులు నెలకొన్నాయి.

**అసలు కారణాలను ప్రజల ముందు ఉంచాలి: రాజాసింగ్**

ఈ నేపథ్యంలో బిజెపి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ, ఈ బహిష్కరణ పాతబస్తీ ప్రజల్లో అనేక సందేహాలను రేకెత్తించిందని అన్నారు. అర్ధరాత్రి వేళ అత్యవసరంగా ఇటువంటి చర్యలు తీసుకోవాల్సి న పరిస్థితులు ఎందుకు తలెత్తాయో పార్టీ నాయకత్వం వివరించాలని ఆయన ప్రశ్నించారు. అసదుద్దీన్ ఓవైసీ జాతీయ మీడియా ముందుకు వచ్చి, ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. భూవివాదాలు, లైంగిక వేధింపుల అంశాలకు సంబంధించిన ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్నాయని రాజాసింగ్ గుర్తుచేశారు. గతంలో తనను డీప్‌ఫేక్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని రహ్మత్ బేగ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తాజా పరిణామాలకు ఆ ఘటనతో ఏమైనా సంబంధం ఉందా అనే విషయంపై క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బిజెవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం, దిష్టిబొమ్మ దగ్ధం నిర్వహించారు. ఇదిలావుండగా మజ్లిస్ ఎంఎల్‌సి బేగ్ ఉదంతంపై తమకు ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని అత్తాపూర్ పోలీసులు తెలిపారు. దీనిపై తమకు కనీసం ఎవరూ ఫిర్యాదు కూడా చేయలేదని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు. మరోవైపు ఈ ఉదంతం రాజకీయంగా దుమారం రేగడంతో బాలల సంరక్షణ కేంద్రం రంగంలో దిగి సమాచారం సేకరిస్తోందని తెలిసింది. సుమోటోగా మొదట బేగ్‌పై వచ్చిప వీడియోలను ఈ కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఈ వీడియోలలో వున్న అంశాలు నిజమని తేలితే బాధిత బాలికను ఆమె కుటుంబీకులను బాలల సంర క్షణ కేంద్రం విచారించే వీలుంది.

# వచ్చే 8, 9న టెట్ పరీక్ష

>> పేపర్2 (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9న మిగిలిన మాధ్యమాలకు సంబంధించిన పేపర్2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ, సంబంధిత పాఠశాలల్లో పనిచేస్తూ.. ఇప్పటికీ నిర్దేశిత అర్హత ప్రమాణాలను సాధించని ఉపాధ్యాయుల కోసమే ఈ ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లు, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యాశాఖ సూచించింది. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది ఇన్‌సర్వీస్ టీచర్లు హాజరుకానున్నారు. సెప్టెంబర్ 8వ తేదీన ఉదయం షిఫ్ట్‌లో తెలుగు, హిందీ, కన్నడ, ఉర్దూ, మరాఠీ మీడియంలకు చెందిన పేపర్1 పరీక్షను 23 కేంద్రాల్లో 5,963 మంది అభ్యర్థులకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం షిఫ్ట్‌లో ఇంగ్లీష్, తెలుగు మీడియంల పేపర్2 (మ్యాథ్స్, సైన్స్, సోషల్) పరీక్షను 42 కేంద్రాల్లో అత్యధికంగా 15,071 మంది రాయనున్నారు. ఇక చివరిగా సెప్టెంబర్ 9వ తేదీన మధ్యాహ్నం షిఫ్ట్‌లో హిందీ, కన్నడ, ఉర్దూ, మరాఠీ, సంస్కృతం మీడియంల పేపర్2 పరీక్షను 16 కేంద్రాల్లో 3,949 మంది అభ్యర్థులకు నిర్వహించేలా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

>> చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు.కృష్ణానది తీరంలో, నల్లమల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పర్యాటక క్లస్టర్ సోమశిలలో మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సోమశిలను ప్రత్యేక గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేయడంతో తెలంగాణను గోల్ఫ్ టూరిజం హబ్‌గా మరింత బలోపేతం చేయవచ్చన్నారు. గోల్ఫ్ టూరిజం మౌలిక వసతుల అభివృద్ధిలో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ సందర్భంగా శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది, తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని.. అంతర్జాతీయ గోల్ఫ్‌ను తెలంగాణ పర్యాటక, వారసత్వ సంపదతో అనుసంధానించే వేదిక అని జూపల్లి అన్నారు. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, గోదావరి, కృష్ణా నదులు, రాజభవనాలు, కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో పర్యాటకం, క్రీడల ప్రచారం కోసం కపిల్‌దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని జూపల్లి తెలిపారు.

ఆయన అనుభవం, అంతర్జాతీయ గుర్తింపును రాష్ట్ర పర్యాటక, క్రీడా రంగాల ప్రచారానికి ఉపయోగించుకుంటామని చెప్పారు. టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న డీపీ వరల్డ్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఇతర భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పన కొనసాగిస్తామని చెప్పారు. డీపీ వరల్డ్ పీజీటీఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ తెలంగాణ టూరిజం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ టోర్నీ ద్వారా తెలంగాణ, హైదరాబాద్‌ను ప్రముఖ గోల్ఫ్ టూరిజం గమ్యస్థానాలుగా ప్రచారం చేయవచ్చన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అందిస్తున్న వేదికకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్విందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ.. 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు.

ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు. సెప్టెంబరు 1 నుంచి 4 వరకు జరిగే టోర్నీలో 132 మంది గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొననున్నారు. రూ.కోటి ప్రైజ్‌మనీ కోసం పోటీపడనున్నారు.

భారత్‌తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ గోల్ఫర్లు పాల్గొంటున్నారు. టోర్నీకి అధికారిక ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ పాయింట్లు లభించనున్నాయి. కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈఓ అమన్‌దీప్ జోల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్ తదితరులు పాల్గొన్నారు.

# 7 నుంచి అసెంబ్లీ

>> గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన బిఏసి సమావేశమై సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలన్న అంశంతో పాటు అజెండానూ ఖరారు చేస్తారు. అసెంబ్లీ,లోక్‌సభ ఎన్నికల్లో యువత పోటీచేసేందుకు వీలుగా వారి వయో పరిమితి 25 నుంచి 21కి తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ ఈ సెషన్‌లో రేవంత్ సర్కార్ తీర్మానం చేయనుంది.




## దేశ రాజధాని పరిసరాల్లో సీఎన్జీ ధరల పెంపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** దేశ రాజధాని ఢిల్లీతోపాటు దాని పరిసర ప్రాం తాలైన నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ వాహనదారులపై అదనపు భారం మోపింది. సీఎన్‌జీ ధరను కిలోకు రూ.3.89 మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. తాజా ధరల పెరుగుదలతో ఢిల్లీలో కిలో సీఎన్జీ ధర రూ.86.98 కి చేరింది. అదేవిధంగా నోయిడా, ఘజియాబాద్‌లలో రూ.95.59 గా, గురుగ్రామ్‌లో రూ.92.01 గా కొత్త ధరలు ఖరారయ్యాయి. మీరట్, ముజఫర్‌నగర్, షామ్లీ వంటి ప్రాంతాల్లోనూ పెరిగిన ధరలు అమలవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) ధరలు గణనీయంగా పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సీఎన్జీ ఉత్పత్తి కోసం అవసరమైన సహజ వాయువును ప్రధానంగా ఎల్ఎన్‌జీ రూపంలోనే దిగుమతి చేసుకుంటున్నారు. హార్ముజ్ జలసంధి గుండా సాగే ఇంధన రవాణాలో ఆటంకాలు ఏర్పడటం, శీతాకాలం దృష్ట్యా ఐరోపా దేశాలు తమ నిల్వలను పెంచుకోవడం వంటి పరిణామాల వల్ల సరఫరా వ్యయం పెరిగింది. పశ్చిమాసియా సంక్షోభం తలెత్తిన తర్వాత, మే 15 నుంచి ఇప్పటి వరకు సీఎన్జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. ఈ ధరల పెంపు ప్రభావం ప్రైవేట్ కార్లు, ట్యాక్సీలు, ఆటోరిక్షాలు సహా వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయంపై పడనుంది. పెరిగిన ఇంధన ఖర్చుల భారాన్ని వాహనదారులు ప్రయాణికులపై మోపే అవకాశం ఉంది. రవాణా ఛార్జీలు కూడా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## నీట్-పిజి పరీక్షకు కొన్ని గంటల ముందు విషాదం

### డిప్రెషన్‌తో ఎంబిబిఎస్ విద్యార్థిని ఆత్మహత్య

### ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని హాస్టల్‌లో ఘటన

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 29, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఆది వారం జరగనున్న నీట్‌పీజీ ప్రవేశపరీక్షకు కొద్దిగంటల ముందు నగరంలోని చిక్కడపల్లి తీవ్రవిషాదం చోటుచేసుకుంది. తీవ్ర మనస్తాపంతో ఎంబీబీఎస్ విద్యార్థిని ఒకరు హాస్టల్ గదిలోనే విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది. చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎల్. మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూ లుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్‌రెడ్డి కుమార్తె బండి యశ్విత(26) ఎంబీబీఎస్ పూర్తి చేసింది. వైద్యవిద్యలో పోస్ట్ గ్రాడ్యు యేషన్ (పీజీ) సీటు సాధించడమే లక్ష్యంగా ఆరు నెలలుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో ఉన్న అపరాజిత హాస్టల్‌లో ఉంటూ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతోంది. పరీక్ష ఆదివారం జరగాల్సి ఉండగా, శని వారం గదిలో ఒంటరిగా ఉన్న యశ్విత తీవ్రమనస్తాపానికి గురై విషం తాగింది. ఎంతసేపటికీ గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన తోటివిద్యార్థినులు, హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమా చారం ఇచ్చారు. చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి చూడగా ఆమె మృతిచెంది ఉంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చు రీకి తరలించారు. కాగా, యశ్విత కొంతకాలంగా తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతోందని, ఫలితంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న కుమార్తె పరీక్షకు కొన్ని గంటల ముందు బలవన్మరణానికి పాల్పడంతో ఆమె కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని చిక్కడపల్లి ఏసీపీ రణధీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎల్.మధుబాబు, అడ్మిన్ ఎస్ఐ మౌనిక సందర్శించారు.



## పుష్కర శోభకు భద్రాద్రి ముస్తాబు

### గోదావరి ఒడిలో పుణ్యవేళకు శ్రీకారం

### రామయ్య చెంతకు లక్షలాది భక్తుల రాకకు రంగం సిద్ధం

### రూ.49 కోట్లతో ఘాట్లు..

### రూ.351 కోట్లతో ఆలయాభివృద్ధి

**భద్రాచలం, ఆగస్టు 29, ప్రభాతవార్త:** గోదావరి పుష్కరాల ఆధ్యాత్మిక వైభవానికి భద్రాద్రి ఇప్పటి నుంచే ముస్తాబవుతోంది.2027 పుష్కరాలను పురస్కరించుకుని భద్రాచలంలో ఘాట్ల నిర్మాణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు.జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.పుష్కర ఏర్పాట్ల కోసం మూడు విడతల్లో దాదాపు రూ.49 కోట్లను వెచ్చించనున్నారు.మొదటి విడతలో రూ.46.65 కోట్లు, రెండో విడతలో రూ.1.75 కోట్లు, మూడో విడతలో రూ.60 లక్షలతో పనులు చేపట్టనున్నారు.వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రధాన పనులను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. భద్రాచలంతో పాటు పర్ణశాల, మోతేపట్టినగర్ తదితర ప్రాంతాల్లోనూ ఘాట్లను అభివృద్ధి చేయనున్నారు.

గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.రామయ్య దర్శనం.. గోదావరి పుణ్యస్నానం.. పుష్కర సంకల్పంతో భద్రాద్రి ఆధ్యాత్మిక క్షేత్రంగా మారనుంది.భక్తుల రద్దీకి అనుగుణంగా రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది.వైద్య శిబిరాలు, పారిశుద్ధం, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి అవసరం.కరకట్ట సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు.పుష్కరాల నేపథ్యంలో రవాణా, వసతి, అత్యవసర సేవలకు ముందస్తు కార్యాచరణ రూపొందించనున్నారు.

మరోవైపు రూ.351 కోట్లతో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఒకవైపు రామయ్య ఆలయ అభివృద్ధి.. మరోవైపు పుష్కర ఘాట్ల నిర్మాణం సాగుతోంది.ఇంకోవైపు భక్తులకు మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.దీంతో భద్రాచలం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.గోదావరి తల్లి ఒడిలో పుష్కర పుణ్యస్నానం.. రామయ్య సన్నిధిలో దర్శనం..2027 పుష్కర వైభవానికి భద్రాద్రిలో ఇప్పుడే మంగళఘోష మోగుతోంది!

# నేరాల నివారణలో ఎఐ, ఆధునిక సాంకేతికతను మరింత వాడాలి

### డిజిటల్ వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ అవసరం

### జిల్లా పోలీసు విభాగాల అధికారులకు డిజిపి ఆనంద్ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయినందున, వీటి నివారణకు కృత్రిమ మేధతో పాటు ఆధునిక సాం కేతికతను మరింతగా వాడాలని డిజిపి సి.వి ఆనంద్ తెలిపారు. దీంతో పాటు డిజిటల్ వ్యవస్థలపై నిరంతరం పర్యవేక్షణ వుండాలని ఆయన ఆ దేశించారు. రాష్ట్ర పోలీసు శాఖ అర్ధ సంవత్సర క్రైం రివ్యూ సమీక్షలో భాగంగా శనివారం రెండవ రోజు కమాండ్ కంట్రోల్‌లో జిల్లా పోలీసు వి భాగాల అధికారులతో డిజిపి కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేరాల పెరుగుదల, మారుతున్న వాటి స్వరూపం, వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేబట్టాలి, ఈ విషయంలో కృత్రిమ మేధ ఎంతమేర అవసరం అవుతుంది, ఆధునిక సాంకేతికను దీనికి ఎలా జోడించాలి...? అనే అంశాలపై ఆయన సమగ్రంగా వివరించారు. పోలీసింగ్‌లో దేశంలో తెలంగాణ పోలీసు విభాగం అగ్రభాగాన వుందని, దీనిని ఇదే విధంగా ముందుకు తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

సిసిటిఎన్ఎస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ఇందుకు అందరు సమిష్టిగా పనిచేయాలని ఆ యన కోరారు. పోలీసు శాఖలో అందుబాటులో వున్న సాంకేతిక ఆధారిత అప్లికేషన్లను మరింత విస్తృతంగా వాడాలని, డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందుకు సాగాలని డిజిపి సూచించారు. ఇందుకు అవసరమైన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆయ న తెలిపారు. కొత్త నేరాల చట్టాల అమలు, ఈ సాక్ష్య. ఈ ఫోరెన్సిక్, ఐసిజేఎస్ అనుసంధానం, జాతీయ స్థాయి పోర్టల్స్‌లో తెలంగాణ పోలీ సు పనితీరు ఎలా వుందనే దానిపైనా డిజిపి సమీక్షించారు. ఇందులో మెరుగు పడాల్సిన అంశాలపై మరింత దృష్టిసారించాలని ఆయన కోరారు. కోర్టు తీర్పుల గురించి డిజిపి మాట్లా డుతూ ఈ విషయంలో పోలీసులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. న్యాయ ప్రక్రియలను కచ్చితం గా పాటిస్తూ, కేసుల పురోగతిని సమర్థంగా పర్యవేక్షించాలని డిజిపి తెలిపారు. కేసుల విచారణ, కోర్టు విధానాలు, న్యాయపరమైన అంశాలపై క్షేత్రస్థాయి పోలీసులకు నిరంతర శిక్షణ ఇవ్వాలని డిజిపి తెలిపారు. పోలీసు శిక్షణా కాలేజీలలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులు రావాలని ఆయన సూచించారు. నేర నియంత్రణకు సంబంధించి వివిద ప్రమాణాల అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన పోలీసులను డిజిపి ఆనంద్ ఈ సందర్భంగా అభినందించారు. క్లస్టర్ 1లో హైదరాబాద్, క్లస్టర్ 2లో రామగుండం, క్లస్టర్ 3లో నల్లగొండ, క్లస్టర్ 4లో సూర్యాపేట్ మొదటి స్థానాల్లో నిలిచాయని డిజిపి తెలిపారు. ఇందుకదుగానూ ఆయా జిల్లాల అధికారులను ఆయన అభినందిం చారు. కృత్రిమ మేధ ఆధారిత అప్లికేషన్లను రూపొందించి పోలీసు శాఖలో అంతర్గత సామర్థ్యం మెరుగు పరిచేందుకు కృషిచేస్తున్న యువ ఐపిఎస్‌లను డిజిపి ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, పోలీసు అకాడ మి డైరక్టర్ అభిలాష్ బిస్త్, టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్, సిటీ కమిషనర్ సజ్జన్నర్, సిఐడి చీఫ్ చారు సిన్హా, ఈగల్ డైరక్టర్ సందీప్ శా ండిల్యా సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత

### సీజనల్ వ్యాధులు, పెరిగిన టైఫాయిడ్ కేసులు

### మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 29:** వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల పరిస్థితి, వ్యాధుల నివారణకు చేపడుతున్న చర్యలు, ప్రభుత్వ హాస్పిటళ్ల సంసిద్ధత, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా తదితర సీజనల్ వ్యాధుల ప్రస్తుత పరిస్థితి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన కేసులు, జిల్లాల వారీగా పరిస్థితి, ఫీవర్ సర్వేలు, దోమల నివారణ చర్యలు, ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల పనితీరు తదితర అంశాలను అధికారులు మంత్రికి వివరించారు.

2026 జనవరి 1 నుంచి ఆగస్టు 27 వరకు రాష్ట్రంలో నమోదైన సీజనల్ వ్యాధుల కేసులను గత ఏడాది ఇదే కాలంతో పోల్చగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, అక్యూట్ డయేరియల్ డిసీజ్, డిసెంట్రీ కేసులు తగ్గినట్లు అధికారులు తెలిపారు. అయితే, టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగినట్లు వివరించారు. కేసులు పెరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స అందించడం కంటే అవి వ్యాప్తి చెందకుండా ముందుగానే అరికట్టడం ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. అన్ని జిల్లాల ఆరోగ్య యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల కేసులు పెరుగుతున్నందున ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత పెంచాలని మంత్రి ఆదేశించారు. అధిక ప్రమాద ప్రాంతాలు, గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లు, నిర్మాణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉన్నతాధికారులు ఆయా జిల్లాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని మంత్రి సూచించారు. సర్వేలో గుర్తించిన ప్రతి జ్వరం కేసును పర్యవేక్షిస్తూ, అవసరమైన వారికి సకాలంలో పరీక్షలు,వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సాధారణ జ్వరం, డెంగ్యూ, మలేరియా లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలతో వచ్చే ప్రతి వ్యక్తికి ఆలస్యం లేకుండా పరీక్షలు నిర్వహించి తక్షణ చికిత్స అందించాలని ఆదేశించారు.

ఢిల్లీ, మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా/స్వైన్ ఫ్లూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఐఎల్ఐ (ఇన్‌ఫ్లూయెంజా లైక్ ఇల్‌నెస్) కేసుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్‌లో నమోదవుతున్న ఐఎల్ఐ కేసుల వివరాలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, వాటిపై వారానికి ఒకసారి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు రీఏజెంట్స్ సిద్ధంగా ఉన్నాయని, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పరిస్థితి పూర్తిగా నియంత్రణలోనే ఉందని అధికారులు మంత్రికి వివరించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులు, యాంటీ మలేరియల్ మందులు, లార్విసైడ్లు, ఇన్సెక్టిసైడ్లు, మలేరియా ర్యాపిడ్ డయాగ్నస్టిక్ కిట్లు, డెంగ్యూ, చికున్‌గున్యా పరీక్షా కిట్లు తదితర లాజిస్టిక్స్ అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ హాస్పిటళ్లలో అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

సీజనల్ కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రతి కేసును అత్యంత అప్రమత్తంగా పర్యవేక్షిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం, దోమల నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలని సూచించారు. జ్వరం లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ హాస్పిటల్‌ను సంప్రదించి వైద్యుల సలహా మేరకు పరీక్షలు, చికిత్స పొందాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మరో రూ.2 వేల కోట్ల రుణం

### వచ్చే నెల 1న రిజర్వ్ బ్యాంక్ వేలంలో సేకరణ

### ఐదు నెలల్లో రూ.36,900 కోట్లు సమీకరణ

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.2 వేల కోట్ల రుణాన్ని సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకు రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్ పెట్టింది. ఇందులో భాగం సెప్టెంబర్ 1న రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఈ వేలం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించనున్నట్లు ఇండెంట్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 1న ప్రతిపాదించిన రూ.2,000 కోట్లతో కలిపితే ప్రస్తుత 2026-27 లో ఇప్పటివరకూ ఐదు నెలల కాలానికి రిజర్వ్ బ్యాంక్ వేలాల ద్వారా రూ.36,900 కోట్ల మేర రుణం సేకరించింది. ఇందులో ఏప్రిల్‌లో రూ.6,900 కోట్లు, మే లో రూ.6 వేల కోట్లు, జూన్‌లో మరో రూ.6 వేల కోట్లు, జూలైలో రూ.13,500 కోట్లు, ఈ నెలలో రూ.4,500 కోట్ల మేర అప్పు చేసింది. ఇప్పుడు మరో రూ.2 వేల కోట్లతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.38,900 కోట్లకు రుణాలు చేరుకున్నాయి. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నిర్దేశించిన రాష్ట్ర వార్షిక రుణ పరిమితి రూ.58,458.71 కోట్లు. ఇందులో సెప్టెంబర్ 1న ప్రతిపాదించిన రూ.2 వేల కోట్లను కలుపుకుంటే మొత్తం వార్షిక రుణ పరిమితిలో సుమారు 66.5 ఇప్పటికే వినియోగించినట్లవుతుంది.

## పాడి కౌశిక్‌రెడ్డిపై అభియోగాలు వెనక్కి తీసుకోవాలి

### ఎథిక్స్ కమిటీ సమావేశంలో బిఆర్ఎస్ డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు29:** శాసనసభ ఎథిక్స్ కమిటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంశంపై చర్చ జరిగింది. చైర్మన్ రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన ఎథిక్స్ కమిటీ శనివారం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో సమావేశమైంది. ఈ భేటీలో పలు పార్టీలకు చెందిన ఎథిక్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డిపై చేసిన అభియోగాలు తొలగించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కడియం శ్రీహరిని ఉద్దేశించి చేయి చూపించి బెదిరించారని, అసభ్య పదజాలంతో దూషించారని కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు రెండు అభియోగాలు మోపారు.వీడియోలో సైగలు తప్ప వాయిస్ లేదని, ఇతర సభ్యుల వ్యాఖ్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. వివరణ చెప్పుకోవడానికి కౌశిక్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ సభ్యులు కోరారు. మరోవైపు.. సభా హుందాతనాన్ని గౌరవించాలని కాంగ్రెస్ సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌశిక్ రెడ్డిపై అభియోగాలు వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్, భాజపా సభ్యులు ప్రతిపాదించారు. ఎథిక్స్ కమిటీలో కూడా భాజపా, బీఆర్ఎస్ కలిసే పనిచేస్తున్నాయని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. వచ్చే సమావేశానికి కౌశిక్ రెడ్డి, కడియం శ్రీహరిని పిలవాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది. కమిటీ సమావేశానికి సిపిఐ తరఫున కూనంనేని సాంబశివరావు, బీఆర్ఎస్ తరఫున వేముల ప్రశాంత్‌రెడ్డి, టి.పద్మారావుగౌడ్ హాజరయ్యారు. కాగా, ప్రశాంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేస్తూ పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల పై వివాదం జరిగిన రోజు 23 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో అసెంబ్లీ లో మాట్లాడించారు. అది మూడ్ అఫ్ ది హౌజ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ సభ్యుల మాటల ఆధారం గా పాడి కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఎజెండాగా చేర్చారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి అసభ్య పదజాలం పై ఎథిక్స్ కమిటీ చర్చించాలని అసెంబ్లీ చైర్మన్‌ను కోరామని తెలిపారు. రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, మందుల శామ్యూల్స్ సభలో అనుచితంగా మాట్లాడటం, ప్రవర్తించడంపై ఎథిక్స్ కమిటీకి రాతపూర్వకంగా పిర్యాదు చేశామని, వారు మాట్లాడిన వీడియోలు ఆధారంగా సమర్పించామని వివరించారు. తమ విజ్ఞప్తిపై నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డికి సమాధానం చెప్పుకునే అవకాశం ఇవ్వాలని కోరామని తెలిపారు. కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గత ప్రభుత్వపథకాలు కొనసా గుతున్నాయనడంలో నిజంలేదని స్పష్టంచేశారు. రైతు బీమాకు ప్రీమియం కట్టక పోవడంతో దానిని నిలిపివేశారని ఆరోపించారు. కొండా సురేఖ వ్యవహా రంపై ఏంజరుగుతుందో తెలియదు. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమేనన్నారు.

## క్యూర్ పరిధిలో కొనసాగుతున్న టిజి సేఫ్ దాడులు

### రెస్టారెంట్లలో నాణ్యతలేని ఆహార వస్తువుల గుర్తింపు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) దాడుల పరంపర కొనసాగుతూనే వుంది. శనివారం నాడు క్యూర్ (ఓఆర్ఆర్) పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న ఏడు రెస్టారెంట్లపై టిజి సేఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన మొదటి సారిగా దాడులు నిర్వహించిన టిజి సేఫ్ 25వ తేదీన రెండవ దఫా దాడులు చేబట్టింది. కల్తీ ఆహార వస్తులను గుర్తించి తొలగించడం, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల విక్రయాలను అడ్డుకోవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న టిజి సేఫ్ అధికారులు మూడవసారి రెస్టారెంట్ల దాడులు నిర్వహించారు. టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో పలు బృందాలు పాల్గొన్నాయి.

దాడుల సందర్భంగా పలుచోట్ల ఆహార వస్తువుల విక్రయాల కేంద్రాల వద్ద పరిశుభ్రత లేకపోవడం వెలుగు చూసింది. ఆహార వస్తువులను నిలువ వుంచే పద్ధతులు సవ్యంగా లేకపోవడం గుర్తించారు. కుళ్లిపోయిన కూర గాయలను మంచివిగా చెబుతూ అమ్ముతున్నట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు చాలాచోట్ల కనిపించలేదు. ఆహార వస్తువులు నిలువవుంచే ప్రాంతాలు సవ్యంగా లేదు.

కొన్నిచోట్ల కుళ్లిపోయిన కూరగాయాలు వుండగా వాటిని జప్తు చేశారు. దీనిపై రెస్టారెంట్ల నిర్వాహకులకు సంజాయిషీ కోరారు. ఈ సందర్భంగా 11 ఆహార వస్తు వుల శ్యాంపుల్స్ సేకరించగా నాలుగింటికి ప్రమా ణాలు సరిగ్గా లేకపోవడంతో వాటిని వెంటనే మెరుగుపరచుకోవాలని నోటీసులు ఇచ్చారు. మూడు రెస్టారెంట్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

## ఆరోగ్య రంగంలో అద్భుత ప్రగతి సాధిస్తోన్న భారత్

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ఆరోగ్య రంగంలో దేశం ఎంతో ప్రగతిని సాధిస్తుందని, కిడ్నీ వ్యాధుల నివారణ ప్రాముఖ్యత ఇస్తున్నాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. శనివారం నగరం లోని ఒక హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిడ్నీ సింపోజియం-2026 కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కిడ్నీ సంరక్షణ, అవయవ మార్పిడి, ఆధునిక వైద్య చికిత్స రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న హాస్పిటల్స్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెనల్ సైన్సెస్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వివరించారు.

వైద్య రంగంలో కేంద్ర ప్రభుత్వ చొరవ గణనీయమైన మార్పులు, గత దశాబ్ద కాలంలో భారతదేశ వైద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కిషన్ రెడ్డి తెలిపారు. దేశంలో వైద్య విద్య మౌలిక వసతులు భారీగా విస్తరించాయని పేర్కొన్నారు. 2014లో 387గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ప్రస్తుతం 846కు పెరిగిందన్నారు. 51,348 ఎంబిబిఎస్ సీట్ల నుంచి దాదాపు 1.4 లక్షలకు చేరుకున్నాయి. 2014లో కేవలం 7 ఎయిమ్స్ ఉండగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 23 ఎయిమ్స్‌లు సేవనందిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడానికి 1.86 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన వైద్య ఖర్చుల భారం సామాన్యులపై తగ్గింది. అలాగే 20,000 పైగా జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు.

## నీళ్లను ఆంధ్రకు తరలిస్తుంటే మాట్లాడరెందుకు?

### ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కెటిఆర్ ఆధ్వర్యంలో ఆందోళనలు

### మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29, ప్రభాతవార్త :** తెలంగాణ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో వెనక్కి వేయబడిందని, పరిపాలన పై దృష్టి పెట్టకుండా.. కుమ్ములాటలు.. కొట్లాటలు.. వాళ్ళ సర్దుబాట్లు తప్ప ప్రజల గురించి ఆలోచన చేయడం లేదని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలకు తెగించి కెసిఆర్ నాయకత్వం లో తెలంగాణ తెచ్చుకుంటే ఇప్పుడు అన్ని రంగాల్లో వెనక్కి నెట్టి వేయబడిందన్నారు. కెసిఆర్ హయాంలో వివిధ రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ నిలిపామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కెసిఆర్ ఆదేశాల ప్రకారం కేటీఆర్ ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమలు ప్రకటించారని తెలిపారు.

## మీరేమైనా దేవుడనుకొంటున్నారా?

### ఎఫ్‌డిఎ అధికారులపై బాంబే హైకోర్టు ఆగ్రహం



**ముంబయి, ఆగస్టు 29:** 'మీరేమైనా ఈ వ్యవస్థకు దేవుడినని భావిస్తున్నారా? కోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయరా?' అంటూ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆహార భద్రతా నిబంధనలను 88 శాతం మేరకు కచ్చితంగా పాటిస్తున్నట్లు స్వయంగా తనిఖీల్లో తేలినప్పటికీ, రెస్టారెంట్ల లైసెన్సుల నిలిపివేత ఎత్తివేసేందుకు నిరాకరించిన ఎఫ్‌డీఏ తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో మండిపడింది. అధికారుల మొండి వైఖరిపై విసిగిపోయిన ధర్మాసనం తక్షణమే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరిస్తూ, బాంద్రాకుర్లా కాంప్లెక్స్ లోని ముంబై క్రికెట్ అసోసియేషన్ ప్రాంగణంలో మూతపడిన ఐదు ప్రముఖ రెస్టారెంట్లను వెంటనే తెరుచుకోవచ్చని సంచలన తీర్పునిచ్చింది. 88 శాతం నిబంధనలు పాటించినా మళ్లీ ఆంక్షలా పరిశుభ్రత లోపాలు, మూడో వ్యక్తికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారనే నెపంతో ఎఫ్‌డీఏ అధికారులు ఎంసీఏ ప్రాంగణంలోని ఐదు రెస్టారెంట్ల లైసెన్సులను రద్దు చేస్తూ గతంలో ఆదేశాలు ఇచ్చారు. దీనిపై ఎంసీఏ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది.

ఇటీవల నిర్వహించిన తాజా తనిఖీల్లో ఈ రెస్టారెంట్లు 88 శాతం ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటిస్తున్నాయని స్పష్టమైంది. అయినప్పటికీ, లైసెన్సులు ఎంసీఏ పేరిట ఉండి.. నిర్వహణ మాత్రం షిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వద్ద ఉందనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి ఎఫ్‌డీఏ ఆంక్షలు కొనసాగించడమే వివాదానికి మూలకారణంగా మారింది. కోర్టు మాట వినకపోతే జైలుకే పంపుతాం టెక్నికల్‌గా కాకుండా వ్యవహారికంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని గత విచారణలోనే ఎఫ్‌డీఏకు సూచించామని, అయినా అధికారులు కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి మొండిగా ప్రవర్తించారని తాత్కాలిక చీఫ్ జస్టిస్ జస్టిస్ రవీంద్ర ఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖాడ్‌ల ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ప్రతిసారీ డిపార్ట్మెంట్ అధికారులకు మొట్టికాయలు వేసి అలసిపోయాం. ఇప్పుడు కఠినమైన చర్యలు తీసుకోక తప్పడం లేదు. బాధ్యులైన అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించి జైలుకు పంపడానికైనా వెనుకాడబోం' అని న్యాయ మూర్తులు హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వం
శ్రీ స్థంబాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం (గుట్ట)
ఖమ్మం (పట్టణము & జిల్లా)
ఆర్.సి.నెం. 11/2026 టెండర్-కం-బహిరంగ వేలము ప్రకటన-3 తేది: 28.08.2026
శ్రీ స్థంబాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము (గుట్ట) ఖమ్మం జిల్లా & పట్టణము నందు షాపుల టెండర్స్ తేది.08.09.2026 రోజున ఉదయం 11-00 గంటల నుండి ఈ దిగువ ప్రకారముగా నిర్వహించబడును. క్ర.సం. టెండర్ వివరములు, విస్తీర్ణము, ధరావత్తు రూ॥ డి.డి/నగదు ద్వారా, షెడ్యూల్ ధర నగదు రూ., కాలపరిమితి: 1) షాపు నెం.3, 20x10=200, రూ.50000/-, రూ.300/-, 2) షాపు నెం.5, 20x11-220, రూ.50000/, రూ.300/-. తేది: 01.10.2026 నుండి తేది: 30.09.2026 (మూడు సంవత్సరాలు). టెండర్-కం-బహిరంగ వేలం షరతులు: 1). ఇట్టి టెండర్‌లో పాల్గొనువారు 50,000/-రూ॥లు డిపాజిట్ డి.డి ద్వారా కార్యనిర్వహణాధికారి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము (గుట్ట) ఖమ్మం పేరున చెల్లించి పాటలో పాల్గొనవలెను. 2). బకాయిదారులు పాటలో పాల్గొనుటకు అనర్హులు. 3). పాట నిలిపివేయుటకు, రద్దు చేయుటకు దేవస్థానము కార్యనిర్వహణాధికారికి పూర్తి అధికారము కలదు. మిగతా షరతులు పాటముందు ప్రకటించబడును. వివరములకు 9848449335 ద్వారా గాని కార్యాలయంలో గాని సంప్రదించగలరు.
సం/- కార్యనిర్వహణాధికారి, శ్రీ స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం (గుట్ట),
DIPR.No.8851-PP/CL/Advt/1/2026-27, తేది: 29.08.2026 ఖమ్మం టౌన్ & జిల్లా

కృష్ణా నది జలాల వివాదం,తాజా వర్షాభావ పరిస్థితులపై కృష్ణానది యాజమాన్య బోర్డు ఆగస్టు 2026లో కీలక సమావేశం నిర్వహించింది కొన్ని ప్రాథమిక నిర్ణయాలు తీసుకుంది. ఎగువప్రాంతాల నుండి శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలకు వరద ప్రవాహం భారీగా తగ్గడంతో ఉమ్మడి రిజర్వాయర్లలో ఉన్న నీటిని ఎలా ఉపయోగించాలనే దానిపై బోర్డు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది.ఆగస్టు 2026 నాటి సమావేశంలో కేఆర్ ఎంబి తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి. అందువల్ల, ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, సాగునీటికి (ఇరిగేషన్) ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని బోర్డు స్పష్టం చేసింది. అక్టోబర్ 2026 వరకుమ తాగునీటి అవసరాల కోసం 47 టీఎంసీల నీరు కావాలని ఏపీ బోర్డును కోరింది. ఇందులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 22టీఎంసీలు, హంద్రీనీవా ద్వారా 11 టీఎంసీలు, సాగర్ కుడి కాల్వ ద్వారా 7 టీఎంసీలు, కృష్ణా డెల్టా సిస్టమ్ కోసం 6 టీఎంసీలు కావాలని ఇండెంట్ పెట్టింది. ఏపీ అవసరాలకు తమకు నిర్దేశించిన కోటాలకంటే 10 టీఎంసీల నీటిని అదనంగా వాడుకుందని తెలంగాణ అధికారులు బోర్డుకు ఫిర్యాదు చేశారు. అలాగే ఉమ్మడి జలాశయాల నుండితాగునీటి విడుదలను 50:50 నిష్పత్తిలో సమానంగా పంచాలని తెలంగాణ డిమాండ్ చేసింది. 3. తుది నిర్ణయం వాయిదా 4)రెండు రాష్ట్రాలు తమ వార్షిక నీటి అవసరాల పూర్తి వివరాలను (యాన్యువల్ ఇండెంట్) వేర్వేరు కాల పరిమితులతో సమర్పించాయి. దీనివల్ల ఏ రాష్ట్రానికి ఎన్ని టీఎంసీల నీరు తాగునీటి కింద కేటాయించాలనే తుది నిర్ణయాన్ని సెప్టెంబర్ 4, 2026న జరిగే తదుపరి సమావేశానికి బోర్డు వాయిదా వేసింది.

# ఎల్‌నినో ఎఫెక్ట్..సాగు సగమే

**నెలవెల్ల సతీష్‌కుమార్ రెడ్డి**

పసిఫిక్ మహా సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వర్షపాతంపై ప్రభావం చూపే వాతావరణ నమూనాయే ఎల్‌నినోగా చెప్పవచ్చు. దీనివల్ల రుతుపవనాలు బలహీనంగా,ఆలస్యంగా, అసమానంగా ఉండవచ్చు. వర్షాధార పంటలపై ఇది ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం ఏడాదికొకవిధంగా మారుతుంటుంది. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది. వానలోటుతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఇప్పటికే వేసిన పంటలు ప్రమాదంలో ఉన్నాయి. నైరుతి రుతు పవన (జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు) కాలంలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే సుమారు 13 శాతం తక్కువగా ఉండగా, ఆగస్టు 25 నాటికి రాష్ట్రంలో 51శాతం వాన లోటు నమోదైంది. ఇది దేశవ్యాప్త లోటుకు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తెలంగాణలో వర్షపాతం గణనీయంగా తగ్గడంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను నిరంతరం విశ్లేషిస్తూ, పంటల సరళిలో మార్పుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది. ఇందులో భాగంగానే రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గేఅవకాశం ఉన్నందున, రైతులు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల వంటి తక్కువ నీటిఅవసరమయ్యే పంటలను ఎంచుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి సూచించారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం సుమారు ఒక మీటర్ మేర క్షీణించిందని ఆయన తెలిపారు. రైతుల ప్రయోజనార్థం జిల్లాస్థాయిలో ప్రత్యేక సలహాలను, పంటల యాజమాన్య వ్యూహాలను సిద్ధంచేస్తున్నట్లు వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం 27 మంది సభ్యులతో ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన బుధవారంప్రజా భవన్‌లో ఈ కమిటీ తొలిసారిగా సమావేశమైంది. భారత వాతావరణ విభాగం, ఇక్రిశాట్, ఇకార్‌క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలతో పాటు పలుప్రముఖ సంస్థల నిపుణులు ఇందులో సభ్యులుగాన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ వర్షపాత లోటు ఉంది. దీంతో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టింది. రైతుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వాతా



వరణ ఆధారిత (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పంటల బీమా నమోదు గడువును జూలై31వరకు, దిగుబడి ఆధారిత పంటల బీమా (పీఎంఎఫబీవై)గడువును ఆగస్టు 31వరకు పెంచారు. దీనివల్ల ఉద్యాన పంటల బీమా కవరేజ్ గణనీయంగా పెరిగి, మరిన్ని పంటలకు బీమా వర్తించింది. ఎల్‌నినో సమయంలో పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక రక్షణగా నిలుస్తోంది పంటల బీమా! ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఆరు తడి పంటలు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి వైపు వెళ్లకుండా సజ్జ, జొన్న, రాగి, వరిగలు, కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి వాటితో పాటు ఆవాలు, టమాట, సోర, వంగ, బీర, దోస, కాకర వంటి కూరగాయలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో సాగు నీళ్ల కరవై పంటల సాగుపై ప్రభావం చూపుతున్నది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ప్రాజెక్టులన్నీ ఖాళీ కుండలను తలపిస్తున్నాయి. వెరసి పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఈ పరిస్థితులతో గతఏడాదితో పోల్చితే పంటల సాగు భారీగాతగ్గే అవకాశం ఉన్నదని వ్యవసాయశాఖఅంచనా వేసింది. గత ఏడాది 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కాగా ఈ సీజన్‌లో ఇది 1.06కోట్ల ఎకరాలకే పరిమితమయ్యే అవకాశమున్నదని అంచనా వేసింది. అంటే సుమారు 32.20 లక్షల ఎకరాల్లో పంటల సాగు తగ్గుతుందని స్పష్టం చేసింది. గత ఏడాది వానకాలంతో పోల్చితే 23శాతం సాగు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 73.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు నివేదికలో పేర్కొన్నది. గతఏడాది ఇదే సమయానికి 78లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే గత ఏడాదితో చూస్తే 4.64 లక్షల ఎకరాల్లో పంటలు తక్కువగా సాగయ్యాయి.ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా వరిసాగుపై పడుతున్నది. సాగునీరు అధికంగా అవసరముండే పంట కావడం, వర్షాలు లేకపోవడంతో వరి సాగు సగానికి సగం తగ్గే అవకాశం ఉన్నది. గతఏడాది వానకాలంలో 70లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా ఈ సీజన్‌లో 38.51 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యే అవకాశమున్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అంటే 31.38లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గుతుందని పేర్కొన్నది. ఇప్పటి వరకు 14.09 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడినట్లు తెలిపింది. పత్తి 4.77 లక్షల ఎకరాల్లో తగ్గనున్నది. గత ఏడాది 50.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా ఈసీజన్‌లో 45.92 లక్షలఎకరాల్లోనే సాగైంది. ఇక మక్కజొన్న 40వేల ఎకరాల్లో తగ్గే అవకాశమున్నది. 25 జిల్లాల్లో రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాలు, గ్రామాలు ఎల్‌నినో బారినపడుతున్నాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఇప్పటివరకు 25కు పైగా జిల్లాలో లోటు వర్షపాతం నమోదైనట్లుగా పేర్కొంది. ఇక 355 మండలాల్లో లోటు వర్షపాతం, 42మండలాల్లో అత్యంతలోటు వర్షపాతం, 186 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. ఇక గ్రామాల విషయానికొస్తే దాదాపుగా అన్ని గ్రామాలపై ఎల్‌నినో ప్రభావం ఉన్నట్లుగా పేర్కొంది. అయితే ఇందులో సుమారు 8 వేల గ్రామాలపై మధ్యస్థ ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నది. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతున్నట్లుగా వ్యవసాయశాఖ వెల్లడించింది. గత ఏడాది (2025) శ్రీశైలం నుంచి మొదటి సారి జూలై 8, 2025న క్రెస్ట్ గేట్లు 6, 7, 8,11 నంబర్‌గల 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేశారు. వరద ఉధృతి పెరగడంతో అదే నెల జూలై 29, 2025న 6 గేట్లను, ఆ తర్వాత ఆగస్టు మాసంలోనూ వరద ఆధారంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. గత ఏడాది వరదలు భారీగా రావడంతో దాదాపు 4 సార్లకు పైగా విడతలవారీగా గేట్లు ఎత్తాల్సి వచ్చింది.గత ఏడాది భారీ వరదలతో పోలిస్తే, ఈసారి వర్షాభావ పరిస్థితులు,వరదలు తగ్గడం వల్ల కృష్ణా జిల్లా తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటోంది. గత ఏడాది శ్రీశైలం, సాగర్ గేట్లు పదేపదే ఎత్తడం వల్ల దిగువన ఉన్న కృష్ణా డెల్టా ప్రాంతం నీటితో కళకళలాడింది. కానీ ఈసారి సాగునీరు, తాగు నీటి సంక్షోభం తలెత్తింది. దీంతో రైతులు ఖరీఫ్ వరి నాట్లు వేయలేకపోయారు. అధికారులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచిస్తున్నప్పటికీ, స్థానిక నేలలు వరికి మాత్రమే అనుకూలంగా ఉండటంతో రైతులు పంట విరామం ప్రకటించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదిలా ఉండగా నాగార్జున సాగర్ వద్ద ఘర్షణ ఆగస్టు 26, 2026న ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేఆర్ఎంబి అనుమతి ఉందంటూ ఆంధ్రప్రదేశ్ అధికారులు నాగార్జున సాగర్ కుడి కాల్వ గేట్లను తెరిచి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీనికి కౌంటర్‌గా తమకు ఎలాంటి సమాచారం లేదంటూ తెలంగాణ అధికారులు కూడా ఎడమ కాల్వ గేట్లనుతెరిచి సమానంగా నీటిని విడుదల చేయడంతో సాగర్ వద్ద మళ్లీ కృష్ణా జలాల యుద్ధం మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ,సెంట్రల్ వాటర్ కమిషన్ సెప్టెంబర్ 7, 2026న ఢిల్లీలో ఇరు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులతోప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. వర్షాభావం వల్ల జలవివాదాలు మరింతపెరిగే అవకాశం ఉన్ననేపథ్యంలో ప్రత్యామ్నాయంపై దృష్టి సారిస్తూ వివాదాలకు తావులేకుండా ఇతరరాష్ట్రాలకు ఆదర్శంగాఉంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నది. ●

తమిళనాడు

ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో సవాళ్ల నడుమ సాగుతున్న నడకలో విజయ్‌కి ముఖ్యమంత్రిగా మొదటి వంద రోజులు పూర్తయ్యాయి. రాజకీయాల్లో తమిళ వెట్రి కజగం (టివికె) పార్టీని స్థాపించి రెండేళ్లలోనే ముఖ్యమంత్రి కావడం సినిమా నటుడైన విజయ్ సాధించిన తొలి విజయం అనుకుంటే, ఆ పదవిలో తొలి వంద రోజులు పూర్తి చేయడం మలి విజయం అనే చెప్పాలి. ఎందుకంటే.. ఆయనను పదవిలోకి రాకుండా, వచ్చినా కొద్ది రోజుల కంటే నిలబడకుండా చేయడానికి జరిగిన యత్నాలు ఈ వంద రోజుల్లో ఒకటీ రెండు కావు. అసెంబ్లీలోకి ప్రవేశించడం నుంచి అనేకానేక కొత్త పథకాలను ఇబ్బడిముబ్బడిగా ప్రకటించడం ద్వారా రోజు రోజుకు తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటూ ఆయన ముందుకు సాగుతున్నట్లుగా కనిపిస్తుంది. ఆయన పార్టీ గుర్తు విజిల్. అది అప్రతిహతంగా ధ్వనిస్తూనే ఉంది. పార్టీ ఆవిర్భవించిన గత రెండేళ్లుగా విజిల్ మోత వినిపిస్తూనే ఉంది. విమర్శకుల ప్రశంసలు సైతం అందుకొంటూ ఆయన ప్రకటిస్తున్న పథకాలు ప్రజల ఆదరణ పొందుతున్నాయి. ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం,యేడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం ప్రజల మెప్పును ఎక్కువగా పొందాయి. మహిళా భద్రతకు ఉద్దేశించినప్రత్యేక దళాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన 65 ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌లు, 717 మద్యం దుకాణాల మూసివేత వంటి నిర్ణయాలు కూడా చక్కని ప్రజాదరణ పొందాయి. విద్యార్థులకోసం రెండు వేల కోట్లతో లాప్‌టాప్ పథకం, 710 కోట్లతో కామరాజ్ అల్పాహార పథకం, ఆరు వేల కోట్లతో గ్రామీణ మౌలిక సదుపాయాలు వంటి పథకాలు కూడా ప్రశంసలనందుకొన్నాయి. ఆగస్టు 5న ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్‌లో 'జెన్ జి' ని ఆకర్షించే పలు పథకాలు ప్రకటించడం ఆయన ముందు చూపునకు నిదర్శనం. పాఠశాల నుంచే ఎఐ విద్య, ఐటిఐల్లో ఎఐకోర్సులు, ఐదులక్షల మంది ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎఐ శిక్షణ వంటి అనేక బడ్జెట్ ప్రతిపాదనలు దానిలో ఉన్నాయి. 100 రోజులు పూర్తయిన సందర్భంగా విజయ్ ప్రభుత్వం ఒక ప్రోగ్రెస్ రిపోర్ట్ సమర్పిస్తూ 1.2 లక్షల కోట్ల

# విజిల్ @100

**ఎ.వి.వి ప్రసాద్**

రూపాయల పెట్టుబడి ప్రతిపాదనలు చేయడం విశేషం. ప్రకటించిన పథకాల్లో 90 శాతం అమలులోకి రావడంతో విజయ్ సక్సెస్ రేట్ బాగా పెరిగిం ది. ఇండియా టుడే సర్వే ప్రకారం విజయ్‌కి ప్రజాదరణ 70 నుంచి 75 శాతం దాకా ఉన్న ట్లు తెలుస్తోంది. కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం గా విజయ్ దాదాపు 35 శాతం ఓట్లతో గత మే నెలలో అధికారంలోకి వచ్చారు. ఆయన వ్యవహార శైలి విభిన్నంగా ఉండడంతో ప్రజలను ఆకర్షించినా,పథకాల అమలుతో ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని సాధించగలిగింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో టివికెకు తగినంత బలం ఇంకా చేకూరలేదనే అభిప్రాయం ఉంది. సినిమా రంగానికి చెందడంతో ఆ ఆకర్షణ



ముఖ్యమంత్రి విజయ్

ఆయనకు కలిసివచ్చిందనే వాదన కూడా సబబు కాదు. అలా కలిసి వస్తే మెజాటీకి దూరంగా 108 సీట్లు మాత్రమే ఎందుకు వస్తాయి! కాంగ్రెస్, మిత్ర పక్షాల మద్దతుతో ఎట్టకేలకు అధికారంలోకి వచ్చినా బాలారిష్టాలు ముసురుతూనే ఉన్నాయి. అధికారం కోల్పోయిన స్టాలిన్ తొలుత విజయ్‌ని తీవ్రంగా విభేదించినా, కొద్ది రోజుల్లోనే 'అసలు సినిమా చూస్తా' రంటూ శాపాలు పెట్టినా అటువంటి ' సినిమా' ఏదీ తెరపైకి రాకపోవడం గమనించవలసిన విషయం. పూర్తి మెజారిటీ లేకపోవడంతో విజయ్‌ని ఓ ఆట ఆడిద్దామనే స్టాలిన్ అనుకొన్నారు. అయితే విజయ్ ప్రకటించిన పథకాలే ఇప్పుడు ఆయనకు శ్రీరామ రక్ష అవుతున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలన నుంచి తమిళనాడుకు విముక్తి కలిగించి డిఎంకె, అన్నా డిఎంకెలను పక్కకు నెట్టిన 'నాయకుడు'గా ఎదుగుతున్న విజయ్ పరుగుకు బ్రేక్ వేసే యత్నాలు గత వందరోజుల్లో చాలానేజరిగాయి. 2026 ఎన్నికల్లో డిఎంకె పార్టీకి 24 శాతం ఓట్లు రాగా, అన్నాడిఎంకెకు 21శాతంవచ్చాయి. విజయ్‌ని ఓడించాలంటే ఈ రెండు పార్టీల ఓట్ల శాతాలు ఏకం కావాలి. విజయ్ ప్రమాణ స్వీకారానికి ముందు అటువంటి ప్రయత్నం కూడా ఒకటి జరిగింది. రజనీకాంత్ స్టాలిన్‌తో జరిపిన ' ప్రత్యేక భేటీ' అప్పట్లో సంచలనం సృష్టించింది. విజయ్ ప్రమాణ స్వీకార హడావుడిలో ఆ వార్త మరుగున పడినా, అది ఇప్పటికీ కదులుతూనే ఉంది. డిఎంకె, అన్నాడిఎంకెను ఒక తాటి పైకి తేవడమే లక్ష్యంగా రజనీకాంత్ ఆ చర్చలు జరిపినట్లు అప్పట్లో అంతా చెప్పుకొన్నారు. ఆ రెండు పార్టీలు కలుస్తాయా? అనే ప్రశ్నకు జవాబు చెప్పలేం. ఎంచుకొనే లక్ష్యాన్ని బట్టి ఏది జరగడానికైనా అవకాశం ఉంటుంది. ఆ ప్రయత్నం కొనసాగితే రాజకీయ సమీకరణాలు కూడా మారుతాయి. అది పసిగట్టడం వల్లనే అన్నాడిఎంకెలో చీలిక తేవడానికి విజయ్ చాలా పెద్ద ప్రయత్నమే చేసినట్లు వినిపించింది. చాప కింద నీరులా ఆ కథ నడుస్తూనే ఉంది. ఇప్పటి వరకు చూస్తే విజయ్ పాలన ఇంకా 'విజయ వంతమైన ప్రారంభం' గానే చెప్పాలి. విజయవంతమైన సిఎం కావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. ముందు అనేక సవాళ్లను అధిగమించవలసి ఉంటుంది. పరందూరు రెండో విమానాశ్రయం ప్రాజెక్టు రద్దు, కావేరీ జల వివాదం ప్రస్తుతం ఆయన మెడకు చుట్టుకొంటున్నాయి. కరూర్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలిస్తూ విజయ్ తీసుకొన్న నిర్ణయాన్ని హైకోర్టు తిరస్కరించడం కూడా ఆయన ప్రభుత్వానికి పెద్ద ఎదురు దెబ్బ. ఇటువంటి కొన్ని మైనస్‌లున్నా విజయ్ సర్కార్‌కు ప్రజాదరణ 70 శాతం ఉండడం కూడా గమనించవలసిన మరో అంశం. అయితే ఈ రేటింగ్‌ను నిలబెట్టుకొనడానికి ఆయన ముందు ముందు ఏఏచర్యలు తీసుకొంటారనే విషయం పైనే టివికె పార్టీ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ●


అమెరికా

నాలుగేళ్లు దాటిన రష్యాఉక్రెయిన్ యుద్ధ విరమణకు అమెరికా శతవిధాలా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రష్యా సైన్యం ఎదుర్కొంటున్న భారీ నష్టాలతో అదనపు భూభాగం ఏమీ సాధించలేకపోయిందని అమెరికా సిఐఎ అంచనావేసింది. మరోపక్క వేలాదిగా డ్రోన్లతో ఉక్రెయిన్ నగరాలను ధ్వంసంచేస్తున్న రష్యా సేనలకు ఇప్పుడు అదనంగా మరో మూడు లక్షలమంది సైన్యాన్ని కూడా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమకూర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి సాగుతున్న ఈ ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి తెరదించాలన్న లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాల్పుల విరమణ చర్చలకు మళ్లీ తెరలేపినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ విమానం హఠాత్తుగా మాస్కోలో ల్యాండ్ అయిన సంఘటన ప్రపంచ వ్యాప్తంగా ఆశ్చర్యం కలిగించింది. అందులో సిఐఎ చీఫ్ జాన్ రాట్‌క్లిఫ్ రహస్యంగా మాస్కోను సందర్శించి ఆదేశ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బీ) చీఫ్ అలెగ్జాండర్ బోర్ట్నికోవ్‌తో సమావేశమై కాల్పుల విరమణకు చర్చలకు ముందుకురావాలని కూడా ట్రంప్ సందేశంగా వినిపించినట్లు సమాచారం. రష్యా సైనిక, ఆర్థిక పరిస్థితి మరింత దిగజారకముందే తీవ్ర స్థాయిలో చర్చలు ప్రారంభించాలని ఆయన సూచించినట్లు సమాచారం. రష్యాసైనిక బలగాలు యుద్ధ రంగంలో చెల్లిస్తున్న మూల్యాన్ని ర్యాట్‌క్లిఫ్ తన అంచనాలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. తాను సీఐఏ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన 18 నెలల కాలంలో రష్యా ఉక్రెయిన్ మొత్తం భూభాగంలో కేవలం ఒకటి శాతంమేర మాత్రమే అదనంగా స్వాధీనం చేసుకోగలిగిందని ఆయన గుర్తుచేసారు. ప్రస్తుత, మాజీ అమెరికా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం రష్యా ఎఫ్ఎస్‌బీ చీఫ్ బోర్ట్నికోవ్‌కు ర్యాట్‌క్లిఫ్ నేరుగా తన అంచనాలను వివరించినట్లు తెలుస్తోంది. అమెరికా సీఐఏ రష్యా ఎఫ్ఎస్‌బీతో పాటు విదేశీగూఢచారి సంస్థ ఎస్‌వీఆర్‌తోనూ కమ్యూనికేషన్ చానళ్లను కొనసాగిస్తోంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున చర్చలు జరుపుతున్న దౌత్య ప్రతినిధుల ప్రయత్నాలకు భిన్నంగా ఈ తాజా సంప్రదింపులు జరిగినటు తెలుస్తోంది. రష్యా తన యుద్ధ లక్ష్యాలను సాధించేందుకు

# మధ్యవర్తి మంతనాలు!

**గన్ని మోహన్**

అవసరమైన స్థాయిలో యుద్ధరంగంలో పురోగతి సాధించడం లేదన్న విషయాన్ని మాస్కో గుర్తించాలని ర్యాట్‌క్లిఫ్ స్పష్టం చేసారు. రష్యా సైనికుల నష్టాలపై ర్యాట్‌క్లిఫ్ చేసిన వ్యాఖ్యలు మాస్కోకు ఈ యుద్ధం మరింత ఖరీదైనదిగా మారుతోందన్న అమెరికా విస్తృత అంచనాలకు అనుగుణంగా ఉన్నాయి. రష్యాదళాల పురోగతిని అడ్డుకో వడంలో ఉక్రెయిన్ డ్రోన్ యుద్ధతంత్రం కీలక పాత్ర పోషిస్తోందని కూడా సీఐఏ డైరెక్టర్ పేర్కొన్నట్లు సమాచారం. నిలిచిపోయిన చర్చలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రయత్నాలు మాస్కోలో ర్యాట్‌క్లిఫ్ పర్యటన పెద్దగా పురోగతి సాధించని రష్యా ఉక్రెయిన్ చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ట్రంప్



జాన్ ర్యాట్‌క్లిఫ్

ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల క్రమంలో జరిగిందనే భావించాలి. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చినతర్వాత ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సహాయం తగ్గింది. దీంతో యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మరింత సహాయాన్ని అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాస్కోకు వెళ్లే ముందు ర్యాట్‌క్లిఫ్ ఉక్రెయిన్ అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. రష్యా చర్చల వైఖరిని మాత్రమే పరిశీలిస్తానని, ఉక్రెయిన్ తరపున ఎలాంటి రాయితీలు ఇవ్వబోనని ఆయన వారికి హామీఇచ్చారు. ట్రంప్ తరపున చర్చలు జరుపుతున్న స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ నిర్వహిస్తున్న సంప్రదింపులపై ఇప్పటికే అనుమానాలు వ్యక్తం చేస్తున్న కీవ్‌కు ఈ అంశంముఖ్యమైనదే. డాన్‌బాస్ ప్రాంతంలో రష్యాదాడులు పెద్దగా ముందుకు సాగకపోవడం, అదే సమయంలో రష్యా భూభాగంలోని లోతైన ప్రాంతాల్లోని లక్ష్యాలపై డ్రోన్లతో దాడులు చేసే సామర్థ్యాన్ని ఉక్రెయిన్ కొనసాగించడం రాబోయే శీతాకాలంలో చర్చలకు అవకాశం కల్పించవచ్చని యూరోపియన్ దౌత్యవేత్తలు కూడా అంచనాలువేసారు. రష్యాపై చాలాకాలంగా విమర్శలు చేస్తున్న ఆయన గూఢచార సంస్థల మధ్య కొనసాగుతున్న మార్గాల ద్వారా అమెరికా అంచనాలను నేరుగా మాస్కోకు తెలియ జేయగలుగుతున్నారు. అమెరికా రష్యా మధ్య ఇలాంటి గూఢచారి స్థాయి సంప్రదింపులకు గతంలోనూ ఉదాహరణలు ఉన్నాయి. 2021 నవంబర్‌లోఅప్పటి సీఐఏ డైరెక్టర్ విలియం బర్న్స్ మాస్కోను సందర్శించి బోర్ట్నికోవ్‌తో పాటు పలువురు సీనియర్ రష్యా అధికారులను కలిశారు. ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అప్పట్లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను హెచ్చరించారు. ఆ తర్వాతి ఏడాది రష్యా అణు ఆయుధాలను ఉపయోగించే అవకాశంపై ఆ దేశ కమ్యూనికేషన్లను అమెరికా నిఘా సంస్థలు గుర్తించిన నేపథ్యంలో బర్న్స్ రష్యా ఇంటెలిజెన్స్ చీఫ్ సెర్గీ నారిష్కిన్‌ను టర్కీలోని అంకారాలో కలిశారు. అణ్వాయుధాలను ఉపయోగించే దిశగా మాస్కో అడుగులు వేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖైదీల మార్పిడి విషయంలో ర్యాట్‌క్లిఫ్, బోర్ట్నికోవ్‌లు గతంలో గూఢచారి వ్యవస్థలద్వారా సంప్రదింపులు జరిపారు. మాస్కోలో జరిగిన తాజా సమావేశం వీరిద్దరి తొలి ముఖాముఖి భేటీగా తెలుస్తోంది. దౌత్య ప్రతిష్టంభనకు తెరదించేందుకు ప్రయత్నం గూఢచారి సంస్థల మధ్య ఉన్న సంప్రదింపుల మార్గాలను ఉపయోగించుకుని రష్యా, ఉక్రెయిన్ దౌత్య ప్రతిష్టంభనను తొలగించేందుకు అమెరికా మరో ప్రయత్నం చేస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. యుద్ధరంగంలో ఒత్తిడిని కొనసాగించడం ద్వారా రష్యా మరింత భూభాగాన్ని స్వాధీనం చేసుకోగలదా? లేక చర్చల ద్వారా మరిన్ని ప్రయోజనాలను సాధించగలదా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ●

# ఇంజినీరింగ్ విద్యకు నాణ్యమైన పునాది అవసరం

**జీ. శ్రీలత**

దేశంలో ఇంజినీరింగ్ విద్య పరిస్థితి నానాటికీ ఆందోళనకరంగా మారుతోంది. ఒకప్పుడు ఇంజినీరింగ్ అంటే భవిష్యత్తుకు భరోసా, మంచి ఉద్యోగానికి మార్గం, కుటుంబానికి ఆర్థిక స్థిరత్వానికి చిహ్నంగా భావించేవారు. కానీ నేడు పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థులు బీటెక్ పట్టాలు చేతబట్టుకుని బయటకు వస్తున్నప్పటికీ, వారిలో పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు కలిగినవారి సంఖ్య మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 'డిగ్రీలు ఇస్తున్నామా? లేక ఇంజినీర్లను తయారు చేస్తున్నామా?' అనే ప్రశ్న ఇప్పుడు గట్టిగా వినిపించాల్సిన సమయం వచ్చింది. ఇంజినీరింగ్ కళాశాలలు కేవలం తరగతి గదులు,ఫీజుల వసూళ్లు, పరీక్షలు, హాజరు, సెమిస్టర్ ఫలితాలకే పరిమితమైతే వాటి అసలు ఉద్దేశ్యం నెరవేరదు. ఒక ఇంజనీర్ అంటే కేవలం పాఠ్యాంశాలను చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వ్యక్తి కాదు. సమస్యను గుర్తించి, దానికి సాంకేతిక పరిష్కారం కనుగొని, ఆ పరిష్కారాన్ని ఆచరణలోకి తీసుకురాగల సృజనాత్మక మేధస్సు కలిగిన వ్యక్తి. కానీ మన ఇంజినీరింగ్ విద్యా వ్యవస్థలో ఈ దిశగా ఎంతవరకు కృషి జరుగుతోంది అన్నది సమీక్షించాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం సాంకేతిక కళాశాలల్లో పటిష్టమైన గ్రంథాలయాలు, తగినన్ని పాఠ్యపుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలు, పరిశోధనా జర్నల్స్, డిజిటల్ వనరులు, ఆధునిక ప్రయోగశాలలు ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో అనేక ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో పరిస్థితి భిన్నంగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, భౌతిక గ్రంథాలయాలు పేరుకే ఉండటం, ప్రయోగశాలలు తగిన స్థాయిలో పనిచేయకపోవడం వంటి సమస్యలు విద్యా ప్రమాణాలను ప్రభావితం చేస్తున్నాయి. నోట్స్, ఫొటోకాపీలు, డిజిటల్ పీడీఎఫ్‌లతోనే విద్యార్థుల విద్యాభ్యాసాన్ని నడిపించడం ఎంతవరకు సమంజసం? డిజిటల్ వనరులు అవసరమే. కానీ అవి పుస్తక పఠనానికి, పరిశోధనకు ప్రత్యామ్నాయం కావు. ఒక విద్యార్థి వివిధ రచయితల పుస్తకాలు చదవాలి. విభిన్న అభిప్రాయాలను తెలుసుకోవాలి. పరిశోధనా పత్రాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నించే అలవాటు పెంచుకోవాలి.అప్పుడే ఆలోచనాశక్తి, విశ్లేషణాత్మక సామర్థ్యం, సృజనాత్మకత పెరుగుతాయి. పుస్తకాలు, పరిశోధన వాతావరణం, ప్రయోగశాలలు లేని ఇంజనీరింగ్ విద్య కేవలం డిగ్రీలను ఇవ్వగలదేమో కానీ ఆవిష్కర్తలను తయారు చేయగలదా? అన్న ప్రశ్నకు విద్యా వ్యవస్థ సమాధానం చెప్పాలి. జర్మనీ, ఫిన్లాండ్, అమెరికా తదితర దేశాల్లో ఇంజనీరింగ్ విద్యలో ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసానికి ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థి కేవలం పుస్తకంలోని సిద్ధాంతాన్ని చదివి పరీక్ష రాయడం మాత్రమే కాకుండా, ఆ సిద్ధాంతాన్ని వాస్తవ జీవితంలో ఎలా ఉపయోగించాలో నేర్చుకుంటాడు.అక్కడి అనేక సాంకేతిక విద్యా సంస్థలు సీడీఐఓ కాన్సీవ్, డిజైన్, ఇంప్లిమెంట్, ఆపరేట్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అంటే ఒక సమస్యను ఊహించడం నుంచి పరిష్కారాన్ని రూపొందించడం,అమలు చేయడం,ఆ తర్వాత దానిని పనిచేసే స్థాయికి తీసుకు రావడం వరకు విద్యార్థి స్వయంగా అనుభవిస్తాడు. ఇదేవిధానం మన దేశంలో కూడా విస్తృతంగా అమలుకావాలి. ఉదాహరణకు ఒక గ్రామంలో తాగునీటి సమస్య ఉంటే విద్యార్థులు దానికి తక్కువ ఖర్చుతో నీటి శుద్ధివ్యవస్థ రూపొందించాలి. వ్యవసాయంలో నీటివృథాను తగ్గించే సాంకేతిక పరిష్కారాన్ని అభివృద్ధి చేయాలి. ట్రాఫిక్ సమస్యకు కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారం రూపొందించాలి. ప్రభుత్వ పాఠశాలలకు తక్కువ ఖర్చుతో డిజిటల్ విద్యా పరికరాలను అభివృద్ధి చేయాలి. ఇలాంటి ప్రాజెక్టులు విద్యార్థులను కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా సమస్య పరిష్కారకులుగా, ఆవిష్కర్తలుగా, భవిష్యత్తు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దగలవు. మన దేశంలో మరో ప్రధాన సమస్య పరిశ్రమకు, కళాశాలలకు మధ్య ఉన్న అంతరం. కళాశాలలో బోధించే సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల్లో వాస్తవంగా ఉపయోగించే



సాంకేతిక పరిజ్ఞానం మధ్య తేడా ఉండటం వల్ల విద్యార్థులు పట్టా పొందిన తర్వాత మళ్లీ శిక్షణ పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి ఇంజినీరింగ్ కళాశాల కనీసం కొన్ని పరిశ్రమలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ సందర్శనలు, ప్రత్యక్ష ప్రాజెక్టులు, నిపుణుల ఉపన్యాసాలు, పరిశోధనా అవకాశాలు కల్పించాలి. చివరి సంవత్సరం ప్రాజెక్ట్ అనేది కేవలం మార్కుల కోసం తయారు చేసే నివేదికగా కాకుండా, వాస్తవ పరిశ్రమ లేదా సామాజిక సమస్యకు పరిష్కారంగా ఉండాలి. అలా జరిగితే కళాశాలల్లోనే స్టార్టప్‌లకు బీజం పడుతుంది. విద్యార్థుల పరిశోధనలు పేటెంట్లుగా మారవచ్చు. వారి ప్రాజెక్టులు వ్యాపార ఉత్పత్తులుగా మారవచ్చు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజినీరింగ్ విద్య నేరుగా దోహదపడే అవకాశం ఏర్పడుతుంది. ఇంజినీరింగ్ విద్యలో హాజరు నిబంధనపై కూడా కొత్తగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. విద్యార్థి నిర్దిష్ట శాతం తరగతులకు హాజరు కావాలనే నిబంధనకు విద్యా పరంగా కారణాలు ఉన్నాయి. ప్రయోగశాలలు, ప్రత్యక్ష బోధన, బృంద కార్యకలాపాలు, అధ్యాపకులతో పరస్పర చర్చ వంటి అంశాలకు భౌతిక హాజరు అవసరం ఉంటుంది. అయితే హాజరును మాత్రమే విద్యార్థి సామర్థ్యానికి కొలమానంగా చూడటం మాత్రం సమంజసం కాదు. ఒక విద్యార్థి తరగతిలో కూర్చున్న గంటల సంఖ్య కంటే అతను నేర్చుకున్నది ఏమిటి? ఏ ప్రాజెక్ట్ చేశాడు? ఏ సమస్యను పరిష్కరించాడు? ఎలాంటి పరిశోధన చేశాడు? ఏ నైపుణ్యం సంపాదించాడు? అన్నది ముఖ్యమవ్వాలి. ఆన్‌లైన్ కోర్సులు, వర్చువల్ ల్యాబ్‌లు, ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఓపెన్ కోర్సులు అందుబాటులో ఉన్న ఈ డిజిటల్ యుగంలో విద్యార్థి అభ్యాసాన్ని మరింత సమగ్రంగా అంచనా వేయాలి. హాజరుతో పాటు ప్రాజెక్ట్, అసైన్‌మెంట్, పరిశోధన, ప్రెజెంటేషన్, ఇంటర్న్‌షిప్, నైపుణ్య పరీక్షలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే దీనిని హాజరు పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌గా చూడకూడదు. హాజరు,అభ్యాస ఫలితాలు, ప్రాజెక్టులు, నైపుణ్యాలు అనే సమగ్ర విధానం అవసరం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యలో భారీ స్థాయిలో సీట్లు అందుబాటులో ఉన్నాయి. కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులపై విద్యార్థుల్లో విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. అదే సమయంలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సుల్లో మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉంది. ఇంజినీరింగ్ సీట్లసంఖ్యపెంచడం మాత్రమే పరిష్కారం కాదు. నాణ్యత పెంచడం అసలు పరిష్కారం. కళాశాలలు ఎక్కువగా ఉండటం కంటే నాణ్యమైన ఇంజినీర్లను తయారు చేసే కళాశాలలు ఎక్కువగా ఉండాలి. ఉద్యోగావకాశాల విషయంలో కూడా గణాంకాలు మనల్ని ఆలోచింపజేస్తున్నాయి. వివిధ నైపుణ్య, ఉపాధి నివేదికలు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో ఒక వర్గం మాత్రమే పరిశ్రమకు తక్షణం సిద్ధంగా ఉంటోందని సూచిస్తున్నాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఒక విషయం, పరిశ్రమలో పనిచేయడానికి అవసరమైన ప్రోగ్రామింగ్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, బృందపని, ప్రాజెక్ట్ నిర్వహణ, విశ్లేషణాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలు కలిగి ఉండటం మరో విషయం. ఇక్కడే మన విద్యావ్యవస్థలోని అసలు లోపం బయటపడుతోంది. ఒక విద్యార్థిని ఇంజనీరింగ్‌లో చేర్పించేందుకు మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేస్తున్నాయి. ట్యూషన్ ఫీజులు,హాస్టల్ ఫీజులు, రవాణా ఖర్చులు, పుస్తకాలు, ఇతర విద్యాఖర్చులు భరించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేసే పరిస్థితి కూడా ఉంటుంది. అంత ఖర్చు చేసి చదివించిన తర్వాత విద్యార్థి చేతిలో కేవలం ఒక డిగ్రీ, ఒక మార్కుల పట్టిక మాత్రమే మిగిలితే అది కుటుంబానికి మాత్రమేకాదు, దేశానికి కూడా నష్టం.కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు కలిసి ఇంజనీరింగ్ విద్యపై సమగ్ర సమీక్ష నిర్వహించాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు,విశ్వవిద్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు మేల్కొనాలి. పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా మారుతున్న ఇంజినీరింగ్‌విద్యకు నాణ్యత అనేపునాది వేయాలి. అప్పుడే తల్లిదండ్రుల కలలు నెరవేరతాయి. విద్యార్థుల భవిష్యత్తు భద్రమవుతుంది. ●

# మృత్యువుకు 30 సెకన్ల దూరంలో..

## ఒకేఒక్క మెసేజ్ 8 మంది ప్రాణాలు నిలిపింది

**ఖాట్మాండు, ఆగస్టు 29:** ప్రకృతి కోపానికి నేపాల్‌లోని రసువా జిల్లా విలవిల్లాడింది. ఈ నెల 26న నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో అనూహ్యంగా విరుచుకుపడిన మెరుపు వరదలు, బురద, కొండచరియల విధ్వంసంలో వందలాది మంది చిక్కుకున్నారు. అతియే భంగే ఝూర్నా సమీపంలో వంతెన నిర్మాణ పనుల్లో ఉన్న ఎనిమిది మంది శ్రామికులను ఒక ఎకైక ఎస్ఎంఎస్ రూపంలో వచ్చిన ప్రమాద హెచ్చరిక మృత్యుముఖం నుంచి కాపాడింది. మృత్యువు విరుచుకుపడటానికి సరిగ్గా 30 సెకన్ల ముందు వచ్చిన ఆ అలర్ట్, ఎనిమిది మంది ప్రాణాలను నిలబెట్టిన ఒక అద్భుతంలా మారింది.



**'ఫోన్ చూశా.. కళ్లు ఎత్తేసరికి 10 అడుగుల నీటి గోడ!'**

మెయిలుంగ్ ప్రాంతంలో నిర్మాణ బృందంతో కలిసి పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడు అర్జున్ రెమాల్ తన అనుభవాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఆయన ఫోన్ ఒక్కసారిగా వైబ్రేట్ అయింది. నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద నిర్మూలన సంస్థ నుంచి వచ్చిన ఆ మెసేజ్‌లో 'క్షణాల్లో ఉప్పెన రాబోతోంది. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి' అని ఉంది. 'నేను ఫోన్ వంక చూసి, అలా తల పైకెత్తేసరికి నా కళ్ల ముందు 10 అడుగుల ఎత్తున బురద, రాళ్లతో కూడిన భయంకరమైన నీటి ప్రవాహం దూసుకొస్తోంది. 'పరుగెత్తండి' అని గట్టిగా అరిచి, ఉన్నపళంగా వెనక్కి తిరక్కుండా పరుగెత్తాను. నేను నా జీవితంలో అంత వేగంగా ఎప్పుడూ పరుగెత్తలేదు. ఆ ఫోన్ చూడటం ఒక్క 30 సెకన్లు లేట్ అయినా.. ఈరోజు మేం ప్రాణాలతో ఉండేవాళ్లం కాము' అని అర్జున్ వివరించారు.

**చీకట్లో కొండలు దాటుతూ.. ప్రాణ భయంతో రాత్రంతా ప్రయాణం**

వరద ఉద్ధృతికి వంతెన కొట్టుకుపోగా, పరుగెత్తే క్రమంలో అర్జున్ తన చెప్పులు, ఫోన్, సొంత వస్తువులన్నీ కోల్పోయారు. కానీ తనతో ఉన్న ఎనిమిది మంది శ్రామికుల ప్రాణాలు కాపాడటమే ఆయనకు ముఖ్యమైంది. రాత్రి కాగానే కింద సముద్రంలా మారిన నది వైపు వెళ్లే దారి లేక, శ్రామికులంతా చుట్టూ ఉన్న కొండలు, దట్టమైన అడవుల గుండా చీకట్లోనే నడుచుకుంటూ వెళ్లారు. రాత్రి పది గంటల ప్రాంతంలో కొన్ని ఇళ్లను చూసి, తాము నువాకోట్ జిల్లాలోకి వచ్చామని గుర్తించారు. అక్కడే కొద్దిగా ఆహారం తీసుకుని విశ్రాంతి లేకుండా సురక్షిత ప్రాంతానికి పయనమయ్యారు.

**ఆర్మీ క్యాంపును చేరుకుని ఊపిరి పీల్చుకున్న శ్రామికులు**

మరుసటి రోజు గురువారం మధ్యాహ్యానికి, వారంతా నేపాల్ ఆర్మీ ఏర్పాటు చేసిన బిదూర్ రెస్క్యూ బేస్‌కు చేరుకున్నారు. ఆర్మీ క్యాంప్ వద్ద తమ కుటుంబ సభ్యుల కోసం కన్నీళ్లతో వెతుకుతున్న బాధితులను చూసి అర్జున్ కలచివేతకు గురయ్యారు. వరదలు వచ్చిన రోజు సాయంత్రం 5 గంటల తర్వాత సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఎందరో కొట్టుకుపోయి ఉంటారని, ఆ సమయంలో అక్కడ ఉన్న వారు బతికే అవకాశాలు చాలా తక్కువని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రకోపించినా, సకాలంలో వచ్చిన ఒక్క ఎస్ఎంఎస్ ఆ ఎనిమిది మంది శ్రామికుల కుటుంబాల్లో వెలుగులు నింపింది.



## నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న ఆకస్మిక వరదల్లో ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు చెందిన ఉన్నతాధికారి ఒకరు గల్లంతయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ అయిన ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ హెడ్‌గా పనిచేస్తున్న లక్ష్మీనాథ్‌గోపిశెట్టి, వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లారు. నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన వరదల తర్వాత ఆయన ఆచూకీ లభించడం లేదని ఇన్ఫోసిస్ నిన్న ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆయనను గుర్తించి, క్షేమంగా కాపాడటమే తమ కర్తవ్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ మా సహోద్యోగి లక్ష్మీనాథ్‌గోపిశెట్టి వ్యక్తిగత పర్యటనపై ఆ ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన ఆచూకీని కనుగొనడానికి, కాంటాక్ట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉంటూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము. అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులపై ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. మరోవైపు, ఈ వరదల తీవ్రతపై భారత విదేశాంగశాఖ కీలక వివరాలు వెల్లడించింది. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అన్ని విధాలా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగాఉందని ఆయన స్పష్టం చేశారు. ఇక, లక్ష్మీనాథ్ గోపిశెట్టి నేపథ్యంచూస్తే ఆయనకు టెక్నాలజీ రంగంలో అపారమైన అనుభవంఉంది. ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహం, టెక్నాలజీ, కార్యకలాపాలు, పరివర్తన వంటి అంశాలపై ఆయన సలహాలు అందిస్తుంటారు. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ వ్యూహరచన, అమలులో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు, ఆయన ఇన్ఫోసిస్‌లోనే గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, బిజినెస్ అప్లికేషన్స్ హెడ్‌గా అమెరికా, యూరప్, ఆసియా అంతటా వ్యాపారాన్ని విస్తరించారు. ఇన్ఫోసిస్‌లో చేరడానికి ముందు ఆయన యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే బేరింగ్‌పాయింట్, ఐబిఎం, పిడబ్ల్యూసీ, హెచ్‌సిఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం గోపిశెట్టితో కాంటాక్ట్ ఏర్పాటు చేసుకునేందుకు ఇన్ఫోసిస్ తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, మరోవైపు వరదల్లో చిక్కుకున్న వందలాది మంది భారతీయులను రక్షించేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.



## సిఎంల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ప్రజల్లో అసంతృప్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఓటర్ల అభిప్రాయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు తమ ముఖ్యమంత్రుల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. వోట్ వైబ్ నిర్వహించిన సర్వేలో మూడు రాష్ట్రాల్లోని ఆరువేల మందికి పైగా ఓటర్లను ఈనెల 25 వరకు ప్రశ్నించారు. దీనితో పాటు ఇండియా సీ ఓటర్ సర్వేలో జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది అభిప్రాయాలను సేకరించారు. పంజాబ్, ఉత్తరాఖండ్‌తో పోల్చుకుంటే ఉత్తరప్రదేశ్‌లోనే ఎమ్మెల్యేలపై అసంతృప్తి అత్యధికంగా కనిపించింది. 49 శాతంమంది తమ ప్రస్తుత ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. కేవలం 27.9 శాతం మంది మాత్రమే ఎమ్మెల్యేల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై అభిప్రాయం కొంత మెరుగ్గా ఉంది. 41.8 శాతం మంది ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయగా, 38.4శాతం మంది అసంతృప్తి తెలిపారు. యుపిలో ప్రధాన ఎన్నికల సమస్యగా నిరుద్యోగం 23.1 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. రైతుల సమస్యలు 14.1 శాతం, విద్యవైద్యం 13.7 శాతం, ద్రవ్యోల్బణం 12.2 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సర్వే ప్రకారం బీజేపీ నేతృత్వంలోని కూటమి 41.8 శాతంతో స్వల్ప ఆధిక్యంలో ఉండగా, సమాజ్‌వాదీ పార్టీ కూటమికి 38.7 శాతం మద్దతు ఉంది. ఉత్తరాఖండ్‌లో సిఎం పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంపై 39.1 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేయగా, 38.1 శాతం మంది అసంతృప్తిగాఉన్నారు. ఎమ్మెల్యేల విషయంలో పరిస్థితి మరింత ప్రతికూలంగా ఉంది. 48 శాతంమంది ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, కేవలం 27.1 శాతంమంది సంతృప్తి తెలిపారు. పంజాబ్‌లోనూ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఎక్కువగానే ఉంది. 45.3 శాతం మంది తమ ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, 32.2 శాతం మంది మాత్రమే సంతృప్తి తెలిపారు. అయితే సిఎం భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వంపై 40 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. 35.4 శాతం మంది అసంతృప్తి తెలిపారు.

### రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ

## సిబిఐకి పట్టుబడిన జిఎస్టీ అధికారులు

**ముంబయి, ఆగస్టు 29:** మహారాష్ట్రలో భారీ లంచం కేసు వెలుగులోకి వచ్చింది. రూ.40 లక్షల లంచం తీసుకున్నారనే ఆరోపణలపై ఇద్దరు జిఎస్టీ అధికారులతో పాటు మరో వ్యక్తిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అరెస్ట్ చేసింది. ఈ ఘటన రాయ్‌గడ్ జిల్లాలో చోటుచేసుకుంది. స్టోన్ క్వారీకి సంబంధించిన జిఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు తొలుత రూ.1.50 కోట్ల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం చర్చల తర్వాత ఆ మొత్తాన్ని రూ.40 లక్షలకు తగ్గించినట్లు సిబిఐ తెలిపింది. ఈ కేసులో సిజిఎస్టీ అదనపు కమిషనర్ వినయ్ కుమార్ కాంతేటి, జిఎస్టీ సూపరింటెండెంట్ రాకేష్ కుమార్ సిన్హా, మరో వ్యక్తి నరేందర్ రాజ్‌పుత్లను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులపై లంచం డిమాండ్, స్వీకరణకు సంబంధించిన ఆరోపణలతో దర్యాప్తు చేపట్టినట్లు సిబిఐ వెల్లడించింది. ఫిర్యాదుదారుడికి చెందిన రాతి క్వారీయింగ్ సంస్థకు సంబంధించిన జిఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు రూ.1.50 కోట్లు లంచంగా ఇవ్వాలని సూపరింటెండెంట్ డిమాండ్ చేసినట్లు సిబిఐకి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈనెల 26న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

లంచం మొత్తంపై జరిగిన చర్చల అనంతరం తొలుత డిమాండ్ చేసిన రూ.1.50కోట్లను రూ.40 లక్షలకు తగ్గించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ లంచం మొత్తాన్ని వసూలు చేసే బాధ్యతను నిందితులైన ప్రభుత్వ అధికారులు నరేందర్ రాజ్‌పుత్‌కు అప్పగించినట్లు ఎర్కొంది. అధికారులు పన్నిన ఉచ్చులో నరేందర్ రాజ్‌పుత్ రూ.40 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడని అధికారులు తెలిపారు. అతని అరెస్టు అనంతరం కేసులో మరింత దర్యాప్తు చేపట్టిన సిబిఐ సంబంధిత జిఎస్టీ అధికారులపై కూడా చర్యలు తీసుకుంది. లంచం వ్యవహారంపై విచారణ కొనసాగుతున్న సమయంలో వినయ్ కుమార్ కాంతేటి, రాకేష్ కుమార్ సిన్హా కూడా లంచం స్వీకరణకు సంబంధించిన ఆరోపణలను అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను సిబిఐ దర్యాప్తు ద్వారా వెలుగులోకి తీసుకురానుంది.

## విదేశీ సహాయక బృందాల సాయాన్ని అంగీకరించిన నేపాల్



**ఖాట్మండు, ఆగస్టు 29:** విదేశీ రెస్క్యూ బృందాలు తమ దేశం వచ్చి సహాయం చేయడానికి నేపాల్ అంగీకరించని సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయంతో నేపాల్ తన నిర్ణయం మార్చుకుంది. విదేశీ సహాయక బృందాలను అంగీకరించాలని నిర్ణయించింది. పరిమితంగా మాత్రమే విదేశీయుల్ని అనుమతిస్తామని నేపాల్ పేర్కొంది. బుధవారం నేపాల్‌లో భారీ వరద సంభవించడంతో 600 మంది వరకు మరణించగా, మరో 1,500 మంది వరకు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు నేపాల్ రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ, ఇంకా చాలా మంది ఆచూకీ దొరకలేదు. ఇదే సమయంలో తమ బృందాల్ని సహాయక చర్యల కోసం పంపిస్తామని ఇండియాతోపాటు అమెరికా వంటి దేశాలు చెప్పాయి. అయితే, తమకు ఏ దేశ సహాయం అవసరం లేదని, తమ దేశంలోని రెస్క్యూ బృందాలే ఈ చర్యలు చేపట్టగలవని నేపాల్ తెలిపింది. గాలింపు, సహాయక చర్యలకోసం విదేశాల సాయాన్ని తిరస్కరించింది. అయితే, తమ దేశానికి ఆర్థిక సాయం అందించవచ్చని మాత్రం కోరింది. అది కూడా దేశంలోని సహాయనిధికి అందించాలని సూచించింది. కానీ, నేపాల్ తమ సాయాన్ని తిరస్కరించడంపై విదేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఇదే సమయంలో అక్కడ సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. అనుకున్నట్లుగా సహాయక చర్యలు కొనసాగడం లేదు. అక్కడి సిబ్బంది శక్తికి మించిన భారంగా మారింది. పరిస్థితి ఊహించినదానికంటే భిన్నంగా ఉంది. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా గల్లంతైన వారిని గుర్తించడంలో నేపాల్ విఫలమైంది. అటు విదేశాల నుంచి సాయం కోసం ఒత్తిళ్లు ఇటు సహాయక చర్యలు సరిగ్గా కొనసాగకపోవడంతో నేపాల్ కాస్త వెనక్కు తగ్గింది. రెస్క్యూ చర్యలకోసం విదేశాలకు అనుమతించింది. గాలింపు, సహాయక చర్యల కోసం తమ బృందాలను పంపించేందుకు విదేశాల నుంచి భారీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇదే సమయంలో కొన్ని దేశాలకు చెందిన పౌరులు కూడా గల్లంతయ్యారు. తమ వారిని గాలించేందుకు సహాయక చర్యలకు సిద్ధంగాఉన్నాయి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో అర్హులైన కొందరు నిపుణుల్ని అనుమతిస్తున్నాం అని నేపాల్ ప్రకటించింది. నేపాల్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇంకో కారణం ఉంది. నేపాల్ వరదల్లో గల్లంతైన వారిలో ఇండియాతోపాటు పలువురు చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వారిని రక్షించడంలో నేపాల్ ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడంలేదు. ఈ నేపథ్యంలో ఆయాదేశాలు నేపాల్‌పై ఒత్తిడి తేవడంతో, నేపాల్ విదేశీ సహాయక బృందాలకు అనుమతించింది.

## ఉద్యోగంపోతే వెంటనే అమెరికా వీడాల్సిందే!




**వాషింగ్టన్, ఆగస్టు 29:** అమెరికాలో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న వేలాది మంది భారతీయ నిపుణులకు మరింత ఆందోళన కలిగించే పరిణామాలు ఎదురవుతున్నాయి. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉపాధి వెతుక్కోవడానికి లేదా దేశం విడిచి వెళ్లేందుకు వీలు కల్పించే 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేసే ప్రతిపాదనపై ట్రంప్ యంత్రాంగం తన సమీక్షను పూర్తి చేసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, ముఖ్యంగా భారతీయ టెక్కీలు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) 60 రోజుల విచక్షణాధికార గ్రేస్ పీరియడ్ తొలగింపు అనే పేరుతో ఈ ప్రతిపాదనను ఈనెల 6న వైట్‌హౌస్‌కు పంపింది. 27న దీనిపై సమీక్ష ముగిసింది. కొన్ని మార్పులతో ఈ ప్రతిపాదన వైట్‌హౌస్ ఆమోదం పొందినట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన పూర్తి వివరాలు ఇంకా బహిర్గతం కాలేదు. అందువల్ల, ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ నిబంధన యథావిధిగా అమల్లో ఉంది. తదుపరి దశలో ఈ ప్రతిపాదిత నియమాన్ని ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించి, ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుత నిబంధన ప్రకారం హెచ్1బీ, ఎల్1, ఓ1 వంటి తాత్కాలిక ఉపాధి వీసాలపై ఉన్నవారు ఉద్యోగం కోల్పోతే 60 రోజుల వరకు అమెరికాలో ఉండవచ్చు. ఈ సమయంలో వారు కొత్త స్పాన్సర్‌ను వెతుక్కోవడం, ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్చుకోవడం లేదా దేశం విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనపై ప్రెసిడెంట్స్ అడ్వైజరీ కమిషన్ ఆన్ ఏషియన్ అమెరికన్స్ మాజీ సభ్యుడు అజయ్ జైన్ భూటోరియా తీవ్రంగా స్పందించారు. ఇది అమానవీయమైన, ఆచరణకు సాధ్యం కాని నిర్ణయమని ఆయన విమర్శించారు. "ఉద్యోగం కోల్పోయిన నిపుణులకు 60 రోజుల సమయమే చాలా తక్కువ. అలాంటిది దాన్ని పూర్తిగా తొలగిస్తే, ఆ కుటుంబాలు తమ ఇళ్లు సర్దుకోవడానికి, పిల్లల చదువుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి కూడా సమయం ఉండదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## వేదిక శుద్ధీకరణపై భగ్గుమన్న రాహుల్

### బిజెపిలో గూడుకట్టిన అంటరానితనానికి నిదర్శనమని ధ్వజం




**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఒక ర్యాలీ కోసం ఖర్గే పాల్గొన్న వేదికను శుభ్రం చేయడాన్ని రాహుల్ తప్పుబట్టారు. అలా చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. మల్లికార్జునఖర్గే కొద్దిరోజులక్రితం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఒక ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒక వేదిక నుంచి ప్రసంగించారు. మరుసటి రోజు కొందరు బిజెపి అనుకూల నాయకులు ఖర్గే పాల్గొన్న ఆ వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. శుద్ధీకరణ ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఖర్గే మండిపడ్డారు. తాను పాల్గొన్న వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో అక్కడి బిజెపి ప్రభుత్వంపై కూడా మండిపడ్డారు. తాజాగా ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడారు. ఖర్గే పాల్గొన్న వేదికఉన్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటరానితనానికి సూచనగా రాహుల్ అభివర్ణించారు. ఈ చర్య దళితులపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల వైఖరికి నిదర్శనం అన్నారు. దళితుల విషయంలో ఆ పార్టీ నేతలు ఎలా వ్యవహరిస్తారో తెలుస్తోందన్నారు. ఈ చర్యకు పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ప్రధాని చొరవ చూపాలని ఆయన కోరారు. ఈవిషయంలో ప్రధాని మోడీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వంతోపాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఖర్గే అంశంలో న్యాయం చేయాలని సూచించారు.

## ఉక్రెయిన్ రాజధానిపై రష్యా క్షిపణుల దాడి

**క్యీవ్, ఆగస్టు 29:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. కీవ్‌సమీపంలోని బుచాజిల్లాలో 27 మంది మరణించారు. ఈ దాడుల్లో 50 ఇళ్లు దెబ్బతిన్నాయని స్థానిక అధికారులు తెలిపారు. దాడుల కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగిందని, పలుచోట్ల నివాసాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ మైలా గ్రామంలోని ఓ గోదాముపై దాడి జరిగిందని, తర్వాత భారీ పేలుడు సంభవించిందని తెలిపారు. ఆ ప్రాంతంలో ఎలాంటి పేలుడు సామాగ్రి ఉంచారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. నివాస ప్రాంతాల్లో మందుగుండు సామాగ్రి చేయడంపై నిల్వ సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇప్పటికే 370 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరసగా మూడు రోజుల నుంచి కీవ్‌ను రష్యా టార్గెట్ చేస్తోంది. రాజధాని ప్రాంతంపై రష్యా నిరంతరం వైమానిక దాడులు చేస్తోంది.

### ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఎఫ్ఎస్ఎస్ఎఐ

## కొత్త ప్రతిపాదనలు

### సుప్రీంకోర్టుకు ముసాయిదా అందజేత

**న్యూఢిల్లీ,ఆగస్టు 29:** ప్యాకేజ్డ్ ఫుడ్స్ పరంగా కేంద్ర ఆహారభద్రతా ప్రమాణాల సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ కొత్తప్రతిపాదనలను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఫ్రంట్ ఆఫ్ ప్యాకెట్ వార్నింగ్ లేబుల్స్‌కు సంబంధించి దాఖలైన కేసులో సుప్రీంకోర్టు గతంలో ఎఫ్ఎస్ఎస్ఏఐకి కీలక సూచనలు చేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఆ ఆహారానికి సంబంధించిన ప్రభావాల్ని చూపించే లేబుల్స్ ఉండేలా చూడాలని కోర్టు ఆదేశించింది. దీనివల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్తున్న ఫుడ్ ఎలాంటిదో ఒక అంచనాకు రాగలుగుతారు అని కోర్టు అభిప్రాయపడింది. ఈ వార్నింగ్ లేబుల్స్‌ను అమలు చేయడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆలస్యం చేసింది. దీనిపై స్పందించిన కోర్టు ఆహార తయారీ సంస్థలు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించింది. దీనివల్ల ప్రజల ఆరోగ్యం విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా కోర్టుకు ఆరు పేజీల అఫిడవిట్ సమర్పించింది. ఎక్కువ ఉప్పు, ఎక్కువ కొవ్వు, ఎక్కువ చక్కెర ఉండే పదార్థాలున్న ఫుడ్ ప్యాకేజ్‌పై రెడ్ లేబుల్ ఉండేలా చూస్తామని కోర్టుకు తెలిపింది. కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోని కీలక అంశాలివి. ప్యాకెట్ల ముందు భాగంలో ఆరు కోణాలుండే ఎరుపు రంగు మార్క్ ఉంటుంది. దీనర్థం ఆ ప్రొడక్ట్‌లో అధిక చక్కెర, అధిక ఉప్పు, అధిక కొవ్వు ఉన్నాయని. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆఫ్ ద ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ 2024లో సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఒక ఉత్పత్తిలోని పోషక విలువల్నిగుర్తిస్తారు. ఈప్రమాణాల ప్రకారం అధిక స్థాయిలో హానికర పదార్థాలుంటే రెడ్ లేబుల్ వేస్తారు. ముందు వైపు పెద్ద సైజులో రెడ్ లేబుల్ వేయడం వల్ల అది చాలా హానికరం అని పిల్లలు, తల్లిదండ్రులు గుర్తించే వీలుంది. అయితే, సహజసిద్ధమైన ఉత్పత్తులకు ఈ రూల్ వర్తించదు. అంటే తేనె, నెయ్యి, ఉప్పు, చక్కెర, నూనె వంటి వాటికి మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్ సమర్పించింది. దీనిపై మరో 10 రోజుల తర్వాత విచారణ జరగనుంది. ఆ తర్వాత ఈ నిబంధన అమలుపై కోర్టు నిర్ణయం తీసుకుంటుంది.

# సంక్షిప్త వార్తలు

## ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన రష్యా



**మాస్కో, ఆగస్టు 29:** ఒకవైపు ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తూనే రష్యా తన అత్యాధునిక ఆయుధాలను పరీక్షిస్తున్నది. తాజాగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్‌ను పరీక్షించినట్లు చెప్పింది. ఆర్కన్‌గెల్స్క్ ప్రాంతంలో పెసస్కీ కాస్మోడ్రోమ్ నుంచి వార్‌హెడ్‌ను పరీక్షించారు. అయితే ఆ క్షిపణి ఈశాన్య దిక్కుకు ప్రయాణించింది.

## టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కేసునమోదు

**కోల్‌కతా, ఆగస్టు 29:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీపై కేసు నమోదైంది. కోల్‌కతా పోలీసులు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కోల్‌కతా హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే ఆరోపణలపై కోల్‌కతా హేస్టింగ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఈ కేసు నమోదైంది. ఈ వ్యవహారం రాజకీయ దుమారానికి దారి తీసింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని మమత బెనర్జీ తప్పు పట్టారు.

## భారత్ సరిహద్దుల్లోకి పాక్ డ్రోన్

**శ్రీనగర్,ఆగస్టు 29:** భారత సరిహద్దుల్లో అలజడి సృష్టించేందుకు పాకిస్తాన్ మళ్లీ కుట్రలకు తెరలేపింది. జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట శత్రు దేశం నుంచి వచ్చిన డ్రోన్ ఒకటి ప్రత్యక్షం కావడంతో సరిహద్దులో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పూంచ్ జిల్లా సరిహద్దుల్లో ఈ సస్పెక్టెడ్ డ్రోన్ కదలికలు కనిపించడంతో మన రక్షణ దళాలు తక్షణమే అప్రమత్తమయ్యాయి. సరిహద్దుల్లోని ఆర్మీ బలగాలు రాత్రికి రాత్రే అదనపు నిఘాను ఏర్పాటు చేసి, సరిహద్దు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

## ఘోరప్రమాదం, నలుగురు విద్యార్థులు మృతి

**మధురాంతకం, ఆగస్టు 29:** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మదురాంతకం సమీపంలో ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. పుదుచ్చేరి టూర్ ముగించుకుని చెన్నైకి తిరిగి వస్తుండగా ఈ విషాద ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా వెనుక టైరు పేలడంతో వాహనం అదుపుతప్పినట్లు సమాచారం. దీంతో కారు పలుమార్లు పల్టీలు కొట్టినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు విద్యార్థులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## జావోజోంగ్‌పై జిన్‌పింగ్ వేటు

**బీజింగ్, ఆగస్టు 29:** చైనా సైన్యంలో కీలక జనరల్, 2017 డోక్లామ్, 2020 గల్వాన్ ఘర్షణకు బాధ్యుడిగా భావిస్తు జావో జోంగ్‌కిపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చర్యలు తీసుకున్నారు. జావోను చైనాలోని అత్యున్నత రాజకీయ సలహా సంస్థ అయిన చైనీస్ పీపుల్స్ పొలిటిషియన్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ నుంచి తొలగించడంతో పాటు మరో రెండు కీలక పదవుల నుంచి కూడా తప్పించారు. భారత సరిహద్దులో ఉన్న టిబెట్, షింజియాంగ్ ప్రావిన్సులతో పాటు భారత్‌చైనా సరిహద్దులోని చాలా ప్రాంతాలకు బాధ్యత వహించే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు జావో జోంగ్ నాయకత్వం వహించాడు.

## పుఝుల్ జైలులో సిఎం విజయ్ ఆకస్మిక తనిఖీలు

**చెన్నై, ఆగస్టు 29:** తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పుఝుల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు. పుఝుల్ సెంట్రల్ ప్రిజన్1లోని పలు విభాగాలను సిఎం విజయ్ పరిశీలించారు.



శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో చర్చిస్తున్న ప్రతినిధి బృందం

# నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేలా సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థ

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతు సంక్షేమ కమిషన్ నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేలా సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సూచించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో శనివారం ఛైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలోని రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం కలిసి ఒక నివేదికను సమర్పించింది.కమిషన్ సిఫార సులపై ముఖ్యమంత్రి కమిషన్ సభ్యులు చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యా నవన పంటల సాగు పెంపు, ఎఫ్పీవోల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించ చాలన్నారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ సరిహద్దులను తక్షణం గుర్తించి ఆక్రమణలను తొలగించి పరి రక్షించాలని సూచించారు. రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి నివేదికలో కమిషన్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసిందని తెలిపారు. చిన్న, పెద్ద నీటి పారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నివేదికలో పేర్కొన్నట్లు చెప్పారు. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. కాగా గడిచిన రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ ప్రతినిధి బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. సిఎంను కలిసిన రైతు కమిషన్ ఛైర్మన్‌తో పాటు, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం.భవానీరెడ్డి ఉన్నారు.

# అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి డెడ్‌లైన్

## సెప్టెంబరు నెలాఖరు వరకూ గడువు

## ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

## నెలల తరబడి పూర్తికాని నియామకాలు

## 15,982 పోస్టుల భర్తీ జాప్యంపై సర్కార్ అసంతృప్తి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** అంగన్వాడీ కేంద్రాలలో నియామక ప్రక్రియను వేగవంతం చేసి సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇదే సమయంలో అంగన్‌వాడీల భర్తీ ప్రక్రియ నెలల తరబడి అవుతున్నా పలు జిల్లాల్లో వాటిని భర్తీ చేయకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 15,982 పోస్టుల ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని జోన్1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. అలాగే జోన్2లో 1,247 టీచర్, 5,145 ఆయా పోస్టులు భర్తీ కానున్నాయి. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీ ముందుకు సాగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15,982 పోస్టులను ఒకేసారి భర్తీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినప్పటికీ క్షేత్రస్థాయిలో అది అమలు కావడంలేదు. ఈ మొత్తం ఖాళీల్లో 3100 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఉండగా, 12,882 సహాయకుల పోస్టులు ఉన్నాయి.

ప్రధానంగా అధికారుల అలసత్వం, సాంకేతిక సమస్యల వల్ల నియామక ప్రక్రియ అనుకున్న స్థాయిలో జరగడం లేదని విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలోని సగానికి పైగా జిల్లాల్లో ఇప్పటివరకు నోటిఫికేషన్లు వెలువడకపోవడం పట్ల సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల నుంచి దాదాపు 10 వేలకు పైగా పోస్టులకు సంబంధించి ప్రభుత్వానికి ఇంకా అంగన్వాడీ పోస్టుల ఖాళీలు, భర్తీ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని తెలిసింది. కొన్ని జిల్లాల్లో కేవలం టీచర్ పోస్టులకు మాత్రమే ప్రకటనలు విడుదల చేసి సహాయకుల పోస్టులను పెండింగ్‌లో పెట్టారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెం, సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, భువనగిరి, మేడ్చల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, గద్వాల, నల్గొండ, సూర్యాపేట, ములుగు తదితర జిల్లాల్లో మాత్రమే ఇప్పటి వరకు నోటిఫికేషన్ విడదలైనట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక నోటిఫికేషన్ల జాప్యం కారణంగా ప్రస్తుతం రాష్ట్రంలోని దాదాపు 35 శాతం అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడం, ప్రీస్కూల్ నిర్వహణ, బాలింతలు, గర్భిణులకు రేషన్ పంపిణీ వంటి రోజువారీ కార్యకలాపాలు ఒంటరిగా నిర్వహించడం అంగన్వాడీ టీచర్లకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో విద్యాభ్యాసంతో పాటు క్షేత్రస్థాయి సంక్షేమ పర్యవేక్షణ కూడా సజావుగా సాగడం లేదని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఇక జాప్యం జరగకుండా నియామక నప్రక్రియకు ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది.

# సమగ్ర విత్తన చట్టానికి రూపకల్పన

## నకిలీల వల్ల వచ్చే నష్టానికి పరిహారం

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకొస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వచ్చే పంట కాలానికి విత్తన చట్టాన్ని అమల్లోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ సచివాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే ప్రత్యేక విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కమిటీ సూచనల మేరకు విత్తన చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రం విత్తన చట్టం2025పేరుతో ముసాయిదా బిల్లును రూపొందించిందని, నెలలు గడిచినా దానిపై ముందడుగు లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తన అభిప్రాయాలను, సూచనలను పంపి నెలలు గడిచినా విత్తన చట్టం విషయంలో కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో ముందడుగు పడలేదని చెప్పారు. దీంతో వచ్చే పంటకాలానికైనా విత్తన చట్టం అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని వెల్లడించారు. తెలంగాణ దేశంలోనే ప్రముఖ విత్తన ఉత్పత్తి రాష్ట్రంగా గుర్తింపు పొందిన నేపథ్యంలో విత్తన రంగానికి సమగ్ర చట్టపరమైన వ్యవస్థ ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర చట్టం తెచ్చినట్లయితే దాన్ని రాష్ట్రంలో అమలు చేస్తామని, ఒకవేళ అది కాని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా విత్తన బిల్లును రూపొందించి అమలు చెస్తామన్నారు.

రైతు-విత్తన కంపెనీ మధ్య నేరుగా పారదర్శక ఒప్పంద వ్యవస్థ ఉండేలా చూడాలని, మధ్యవర్తుల పాత్రను నియంత్రించాలని సూచించారు. విత్తన ఉత్పత్తికి రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పంట బీమా, నాణ్యతలేని విత్తనాల వల్ల పంట నష్టం జరిగితే రైతులకు పరిహారం అందేలా చట్టబద్ధమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పారు. కిలీ, నాసిరకం, అనధికార విత్తనాల విక్రయా లను అరికట్టేందుకు కఠినమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించాలన్నారు. విత్తన ఉత్పత్తి ప్రాంతాలను క్రాప్ బుకింగ్, విత్తనం యొక్క అసలు మూలం దశ నుండి, అది నాటబడిన పొలం వరకు దాని పూర్తిగా పరీక్షించి,నధ్రువీకరించగల సామర్థ్య వ్యవస్థతో అనుసంధానం చేయాలని చెప్పారు.

మండల స్థాయిలో సీడ్ బ్యాంకులు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులను ప్రోత్సహించడంతో పాటు సంప్రదాయ, దేశీయ విత్తన రకాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

# జిల్లా ఆదివాసి కాంగ్రెస్ ఛైర్మన్‌ల ఎంపికకు పరిశీలకుల నియామకం

**హైదారబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** తెలంగాణలోని ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కమిటీల ఏర్పాటుకు తొలిమెట్టు ఛైర్మన్‌ల నియామకం కోసం అభ్యర్థులను ఎంపిక చేయడానికి 13 మంది పరిశీలకులను నియమించారు. టిపిసిసి ఆదివాసి ఛైర్మన్ ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఈ మేరకు ఇంచార్జీల పేర్లు వారి ఫోన్ నెంబర్లను వివరిస్తూ జాబితా విడుదుదల చేశారు. ఆనందరావు కరీంనగర్,జగిత్యాల ఇంచార్జీగా ఉంటూ డిసిసి ఆదివాసి ఛైర్మన్ ఎంపిక చేయడానికి ఔత్సాహికుల నుంచి విన్నపాలు తీసుకొని అర్హుల జాబితాను రూపొందించి శంకర్‌నాయక్ అందజేస్తారు. చంద్రకళ వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాకు ,మల్లికార్జున్ ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, హనుమంతునాయక్‌మహబూబాబాద్ ములుగు, రామచందర్‌నాయక్ వికరాబాద్ రంగారెడ్డి, మేడ్చెల్ మల్కాజిగిరి, మోహన్‌కుమార్ యాదాద్రి భువనగరి,మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, విశ్వనాథ్ రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి,కోత్యానాయక్ జయశంకర్ భూపాలపల్లి హైదరాబాద్,గణేష్‌రాథోడ్ కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సిద్దిపేట, కృష్ణానాయక్ మెదక్ సంగారెడ్డి గద్వాల, శ్రీనివాస్‌నాయక్ నారాయణపేట్ వనపర్తి,సునీల్‌జాదవ్ నిజామాబాద్,కామారెడ్డి మల్లేశ్వరీ ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాలో ఔత్సాహిక కాంగ్రెస్ నాయకుల నుంచి వినతులు తీసుకొని ఆదివాసి కాంగ్రెస్ కార్యకర్త శ్రేణుల అభిప్రాయంతో జాబితాను రూపొందించి అర్హులను సూచిస్తారు. అందులో నుంచి ఆదివాసి కాంగ్రెస్ జిల్లా సారథులను ఎంపిక చేసి ప్రకటిస్తారు. తరువాత అన్ని జిల్లాలో ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కార్యవర్గంకు పూర్తి రూపం ఇస్తారు.

# వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

## తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజన్సీ ఛైర్మన్ చరణ్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** వరంగల్ నగరంలోని మామునూర్ అభివృద్ధి పరుస్తున్న ఎయిర్‌పోర్టు తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, బహుజన వీరుడు దొడ్డి కొమరయ్య స్మారకచిహ్నంగా నిలిచేలా ఆయన దొడ్డికొమురయ్య విమానశ్రయంగా నామకరణం చేయాలని తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజన్సీ ఛైర్మన్ డాక్టర్ చరణ్ కౌశిక్‌యాదవ్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం మాట్లాడుతూ ఒంద్ర బొగ్గు గనుల శాఖసాంస్కృతిక శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి రాసిన లేఖను విడుదలచేశారు. ఆ లేఖలో వరంగల్ ఎయిర్‌పోర్టుకు “అమరవీరుడు దొడ్డి కొమరయ్య విమానాశ్రయం“గా నామకరణం చేయడం కొరకు కేంద్ర ప్రభుత్వం తరఫున చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ,తెలంగాణ నిరంకుశ రాచరిక పాలనకు, నిజాం మూకలు భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత పోరాటంలో తన ప్రాణాలను అర్పించిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని ఆయన చరిత్రను మంత్రికి లేఖలో వివరించినట్లు తెలిపారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా లో కొమరయ్య జన్మభూమి పోరాట నిలయం కేంద్రం కావడంతో కేంద్ర పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలో పునరుద్ధరణ పొందుతున్న మామునూరు విమానాశ్రయానికి “అమరవీరుడు దొడ్డి కొమరయ్య విమానాశ్రయం“ గా నామకరణం చేసేలా కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ దృష్టికి ఈ ప్రతిపాదనను తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇది ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యతను, బహుజన పోరాట చరిత్రను ఎలుగెత్తి చాటడమే కాకుండా, విప్లవ వీరుడికి అందించే గొప్ప నివాళి అవుతుంది.తెలంగాణ నేల అందించిన గొప్ప అమరవీరుడి త్యాగానికి తగిన గుర్తింపు లభించేలా కేంద్ర మంత్రిగా మీరు ప్రత్యేక శ్రద్ధ వహించి, ఈ ప్రతిపాదనను ఆమోదింపజేయగలరని ఆయన కోరారు.

# విద్యాబోధన అధునాతన సాంకేతిక పద్ధతిలో ఉండాలి



సంస్కృతి పురస్కారంతో టి.వి.శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, రమణాచారి, బుద్ధప్రసాద్, నిత్యానందరావు, హనుమంతరావు తదితరులు

## త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి

## నిస్వార్థ రాజకీయ నేత మండలి వెంకటకృష్ణారావు: డా. కె.వి.రమణాచారి

## టి.వి.శ్రీనివాస్‌కు మండలి వెంకటకృష్ణారావు సంస్కృతి పురస్కార ప్రదానం

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 29, ప్రభాతవార్త :** విశ్వవిద్యాలయాలలో నిష్క్రియాత్మక కోర్సులకు విద్యార్థులకు అభిరుచి కలిగిన మరేతర కళను జోడించి కోర్సులను రూపొందించాలని, వాటికి నూతనత్వం, అధునాతన, సాంకేతిక పద్ధతుల ద్వారా బోధనను కొనసాగించాలని త్రిపుర రాష్ట్ర గవర్నరు ఎన్.ఇంద్రసేనారెడ్డి సూచించారు. ఇందుకు అనుగుణంగా లలితకళల ద్వారా విద్యార్థి జీవితాన్ని అనుసంధానిస్తూ లోకజ్ఞానాన్ని అందించే సాంకేతిక విద్యా పాఠ్యప్రణాళికలను తెలుగు విశ్వవిద్యాలయం రూపొందించాలని కోరారు. ఇంటిభాష బడిభాషగా మారాలంటే ప్రతి పాఠశాలలో మాతృభాషా బోధన అనివార్యమని స్పష్టం చేశారు. నేడు అన్నిటికీ పరిష్కారం చూపుతుందని భావించే కృత్రిమ మేధస్సును తెలుగు వాడుక భాషలోనే ప్రశ్నించాలని, తద్వారా మాతృభాష విస్తరిస్తుం దని ఇంద్రసేనారెడ్డి అభి ప్రాయపడ్డారు. ఈ సంద ర్భంగా తెలుగు విశ్వ విద్యాలయ అధికారులకు పలు ముఖ్య సూచనలను చేశారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం, హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీలోని కళా వేదికలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారం-2026 ప్రదానోత్సవం జరిగింది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్. ఇంద్రసేనారెడ్డి ముందుగా మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించి ప్రసంగించారు. విశ్వవిద్యాలయంలో మండలి వెంకటకృష్ణారావు పేరిట నెలకొల్పిన సంస్కృతి పురస్కారాన్ని పుణే ఆంధ్ర సంఘం సలహాదారు తిరువలూరి వంగీపురం శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రదానం చేశారు. పురస్కారంతోపాటు జ్ఞాపిక, రూ. 25వేల నగదు పారితోషికం బహూకరించారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి రాజకీయమంటే ప్రజాసేవనేనని ప్రగాఢంగా నమ్మే నిస్వార్థపూరిత రాజకీయ నాయకుడు వెంకట కృష్ణారావు అని గుర్తుచేస్తూ ఆయన పేరిట తెలుగు విశ్వ విద్యాలయం మండలి బుద్ధప్రసాద్ సహకారంతో ప్రతీయేటా తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షిస్తున్న ప్రవాసాంధ్రులను సంస్కృతి పురస్కారంతో సత్కరించడం శ్లాఘనీయమన్నారు. సభకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు స్వాగతం పలుకగా, ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం పక్షాన దేశంలోని అనేక రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న తెలుగు భాష కోర్సులకు సంబం ధించిన పాఠ్య ప్రణాళికలను రూపొందిస్తు న్నామని, ఆయా రాష్ట్రా ల్లోని తెలుగు సమాజాలు నిర్వహిస్తున్న సంప్ర దాయ పండుగలకు, ఉత్సవాలకు తెలుగు విశ్వ విద్యాలయం ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. అలాగే తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే వివిధ ఉత్స వాలను నిర్వహిస్తున్నామని, ఇటీవలే దేశ రాజధాని ఢిల్లీలో 3 రోజులు కూచిపూడి నృత్యో త్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. త్రిపుర ప్రభుత్వం అవకాశమిస్తే తెలుగు సంప్ర దాయ సంస్కృతి కళలను ప్రదర్శించడానికి సు ముఖంగా ఉన్నట్లు పేర్కొన్నారు. విశిష్ట అతిథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవనిగడ్డ ఎమ్మెల్యే డా. మండలి బుద్ధప్రసాద్ దేశంలో అనేక ప్రాంతాలలో తెలుగువారు అత్యున్నతస్థానంలో ఉన్నారని, వారు తమదైన శైలిలో తెలుగుభాషా సంస్కృ తులను కాపాడుతున్నారని ఆనందాన్ని వ్యక్త పరుస్తూ తన తండ్రిపేరిట సంస్కృతి పురస్కారం అందిస్తున్న తెలుగు విశ్వ విద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు.





# గ్లోబల్ మార్కెట్‌లోకి లలితా జ్యుయెలర్స్

## త్వరలో మలేసియాలో రెండు కొత్త బ్రాంచీలు

## బిఎస్ఇ లిస్టింగ్‌లోకి 'లలిత జ్యుయెలరీ మార్ట్' పేరు

## సక్సెస్ మీట్‌లో సంస్థ సిఎండి కిరణ్‌కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నిన్న, నేడు, రేపు అన్నీ సమయాల్లో బంగారం ధరలు గమనిస్తే ఎప్పుడైనా బంగారం ధర అంచలంచెలుగా పెరుగుతూనే ఉందని లలిత జ్యుయెలరీ సంస్థ సిఎండి ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన లలిత జ్యుయెలరీ ఐపిఒ విజయవంతమైన సందర్భంగా ఆయన సక్సెస్ మీట్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. 'నెల్లూరు కుర్రోడు చదువులేదు. బ్యాక్ గ్రౌండ్ లేదు. కేవలం 48 గ్రాముల బంగారంతో రూ.280 గ్రాము ఉన్నప్పుడు వ్యాపారాన్ని ప్రారం భించి, తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 64 బ్రాంచిలు కొనసాగుతున్నాయని తెలి పారు. సౌత్ ఇండియాలో 110 షోరూమ్‌ల లక్ష్యాన్ని పూర్తిచేస్తామన్నారు. సౌత్ ఇండియాతోపాటు నార్త్ ఇండియా మార్కెట్లలోకి కూడా వెళ్లినట్లు తెలి పారు. ఈ యేడాది కంపెనీ నిర్వహణ ఆదాయం సుమారు 25వేల కోట్లు కాగా, పన్ను తర్వాత లాభం సుమారుగా వెయ్యి కోట్లు ఉందన్నారు.

లలిత జ్యుయెలరీ మార్ట్ ఐపీఓ మార్కెట్లో ఆదరణ పొందుతోందని, ఐపీఓకు విశేష స్పందన లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఐపీఓ ముగిసే సమయానికి షేర్లకు 62.97 రెట్ల అధిక సబ్‌స్క్రిప్షన్ రావడం విశేషమని పేర్కొన్నారు. నగల విక్రయ రంగంలోనే కాకుండా ఐపీఓ విషయంలోనూ లలిత జ్యుయెలరీ సరికొత్త ట్రెండ్‌ను సృష్టించిందని తెలిపారు. త్వరలో మలేసియాలో రెండు బ్రాంచీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా లలిత జ్యుయెలరీ మార్ట్‌ను విస్తరిస్తామన్నారు. ఈ థాంక్స్ మీట్ కార్యక్రమంలో సోమాజిగూడ బ్రాంచ్ మేనేజర్ వి.ఎస్. నాగేశ్వరరావు, హెచ్‌ఆర్ మేనేజర్ తిరుపతి స్వామి, కూకట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ అనిల్ కుమార్, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ ప్రభుకిరణ్, చందానగర్ బ్రాంచ్ మేనేజర్ గోవింద్, సుచిత్ర బ్రాంచ్ మేనేజర్ ఠాగూర్, సికింద్రాబాద్ బ్రాంచ్ మేనేజర్ సాయికుమార్, సోమాజిగూడ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ తరహాలో బిసి గణన చేయకపోతే బహిష్కరిస్తాం

## బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు

**హైదారబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** కేంద్రం చేపట్టిన జాతీయ జన గణనలో ఎస్సీ ఎస్టీలను లెక్క కట్టినట్లు బిసిలను లెక్కించాలని, అలా చేయకపోతే జనగణను బహిష్కరిస్తామని ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి. హనుమంత రావు అన్నారు. పిసిసి కార్యాలయం గాంధీభవన్‌లో శనివారం ఒబిసి కులగణన సమావేశం జరిగింది. బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహా దారులు వి. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రొ. కంచె ఐలయ్య, పిసిసి ఒబి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్లపల్లి శంకర్ మెట్టు సాయికుమార్ ఛైర్మన్ ఫిషర్‌మెన్, క్రమశిక్షణ కమిటీ కో ఛైర్మన్ శ్యామ్ కుమార్, మాజీ మేయర్ రామ్మోహన్, రాజన్న సిరిసిల్ల జిల్లా డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. కాంగ్రెస్ బిసి నాయకుల సమావేశంలో బిసిలను కులాలవారీగా లెక్కించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. జాతీయ కులగణన చేస్తున్న క్రమంలో ఎస్సీ, ఎస్టీలకు లెక్కలు ఉన్నట్టే బిసిల కులాల లెక్కలు ఉండాలని తీర్మానం చేశారు. ఈ సమావేశ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి, ఎఐసిసి అగ్ర నేతలు రాహుల్ గాంధీ, మలికార్జున్‌ఖర్గేకు పంపిస్తామని వి. హనుమంతరావు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలాగానే జన గణనలో బిసిల సంఖ్యను నమోదు చేయాలని లేకపోతే జనగణను బహిష్కరిస్తామని సమావేశం తీర్మానం చేసింది. విహెచ్ మాట్లాడుతూ ప్రస్తుతం కులగణనలో భాగంగా ఉన్న ప్రస్తుత ప్రశ్నావళి రద్దు చెయ్యాలని, స్పష్టంగా ఉండే కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని డిమాండ్ చేశారు. జనాభాకు చెందిన సమాచార డేటా దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు. కచ్చితమైన డేటా లేకపోతే విద్య, ఉపాధి సంక్షేమం సరిగా అమలు చెయ్యలేమని అన్నారు. రాజకీయ పార్టీలు, నిపుణులతో సంప్రదించి కొంత ప్రశ్నావళి రూపొం దించాలని తెలంగాణ, బీహార్‌లో అలవలంబించిన విధానాలు అనుసరించాలని ఆయన సూచించారు. కంచె ఐలయ్య వంటి వారు పదవులు లేకపోయినా సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తారని కుల వ్యవస్థ వల్ల నిరాదరణకు గురైన వర్గాలే దోపిడీకి గుంయ్యారని, వారికి గొంతుగా ఆయన పనిచేశారని కితాబు ఇచ్చారు.

# మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసిన కాంగ్రెస్



మీడియాతో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

## సంక్షేమంతో సాధికారత కల్పించిన మోడీ ప్రభుత్వం

## కేంద్ర సంక్షేమ ఫలాల్లో 37 శాతం లబ్ధిదారులు మైనారిటీలే

## ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరం గేయాన్ని కించపరచవద్దు: పార్టీ రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29, ప్రభాతవార్త:** భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, ఎన్ని కులాలు, మతాలు ఉన్నా మనమందరం భారతీ యులుగా ఐక్యంగా జీవించడమే ఈ దేశ గొప్పతనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణతోపాటు పలువురు రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలు పాల్గొన్నారు. రాంచందర్ రావు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ సమాజంలో విభజన రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. దేశంలో అత్యధిక మత ఘర్షణలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో, వారి హయాంలోనే జరిగాయని చారిత్రక వాస్తవాలను గుర్తుచేశారు. వాజ్‌పేయి హయాం నుండి నేటి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన వరకు బీజేపీ ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడుతూ,సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ముద్రా, జన్ ధన్, ఉజ్వల, ఉడాన్ వంటి ప్రతి సంక్షేమ పథకంలో 22 శాతం నుండి 37 శాతం వరకు లబ్ధిదారులు మైనారిటీ వర్గాల వారే ఉండటం మోదీ ప్రభుత్వ సమన్యాయ పాలనకు నిదర్శనమన్నారు. ఏటా మైనారిటీ విద్యార్థులకు భారీగా స్కాలర్‌షిప్‌లు అందిం చడంతో పాటు, ముస్లిం యువత యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో రాణించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తోందని తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం పై కాంగ్రెస్ పార్టీ కల్పించిన అపోహలను ర్నాచందర్ రావు తీవ్రంగా ఖండించారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఉండిపోయిన హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు అక్కడ మత చాందసవాదుల చేతుల్లో బలవంతపు మతమార్పిడులు, అణచివేతకు గురై భారత్‌కు శరణార్థులుగా వచ్చారని వివరించారు. పాకిస్తాన్ తొలి న్యాయశాఖ మంత్రి జోగేంద్రనాథ్ మండల్ సైతం అక్కడ వివక్షను తట్టుకోలేక భారతదేశానికి తిరిగి రావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొని మన దేశానికి వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించే చట్టం సిఎఎ అని స్పష్టం చేశారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్టను దెబ్బతీయడానికి, డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ దీనికి మత రంగు పూసి అల్లర్లు సృష్టించే కుట్ర చేసిందని ఆరోపించారు.నిజాం నిరంకుశ పాలనపై హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ వంటి దేశభక్తులు సైతం వందే మాతరం నినదిస్తూ ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. వందేమాతరం ఏ మతానికీ వ్యతిరేకం కాదని, అది పవిత్రమైన భరతమాతను గౌరవించే జాతీయ గేయమని పేర్కొన్నారు. 1937లో ముస్లిం లీగ్‌కు భయపడి మొదటి రెండు చరణాలకే పరిమితం చేసిన కాంగ్రెస్, నేడు కేరళలో జమాతే ఇస్లామీ, తెలంగాణలో మజ్లిస్ పార్టీల ఓటు బ్యాంకుకు భయపడి వందేమాతరాన్ని వ్యతిరేకిస్తూ దేశభక్తిని అవమానిస్తోందని ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వంలో మాత్రమే మైనారి టీలకు నిజమైన రక్షణ, విద్య, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో సమాన అవకాశాలు అందుతున్నాయని, ఈ వాస్తవాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని మైనారిటీ మోర్చా శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని రామచందర్ రావు తీవ్రంగా విమర్శించారు.

# రైతులకు అందని ఇన్‌పుట్ సబ్సిడీ

## రూ.17.59 కోట్లు నిలిపివేసిన సర్కార్

## దెబ్బతిన్న పంటలపై రైతుల ఆందోళన

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసినా నిధులు విడుదల చేయడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. రాష్ట్రంలోని పెన్‌గంగా నది పరివాహక గ్రామాలలో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదల చేసిన రూ.17.59 కోట్ల పరిహారాన్ని గత ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంతో రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్‌ఎఫ్) నుండి ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేశారు. వరద ప్రభావిత గ్రామాల్లో మొత్తం 20 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు చొప్పున ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే, ఆ మొత్తం ఇప్పటివరకు తమకు అందలేదని రైతులు తెలిపారు. ఆ మొత్తాలను తమ బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేస్తున్నారు.

ఈ సీజన్‌లో పంట నష్టాన్ని అంచనా వేయడానికి, నష్టాలకు పరిహారం అందించడానికి కొత్తగా సర్వే చేయాలని కూడా వారు కోరారు. తాము ఏడాదికి పైగా వ్యవసాయ కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా, స్తంభన కారణంగా తమకు నష్టపరిహారం అందలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరం జైనాడ్, బేలా, ఆదిలాబాద్ మండలాల్లో పత్తి, సోయా పంటలు నీట మునిగాయని, దీంతో 20 వేల ఎకరాల మేర నష్టం వాటిల్లిందని రైతు స్వరాజ్య వేదిక నాయకులు తెలిపారు. అదే మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా వరదల కారణంగా రైతులు పంట నష్టాన్ని చవిచూశారని అన్నారు.

## భారత్‌లో ముస్లింలు ఉండకూడదనుకుంటే
# హిందువులు మిగలరు

### న్యూయార్క్‌లో మోహన్‌భగవత్

**న్యూయార్క్, ఆగస్టు 29:** హిందూ జాతీయవాద భావజాలంతో పనిచేస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)పై తరచూ ఎదురయ్యే ప్రశ్నకు ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. అమెరికా




పర్యటనలో భాగంగా శనివారం న్యూయార్క్‌లో జరిగిన బహుళ మత చర్చాకార్యక్రమంలో పాల్గొన్న భగవత్ మత సామరస్యాన్ని నొక్కి చెప్పారు. మీరు మిమ్మల్ని హిందువుగా పిలుచుకోవాలంటే, అన్ని మార్గాలు ఒకే లక్ష్యానికి దారితీస్తాయని నమ్మాలి. ప్రతి మనిషికీ గౌరవం ఉంది. మనుషుల మధ్య ఎలాంటి తేడా లేదు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గతంలో తనను ముస్లింలకు సంబంధించి అడిగిన ప్రశ్నను భగవత్ గుర్తుచేసుకున్నారు. "నేను ఒకసారి ప్రసంగిస్తున్నప్పుడు అక్కడ ముస్లిం సోదరులు కూడా ఉన్నారు. మీరు హిందూ సంస్థ అని చెబుతున్నారు హిందూ రాష్ట్రం గురించి మాట్లాడుతున్నారు.. మరి ముస్లింల సంగతేంటి? మమ్మల్ని దేశం నుంచి వెళ్లగొడతారా? అని వారు నన్ను అడిగారు. అందుకు నేను లేదు, అది హిందుత్వం కాదు అని చెప్పానని వివరించారు. భారత్‌లో ఒక్క ముస్లిం కూడా ఉండకూడదని ఏ హిందువైనా భావిస్తే, అతడు హిందువుగా మిగలడని భగవత్ వ్యాఖ్యానించారు. హర్యానాలో జరిగిన ఓ ఘటనను కూడా భగవత్ ఉదాహరణగా ప్రస్తావించారు. "మా స్వయంసేవకులు ఎక్కడైనా అందరికీ సమానంగా సేవ చేస్తారు. భారత్‌లోని హర్యానాలోని దాద్రి ప్రాంతంలో రెండు విమానాలు ఢీకొన్నాయి. అందులో ఎక్కువ మంది ప్రయాణికులు ముస్లింలే. మా స్వయంసేవకులు అక్కడికి మొదటగా చేరుకున్నారు. గాయపడిన వారికి చికిత్స అందించారు. కొద్దిమందే గాయాలతో ఉన్నారు.. మిగిలిన వారంతా మరణించారు. మృతదేహాలను వెలికితీసి, అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు" అని చెప్పారు. ఆ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు వీరు ముస్లింలు అనే ఆలోచన చేయలేదని ఆయన పేర్కొన్నారు.

# వివాదరహిత భూములకు యేడాదిలో పట్టాలు

### ప్రతి అంగుళం సర్వే చేస్తాం

### దశాబ్దాల భూసమస్యలకు

### భూభారతి పరిష్కారం: మంత్రి పొంగులేటి



**సూర్యాపేట, నూతనకల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములను రానున్న ఏడాది కాలంలో ప్రతి అంగుళం సర్వే చేసి, నిజమైన భూ యజమానులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన 15 గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నప్పటికీ భూములకు హక్కు పత్రాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ ప్రభుత్వం గుర్తించి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ భారతి ద్వారా వివాదరహిత భూములకు హక్కులు కల్పించడంతో పాటు తరతరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో క్షేత్రస్థాయిలో ప్రతి అంగులం భూమిని సర్వే చేసి, అర్హులైన నిజమైన భూ యజమానులకు హక్కు పత్రాలు అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, దేవాదాయ, అసైన్డ్ భూముల ఆక్రమణలకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రానున్న ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తామని పునరుద్ఘాటించారు. భూములు కలిగి ఉన్న అర్హులందరికీ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతులకు కూడా న్యాయం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మహిళలకు గత రెండున్నరేళ్లలో రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, రానున్న రెండున్న రేళ్లలో కూడా అదే స్థాయిలో రుణాలు అందిస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భూమిపై హక్కు కలిగి ఉండటం రైతుకు ధైర్యం, ఆత్మగౌరవాన్ని ఇస్తుందన్నారు. భూమికి హక్కు లభిస్తే రైతులకు రైతు భరోసా, రైతు బీమా, రుణాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో రహదారి పనులు చేపడుతున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.100 కోట్లతో రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్ల పనులకు ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్‌రోడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# వర్ష సూచన: ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్

### రాష్ట్రంలో 38 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, అగస్టు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలో అత్యధికంగా 38 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోపక్క రాష్ట్రానికి వాతావరణ శాఖ వర్షాలకు సంబంధించి హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే వీలుందని వెల్లడించింది. ప్రధానంగా మెదక్, వికారాబాద్, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదే సమయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో చెట్ల కింద, హోర్డింగ్‌ల వద్ద ప్రజలు ఉండొద్దని సూచించింది.

**రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 35 డిగ్రీల నుండి 38 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన జిల్లాల్లో 32 డిగ్రీల 34 డిగ్రల వరకూ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. సూర్యాపేటన జిల్లాలోని మల్లచెర్వు మండలంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, నల్లగొండ జిల్లా వేములపల్లి మండంలో 37.6 డిగ్రీలు, ఖమ్మం జిల్లా యర్రంపాలెం మండలంలో 36.2 డిగ్రీలు, నారాయణ్‌పేట్ జిల్లా కృష్ణా మండలంలో 35.9 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో 35.7 డిగ్రీలు, గద్వాల్ జిల్లా ఐజ మండలంలో 35.6 డిగ్రీలు, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలాల్లో 35.5 డిగ్రీలు, నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రం, పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం, ములుగు జిల్లా వెంకటాపురం మండలాల్లో 35.3 డిగ్రీలు, కొత్తగూడెం జిల్లా సుజాతానగర్ మండలంలో 35.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

# సుమంత్‌ను కాపాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

### ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు29:** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్‌డి సుమంత్‌ను అరెస్ట్ కాకుండా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాపాడుతున్నారని బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.



జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్, చెక్‌పోస్ట్ సమీపంలోని ఒక డెన్‌లో కొండా సురేఖ మాజీ ఓఎస్‌డి సుమంత్ తన అనుచరులతో కలిసి బాధితుడు హరికృష్ణపై రాడ్లతో దారుణంగా దాడి చేశారని తెలిపారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే, దాదాపు 20 రోజుల పాటు కేసు నమోదు కాకుండా అడ్డుకుని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక సిఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం బిఆర్‌ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో దాడి జరిగితే సైబరాబాద్ పరిధిలోని మేడిపల్లిలో కేసు నమోదు కావడం సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోందని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసేంత వరకు సుమంత్‌పై కేసు నమోదు కాకుండా తొక్కిపెట్టారని పేర్కొన్నారు. కేసు నమోదైనా ఇప్పటి వరకు సుమంత్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు. పైగా కేవలం మూడు వారాల క్రితమే బాధ్యతలు స్వీకరించిన జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌ను ఈ వ్యవహారంలో బలిపశువును చేస్తూ అకారణంగా సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో ఎసిపి వెంకట్ రెడ్డిపై, డిసిపిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. డిజిపి కిందస్థాయి పోలీసులను కాపాడుకోకపోతే ఎవరు కాపాడుతారని అన్నారు. తాము గట్టిగా అడిగితే బిఆర్‌ఎస్ నాయకుల గన్ మెన్‌లను తీసివేస్తున్నారని, మరి జానా రెడ్డికి ఎందుకు ఇచ్చారని అడిగారు. ఆయనకు బుల్లెట్ ప్రూఫ్ కారు కూడా ఇచ్చారని పేర్కొన్నారు. తమ నేత జోగు రామన్నకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాజకీయ చదరంగంలో పోలీస్ అధికారులను బలిచేస్తున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వీటి అన్నింటిపై చర్చ జరగాలి అంటే సిట్ వేయాలని పేర్కొన్నారు.

# మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ

### డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

### ప్రజాభవన్‌లో డిప్యూటీ సిఎంతో మారిషస్ బృందం భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు29:** మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాలను ప్రమోట్ చేసేందుకు ఆదేశానికి అన్ని విధాలా సహకరిస్తామని మారిషస్ ప్రతినిధులుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. శనివారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనా రాజ్ పెంటియా బృందం ఉప ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారితో మాట్లాడుతూ తెలంగాణ మారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య స్నేహపూర్వ సంబంధాలున్నామని గుర్తు చేశారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషస్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మారిషస్‌లోని తెలుగు సమాజం అక్కడి గొప్ప బహుళ సాంస్కృతిక సమాజంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్నారు. మారిషస్ ప్రభుత్వం చేపడుతున్న రామ భజనంను కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క చెప్పారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాష, సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మారిషస్ లోని తెలుగు కల్చరల్ సెంటర్‌లో లక్షలాదిమంది తెలుగు ప్రవాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను, భాష పరిరక్షణ చేస్తున్నారని మారిషస్ మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజం పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు, తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషి పట్ల వారు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

# బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందించాలి

విచారణకు 2 రోజుల ముందే సమాచారం ఇవ్వాలని స్పష్టీకరణ

నోటీసులకు వారం రోజుల్లోగా వివరణ ఇచ్చే నిబంధనను అమలుచేయాలి

అభ్యంతరాలు, ఫిర్యాదుల వివరాలను ప్రతివారం రాజకీయ పార్టీలకు అందించాలి

కలెక్టర్లకు సిఇఒ సుదర్శన్‌రెడ్డి కీలక సూచనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 29:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీని అత్యంత నిక్కచ్చిగా, ఎటువంటి పొంపొట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి.




సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణపై శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందజేయా లని ఆయన స్పష్టం చేశారు. విచారణ జరిగే ప్రదేశం, తేదీ, సమయానికి సంబంధించిన వివరాలను కనీసం రెండు రోజుల ముందే ఓటరుకు తెలియజేయాలని నిర్దేశించారు. నోటీసు అందిన ఏడు రోజుల్లోగా వివరణ సమర్పించాలనే నిబంధనను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ, వివరణల నమోదు ప్రక్రియను ఆయన ఈ సందర్భంగా సమీక్షి ంచారు. అలాగే, మ్యాపింగ్ కానీ లేదా ఇతర సాంకేతిక లోపాలు ఉన్న కేసుల జాబితాను రాజకీయ పార్టీలకు అందజేయాలని సీఈవో సూచించారు. నోటీసులకు స్పందనగా సమర్పించాల్సిన పత్రాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్థితిగతులపై ప్రతి వారం రాజకీయ పార్టీలకు నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుతో మారిషస్ మంత్రి భేటీ

### గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు29:** మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ మంత్రి లుచ్‌మనన్ పెంతియా శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో పరిపాలన, టూరిజం, ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, నైపుణ్యాభివృద్ధి, విద్యా తదితర రంగాల్లో 'తెలంగాణ-మారిషస్' మధ్య ద్వైపాక్షి క సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలు, కార్యాచరణపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. ఆనతికాలం లోనే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న "తెలంగాణను తమ దేశం అత్యంత నమ్మకమైన భాగస్వామిగా పరిగణిస్తోందని ఈ సందర్భంగా మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియా పేర్కొన్నారు.

మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు, ఆధునిక పరిపాలనా విధానాలపై వారికి శిక్షణ ఇచ్చేందుకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. అలాగే... రాష్ట్రంలోని ఎంసీహెచ్‌ఆర్డీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇతర ప్రముఖ విద్యా సంస్థలతోనూ పనిచేసేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత

### 250 గజాల స్థలం, పింఛను, హెల్త్‌కార్డులు ఇచ్చేందుకు సానుకూలం

### సిఎం రేవంత్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు29:** తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ డాక్టర్ కె.కేశవరావు (కేకే) నేతృత్వంలో కమిటీ ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో సిఎ ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సుదీర్ఘంగా సమావేశమైంది. ఈ కీలక సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు. ఇటీవల అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా 13,000 మందికి పైగా ఉద్యమకారులు, వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులతో నిర్వహించిన విస్తృత స్థాయి సంప్రదింపుల వివరాలను, ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా, వారు సమర్పించిన ప్రధాన విజ్ఞప్తుల నివేదికను కమిటీ ముఖ్యమంత్రికి సమర్పించి సమగ్రంగా వివరించింది. కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్యమకారుల విజ్ఞప్తుల పట్ల అత్యంత సానుకూలంగా స్పందించారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెట్టిన తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం, వారి కుటుంబాలకు సేవ చేయడం ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ కసరత్తును ఎక్కడా ఆలస్యం చేయకుండా, అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని కమిటీకి సిఎం సూచించారు. కమిటీకి పూర్తి సహకారం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## 14 ప్రముఖ స్పేస్‌టెక్ కంపెనీల సిఇఒలు, ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు29:** 14 ప్రముఖ స్పేస్‌టెక్ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులతో ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివారంనాడు సమావేశమయ్యారు. ప్రత్యేక స్పేస్ సిటీ ఏర్పాటు చేయాలని పలు కంపెనీలు ప్రతిపాదించాయి. స్పేస్ సిటీ ప్రతిపాదనను పరిశీలిస్తామన్న మంత్రి శ్రీధర్‌బాబు టాప్5 స్పేస్‌టెక్ హబ్‌లలో హైదరాబాద్‌ను నిలబెట్టడమే లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి స్పేస్ టెక్నాలజీ తోడ్పాటు అందించనుందని, స్పేస్‌టెక్‌లో హైదరాబాద్ స్టార్టప్‌ల ప్రతిభ ఇప్పటికే వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. దేశంలోని స్పేస్‌టెక్ కంపెనీల్లో 30 శాతానికి పైగా హైదరాబాద్ నుంచే ఉన్నాయని, 18 నెలల్లో రాష్ట్రానికి 150కుపైగా గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు వచ్చాయని అన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, డీప్‌టెక్‌కు హైదరాబాద్ బలమైన కేంద్రమని వెల్లడించారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

### ఆరు వేల పింఛను ఎప్పుడిస్తారు?: హరీశ్‌రావు

**హైదరాబాద్ (వనస్థలిపురం), ఆగస్టు 29, ప్రభాతవార్త :** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమైందని అన్ని వర్గాలను సిఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. శనివారం ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్య లపై ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన 'సమరశంఖారావం' కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుమంచిరెడ్డి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ దివ్యాంగులను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని, ప్రతి ఒక్కరూ ఒక్కో గ్రామాన్ని చైతన్యవంతం చేసి ఈ కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి. రేవంత్ రెడ్డి వైఫల్యాలను, మోసపూరిత హామీలను సోషల్ మీడియా వేదికగా ప్రజలందరికీ తెలియజేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, దివ్యాంగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వికలాంగులకు సంబంధించి ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయాలని అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016 అమలువికలాంగుల హక్కుల చట్టం- 2016ను తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేయాలి. ఆర్‌పిడబ్ల్యుడి యాక్ట్ ప్రకారం వికలాంగులకు లభించాల్సి న హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఉద్యోగాల్లో 4 శాతం, పదోన్నతుల్లో 5 శాతం రిజర్వేషన్‌కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్, పదోన్నతుల్లో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. ప్రత్యేక నియామక ప్రక్రియ చేపట్టి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఆర్.టీ.సి. బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంవికలాంగులకు ఆర్.టీ.సీ.బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. ప్రస్తుతం మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం తరహాలో వికలాంగులకు కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాధాన్యగ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల్లో వికలాంగులకు తగిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యత కల్పించాలి. పురుష మరియు మహిళా వికలాంగులకు



సమర శంఖారావం కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించే విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని, వికలాంగుల పెన్షన్ పెంపుప్రస్తుతం వికలాంగులకు అందుతున్న నెలవారీ పెన్షన్‌ను రూ.6,000కు పెంచాలి. అంతేకాకుండా తీవ్ర స్థాయి వికలాంగులకు ప్రత్యేకంగా అధిక పెన్షన్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించి, తెలంగాణలో కూడా తీవ్ర వికలాంగులకు రూ.15,000 వరకు పెన్షన్ అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీలతో సమానంగా సబ్సిడీఇందిరమ్మ ఇళ్ల పథకంలో వికలాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఎస్సీ, ఎస్టీల వర్గాలకు అందిస్తున్న విధంగా వికలాంగులకు కూడా సమానమైన సబ్సిడీ, అదనపు సహాయాన్ని అందించాలి. ఇల్లు లేని వికలాంగ కుటుంబాలకు ప్రాధాన్యత క్రమంలో ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం బాధాకరం. వికలాంగుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. వికలాంగుల సమస్యలపై 6 ప్రధాన హామీలను తక్షణమే అమలు చేసి, వారికి అనుకూలమైన కీలక నిర్ణయాలను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల హామీలు అమలు చేయాలి, వికలాంగులకు న్యాయం చేయాలని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# బిజెపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ల నియామకం

**హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆదేశాల మేరకు రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ నాగపురి రాజమౌళి రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర పలువురిని నియమించారు. రాష్ట్ర కన్వినర్లుగా ఎనుబోలు శ్రీనివాస్ రాజ్, జె.ఎల్. శ్రీనివాస్, అనుముల రంజిత్ ప్రకాష్, జి. ప్రీతి జైన్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యులుగా పలువురిని నియమించారు.

# ఫీజుల బకాయి బిజెపి లడాయి


### 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

### సర్కార్‌కు బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యావ్యవస్థ పట్ల, విద్యార్థుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం వహిస్తున్న తీవ్ర నిర్లక్ష్యాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించారు. నాంపల్లిలో వున్న బిజెపి రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన ఫీజుల బకాయి బిజెపి లడాయి కార్యక్రమంలో బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 15,000 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధులను నిలిపివేసి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు చేపట్టిన రెండు రోజుల శాంతియుత నిరాహార దీక్షకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుమతి రద్దు చేయడాన్ని అప్రజాస్వామిక చర్యగా పేర్కొన్నారు. అణగారిన వర్గాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ నియంతృత్వ వైఖరికి నిరసనగా, పార్టీ కార్యాలయ ప్రాంగణంలోనే ఈ దీక్షను అధికారికంగా ప్రారంభించి కొనసాగిస్తున్నట్లు మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న 2,500 హామీని, రైతులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోగా, ఇప్పుడు ఏకంగా పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థుల భవిష్యత్తును సైతం ప్రమాదంలో పడేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థ దుస్థితికి ప్రభుత్వ వైఫల్యాలే నిదర్శనమని, బీహార్ లాంటి రాష్ట్రాలు మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం కేవలం 8శాతం మాత్రమే కేటాయించడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలోని మొత్తం 30,011 పాఠశాలల్లో ఏకంగా 21,121 పాఠశాలలు కనీస నిర్వహణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ 1,859 పాఠశాలల్లో సురక్షితమైన తాగునీటి సదుపాయం లేకపోవడం, 1,752 బాలికల పాఠశాలలు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకుండానే నడుస్తుండటం పారిశుద్ధ్య లోపానికి అద్దం పడుతుందని మండిపడ్డారు. విద్యావ్యవస్థ ఇంతలా కుప్పకూలుతుంటే, సిఎం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం వదిలేసి విదేశాల నుండి యూనివర్సిటీలను తీసుకొస్తానని విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. తెలంగాణలోని విద్యార్థి లోకానికి, వెనుకబడిన తరగతులకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పునరుద్ఘాటించారు. ప్రజాస్వామిక నిరసనలను అణిచివేసేందుకు ప్రభుత్వం చేసే ఎలాంటి కుటిల ప్రయత్నాలకు బిజెపి భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

# నేడు అనంతకు సిఎం చంద్రబాబు రాక

- ఎంవైఆర్ కళ్యాణమండపంలో పెళ్లికి హాజరు
- టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడుతో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహం



**అనంతపురం, ఆగస్టు 29 (ప్రభాతవార్త బ్యూరో):** అనంతపురం జిల్లా కేంద్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం రావడం అధికారికంగా ఖరారైంది. సీఎం చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకొని ప్రత్యేక హెలికాప్టర్లో ఇక్కడికి రానున్నారు. బళ్లారి రోడ్ లోని ఎం వై ఆర్ కళ్యాణమండపం లో టిడిపి జిల్లా అధ్యక్షులు , ఆర్టీసీ రీజనల్ చైర్మన్ అయిన పూల నాగరాజు కుమారుడు పిఎస్ శివరాజ్ తో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్యతో వివాహం జరగనుంది. ఈ వివాహ కార్యక్రమానికి సీఎం హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 30వ తేదీన తిరుపతి జిల్లా పర్యటన అనంతరం తొట్టంబేడు మండలంలో ఎంజిఎం హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి మధ్యాహ్నం 12:05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 01:15 గంటలకు అనంతపురం జిల్లా కేంద్రంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ 01:15 నుంచి 01:20 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు స్వాగతం పలుకుతారు. అనంతరం 01:20 గంటలకు అక్కడి హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 01:30 గంటలకు అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ కు చేరుకుంటారు. ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ లో మధ్యాహ్నం 01:30 నుంచి 01:45 గంటల వరకు గుంతకల్లు ఎమ్మెల్యే కుమార్తెకు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ కుమారుల వివాహ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించనున్నారు. తదనంతరం 01:45 గంటలకు ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ నుంచి బయలుదేరి 01:55 గంటలకు శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి మధ్యాహ్నం 02:00 గంటలకు బయలుదేరి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి లో ఉన్న నివాసమునకు రాష్ట్ర ముఖ్యమంత్రి వెళతారు. ఈ పరిస్థితుల్లో సీఎం పర్యటన విజయవంతం కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ముదురుతున్న శ్రీశైలం వివాదం

- తెలంగాణ, ఆంధ్రా పోటా పోటీగా నీటి విడుదల
- కరెంట్ ఉత్పత్తి నిలిపివేయాలని కేంద్రానికి ఎపి ఫిర్యాదు

**హైదరాబాద్, అగస్టు 29, ప్రభాతవార్త:** శ్రీశైలంలో జల విద్యుత్ ఉత్పత్తి వివాదం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ముదురుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి హైదరాబాద్ సుమారు 40 వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ఆరోపిస్తోంది. శ్రీశైలంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. రాబోయే నెలల్లో తాగునీటి అవసరాలను తీర్చడానికి శ్రీశైలం జలాశయంలోని నీటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, అలా చేయవద్దని అభ్యర్థించినప్పటికీ తెలంగాణ నీటిని తోడటం కొనసాగిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాసిన లేఖలో తెలిపింది. విద్యుత్ ఉత్పత్తి నెపంతో తెలంగాణ 34 టీఎంసీలకు పైగా నీటిని తోడిందని ఆ లేఖలో పేర్కొంది. అభ్యర్థించినప్పటికీ, శ్రీశైలం నుంచి తెలంగాణ నీటిని తోడటాన్ని ఆపడంలో కృష్ణా నదీ నిర్వహణ బోర్డు (కేఆర్ఎంబీ) విఫలమైందని ఆంధ్రప్రదేశ్ కేంద్రానికి ఫిర్యాదు చేసింది. కాగా నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదల విషయంలో ఈ నెల 26న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మొదలైన పోరు శుక్రవారం తీవ్ర స్థాయికి చేరింది. ఇరు రాష్ట్రాలు శ్రీశైలం నీటితో విద్యుత్ విద్యుత్ చేస్తున్నాయని ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నాయి. మరోపక్క ఇరు రాష్ట్రాలు జలాశయం నుంచి విడుదల చేసే నీటి పరిమాణాన్ని పెంచాయి. గత బుధవారం ప్రారంభమైన తన నియంత్రణలో ఉన్న ఎన్ఎస్ రైట్ కెనాల్ నుంచి 2,000 క్యూసెక్కుల నీటి విడుదలను ఆంధ్రప్రదేశ్ 6,553 క్యూసెక్కులకు పెంచిన నేపథ్యంలో, శుక్రవారం తెలంగాణ కూడా ఎన్ఎస్ లెఫ్ట్ కెనాల్ నుంచి తన నీటి విడుదలను 2,000 క్యూసెక్కుల నుంచి 6,650 క్యూసెక్కులకు పెంచింది. అయితే ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికే నీటిని విడుదల చేస్తున్నామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ వాదించుకుంటున్నాయి. తమ నియంత్రణలో ఉన్న శ్రీశైలం జలాశయం నుంచి ఆంధ్రప్రదేశ్ అధికంగా నీటిని తోడుతోందని తెలంగాణ ఆరోపిస్తుండగా, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ పవర్ హౌస్లో విద్యుత్ ఉత్పత్తిని సాకుగా చూపి, శ్రీశైలం నుంచి నీటిని తోడి నాగార్జునసాగర్కు పంపిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఆరోపిస్తోంది. కాగా శుక్రవారం నాడు, నాగార్జునసాగర్లో మొత్తం 312.050 టీఎంసీ అడుగుల నీటి నిల్వకు గాను, 181.929 టీఎంసీ అడుగుల నీరు నిల్వ ఉంది.

# నగ్నచిత్రాలతో ఎర..
# హనీట్రాప్‌తో సమాచార సేకరణ

## భారత్‌లో ఉధృతం అవుతున్న ఐఎస్ఐ కార్యకలాపాలు




**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** భారత్‌లో పాకిస్థాన్ ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన గూఢచర్య నెట్‌వర్క్‌లపై మరోసారి చర్చ మొదలైంది. ఢిల్లీలో శుక్రవారం ఓ యువ దంపతులను అరెస్ట్ చేయడంతో, భారత రక్షణ వ్యవస్థకు సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించేందుకు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఇటీవలి కేసులను పరిశీలిస్తే ఆన్‌లైన్‌లో టార్గెట్లను గుర్తించడం, హనీట్రాప్‌లోకి లాగడం, రక్షణ సంస్థలు మౌలిక వసతులకు సంబంధించిన సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నించడం వంటి అంశాలు పలువురు కేసుల్లో కనిపిస్తున్నాయని దర్యాప్తు వర్గాలు పేర్కొంటున్నాయి. దర్యాప్తు అధికారుల ప్రకారం, పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్లు సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించి భారత రక్షణ లేదా ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే వ్యక్తులను గుర్తించే అవకాశం ఉంది. యూనిఫాంలో ఉన్న అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు లేదా వ్యక్తిగతంగా బలహీనంగా ఉన్నట్లు కనిపించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. టార్గెట్‌ను గుర్తించిన తర్వాత, సాధారణంగా భారతీయ ఫోన్ నంబర్లతో నిర్వహించే సోషల్ మీడియా లేదా మెసేజింగ్ ఖాతాల ద్వారా పరిచయం ఏర్పరచుకునే ప్రయత్నం జరుగుతుందని చెబుతున్నారు. కొన్ని కేసుల్లో మహిళల ఫొటోలను ప్రొఫైల్‌లో ఉపయోగించిన ఖాతాల ద్వారా పరిచయం పెంచుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు చెబుతున్నారు. మొదట స్నేహపూర్వకంగా ప్రారంభమయ్యే సంభాషణలు తర్వాత వ్యక్తిగత విషయాలకు దారితీయవచ్చు. టార్గెట్ వ్యక్తి ప్రైవేట్ లేదా సన్నిహిత ఫొటోలను పంచుకున్న తర్వాత వాటిని ఉపయోగించి బ్లాక్‌మెయిల్ లేదా ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. అనంతరం రక్షణ సంస్థలు, సైనిక కార్యకలాపాలు లేదా ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీ కేసులో ఢిల్లీ కేసులో మొహమ్మద్ సాహిల్ (25), అతని భార్య సమీరా (21)లను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తు ప్రకారం, ఈ దంపతులు 2024-25 మధ్య కాలంలో ఎనిమిది భారతీయ సిమ్ కార్డులను సేకరించి, దుబాయ్ మీదుగా పాకిస్థాన్‌కు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సిమ్ కార్డులను పాకిస్థాన్ నుంచి వాట్సాప్‌ఖాతాలను యాక్టివేట్ చేయడానికి ఉపయోగించినట్లు, తద్వారా భారతీయ గ్రూపుల్లోకి ప్రవేశించి సున్నితమైన సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారని సమాచారం. భారత రక్షణ, ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే క్రమంలో హనీట్రాపింగ్ ఒక పద్ధతిగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల మేలో అరెస్టు అయిన ఓ సర్వింగ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ పై కూడా ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్లుగా భావిస్తున్న వ్యక్తులతో ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడి, అనంతరం సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తు వర్గాల ప్రకారం, నగ్న ఫొటోలను పంపిస్తానని చెప్పి సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సహోద్యోగి మొబైల్ ఫోన్‌లో సమాచారాన్ని దొంగిలించే సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసినట్లు కూడా ఆ అధికారిపై ఆరోపణలు నమోదయ్యాయి. ఇలాంటి కేసుల్లో గతంలో డీఆర్డీవోమాజీ శాస్త్రవేత్త ప్రదీప్ కురుల్కర్ పేరు కూడా వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌గా పేర్కొన్న జారా దాస్‌గుప్తా అనే వ్యక్తితో సంభాషణలు జరిపి, సున్నితమైన సమాచారాన్ని అందించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఆయనను 2023 మే 3న అరెస్ట్ చేసింది. ఆ తర్వాత ఆయనపై దర్యాప్తు కొనసాగి, జూన్ చివరి నాటికి సుమారు 1,837 పేజీల ఛార్జ్‌షీట్ సిద్ధం చేసినట్లు సమాచారం. 2024 ప్రారంభంలో మరో కేసులో సతేంద్ర సివాల్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. 2021 నుంచి మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ఇండియాబేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్‌గా పనిచేసిన ఆయనకు సున్నితమైన రాయబార కార్యాలయ పత్రాలకు యాక్సెస్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆయనను కూడా హనీట్రాప్ ద్వారా గూఢచర్యానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ కేసులు సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయం పెంచుకునే విషయంలో అప్రమత్తత అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ, రక్షణ రంగాల్లో పనిచేసే వ్యక్తులు తమ ఉద్యోగం, విధులు, కార్యాలయ వివరాలు లేదా సున్నితమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంచుకోకుండా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా తెలియని వ్యక్తులు పంపే లింకులు, ఫైళ్లు, యాప్‌లు లేదా సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయకపోవడం, వ్యక్తిగత ఫొటోలు, పత్రాలను అపరిచితులతో పంచుకోకపోవడం సైబర్ భద్రతలో కీలకం.

## పాల ఉత్పత్తిపై ఎల్ నినో ప్రభావం
# సంక్షోభంలో పాడి పరిశ్రమ

- పట్టిపీడిస్తున్న పశు గ్రాసం కొరత
- రాష్ట్రంలో తగ్గిపోతున్న పాల ఉత్పత్తి అందుబాటులో 4 లక్షల లీటర్లు
- ఇతర రాష్ట్రాల నుండి రోజూ 26 లక్షల లీటర్ల దిగుమతి

**హైదరాబాద్, అగస్టు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో పాడి పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో రోజురోజుకూ పాల ఉత్పత్తి తగ్గిపోతుండటంతో డిమాండ్‌కు సరిపడా పాలు లభించడం లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఈ రంగం రోజురోజుకీ క్షీణించిపోతున్న దుస్థితిని పశుగణన ఫలితాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. పశుగ్రాసం కొరత, వాతావరణ మార్పులు, పాడి పరిశ్రమపై రైతులు ఆసక్తి చూపకపోవడం దీనికి ప్రధాన కారణాలు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల పశుగ్రాసం లభ్యత తగ్గి, పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. దీనికి తోడు గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఆవులు, గేదెల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడంతో పాటు విజయ డెయిరీకి వచ్చే పాల సేకరణలో కూడా హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. ఐసీఎంఆర్ సిఫార్సుల ప్రకారం రోజువారీ వినియోగం పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఉత్పత్తిని మించి డిమాండ్ ఉండటంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో రోజుకి సుమారు 26 లక్షల లీటర్లకు పైగా పాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో పాలు కేవలం 4 లక్షల లీటర్ల వరకు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఇది రాష్ట్ర అవసరాలను తీర్చేందుకు సరిపడే స్థాయిలో లేదు. పాడిపశువుల సంఖ్య తగ్గడం వల్ల పాల ఉత్పత్తిలో గణనీయమైన కోత వచ్చింది. ఇప్పటికే పాడిరైతులు పోసే పాలు రోజుకి కేవలం 50 వేల లీటర్ల వరకు తగ్గిపోవడం ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. ఇందుకు కారణం తెలంగాణలో పశుసంపద వృద్ధి చెందకపోవడమే. గేదెలు, ఆవుల సంఖ్య తగ్గడంతో పాడి, దాని అనుబంధ ఉత్పత్తులపై ప్రభావం పడింది. 2019 సంవత్సరంతో పోలిస్తే తాజాగా జరిగిన పశుగణనలో పాలు ఇచ్చే ఆవులు, గేదెలు సంఖ్య గణనీయంగా తగ్గింది. రాష్ట్రంలో 25.82 లక్షల కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి జీవనో పాధి పొందుతున్నాయి. ఇందులో 12 లక్షల కుటుంబాలు ఆవుల పెంపకం, 10.5 లక్షల కుటుంబాలు గేదెల పెంపకం చేస్తున్నాయి. ఆవుల సంఖ్య 2019లో 42,32,383 ఉండగా, ఇప్పుడు 27.48 శాతం చొప్పున 30,69,524కు తగ్గింది. అలగే గేదెలు సంఖ్య 42,26,603 నుంచి 27.78 శాతం మేర 30,52,102కి తగ్గాయి. సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్నగర్ జిల్లాలో 45 శాతం ఆవుల సంఖ్య తగ్గింది. సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, కామారెడ్డిలో గేదెల సంఖ్య భారీగా పడిపోయింది. కాగా రాష్ట్రంలో రైతులకు ఆశించిన స్థాయిలో మద్దతు లేకపోవడం, పశువైద్య సేవలు సమర్థవంతంగా లభించడం లేదు. గోపాల మిత్ర వంటి సిబ్బంది ఉన్నప్పటికీ వారికి సకాలంలో వేతనాలు అందడం లేదు. ప్రతి ఏటా వారు జీతాల కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు చుట్టు తిరిగే పరిస్థితులు ఉన్నాయి. మరో వైపు పశువుల దాణా, మేత ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. పశు గ్రాసం పెపకం పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరోపక్క పచ్చిగడి, పశువులకు సేవలందించేందుకు కూలీల దొరకడం లేదు.

# సజ్జన్‌కుమార్ ఇంటికి వెళ్లిన బిజెపి ఎంపిలకు సమన్లు!



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తూ జైలులో మరణించిన కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్ కుమార్ ఇంటికి ముగ్గురు బీజేపీ ఎంపీలు వెళ్లారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు సజ్జన్ కుమార్ మరణం పట్ల సంతాపం తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు దీనిపై స్పందించారు. పార్టీ ఎంపీలకు సమన్లు జారీ చేశారు. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న 80 ఏళ్ల సజ్జన్ కుమార్ పలు అనారోగ్య సమస్యల కారణంగా ఆగస్ట్ 20న జైలులో మరణించారు. సజ్జన్ కుమార్ అంత్యక్రియల తర్వాత నిర్వహించిన భోగ్ కార్యక్రమానికి ముగ్గురు బీజేపీ ఎంపీలు హాజరయ్యారు. పశ్చిమ ఢిల్లీ ఎంపీ కమల్‌జీత్ సెహ్రావత్, దక్షిణ ఢిల్లీ ఎంపీ రణబీర్ సింగ్ బిధురి, వాయువ్య ఢిల్లీ ఎంపీ యోగేందర్ చందోలియా ఆయన ఇంటికి వెళ్లారు. సజ్జన్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు ఆయన మరణం పట్ల సంతాపం తెలియజేశారు. సిక్కు మతపరమైన ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. మరోవైపు ఢిల్లీకి చెందిన ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ దీనిపై విమర్శలు గుప్పించారు. అల్లర్ల కేసులో దోషిగా తేలిన వ్యక్తి పట్ల ఆ ముగ్గురు బీజేపీ ఎంపీల హృదయాలు ద్రవిస్తున్నాయని ఎక్స్ పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. అయితే ప్రతిపక్ష పార్టీల విమర్శల నేపథ్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పందించారు. ముగ్గురు బీజేపీ ఎంపీలైన రామ్‌వీర్ బిధురి, యోగేందర్ చందోలియా, కమల్‌జీత్ సెహ్రావత్‌లకు సమన్లు జారీ చేశారు. వారు అక్కడికి వెళ్లకూడదని ఆయన అన్నారు.

## వక్ఫ్ ఆస్తుల పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరచాలి : చైర్మన్ అజీజ్

**విజయవాడ, ఆగష్టు 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వక్ఫ్ఆస్తుల పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరచాలని ఈప్రక్రియను వేగవంతం చేయాలని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశించారు. శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, వక్ఫ్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా వక్ఫ్ ఆస్తుల క్షేత్రస్థాయి సమాచార సేకరణ, రికార్డుల ధృవీకరణ, డిజిటలైజేషన్ కోసం రూపొందించిన ప్రాజెక్ట్ అమానహ్ పై సమీక్షించారు. ప్రతి వక్ఫ్ ఆస్తికి ప్రత్యేక ఐడి కేటాయించాలని, ఆస్తి వివరాలు, భౌతికస్థితి, ఫోటోలు, ఆక్రమణలు, న్యాయపరమైన అంశాలు, రికార్డుల వ్యత్యాసం తదితర సమాచారాన్ని ఆధారాలతో సేకరించి ధృవీకరించిన రికార్డుగా రూపొందించటమే ఈప్రాజెక్టు ముఖ్యఉద్దేశ్యమన్నారు. ఈప్రాజెక్టును అమలు చేసే ముందు వారంరోజులపాటు పైలెట్ ప్రాజెక్టు నిర్వహించనున్నారు. అనంతరం అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని చైర్మన్ ఆదేశించారు.

## నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల దాడులు
### ఆరుగురిపై క్రిమినల్ కేసులు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** జంట నగరాలలో నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనదా రులపై ట్రాఫిక్ పోలీసుల దాడుల ప రంపర కొనసాగుతూనే వుంది. ఈ సందర్భగా నగర పరిధిలోని మైలార్‌దేవుపల్లి, సుల్తాన్‌బజార్, షా అలిబండా, బండ్లగూడ, గుడిమల్కాపూ ర్ మల్కాజిగిరి పరిధిలోని వన స్థలిపురం పోలీసు స్టేషన్లలో ఆరుగురు వ్యక్తులను ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని తప్పుడు నంబర్ ప్లేట్లతో తిరు గుతున్నందుకు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాలను జప్తు చేసి ఆయా పోలీసు స్టేషన్లకు అప్పగించా రు. నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనదారులు ఎవరు తిరగవద్దని సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డేవిస్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇలాంటి వా హనాలను జప్తు చేయడంతో పాటు వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, దీనివల్ల వారు ఎంతో నష్టపోవలసి వుంటుందని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోతారని ఆయన తెలిపారు.

# నన్ను కేబినెట్ నుంచి తప్పించే కుట్రజరుగుతోంది!

## కేంద్ర మంత్రి జువల్ ఓరమ్ బిజెపిపై ధ్వజం



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఓవైపు కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ప్రధాని మోడీ సిద్ధమవుతున్న వేళ ఆయన కేబినెట్లోనే ఉన్న ఓ మంత్రి దీనిపై బహిరంగ వ్యాఖ్యలు చేశారు. తనను కేబినెట్ నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ నేతలు ఈ మేరకు కుట్రలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇతర పార్టీల నుంచి బీజేపీ నాయకులే ఇలాంటి పనులు చేస్తున్నారని సదరు మంత్రి చేసిన ఆరోపణలు ఇప్పుడు కేబినెట్ ను కుదిపేస్తున్నాయి. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి, బీజేపీ నేత జ్యుయర్ ఓరం సొంత పార్టీ నేతలను ఉద్దేశించి శనివారం సంచలన ఆరోపణలు చేశారు. త్వరలో కేంద్ర కేబినెట్ ప్రక్షాళన కోసం ప్రధాని మోడీ ప్రయత్నాలు చేస్తున్న వేళ.. తనను కూడా తప్పించేందుకు ఇతర పార్టీల నుంచి వచ్చి పార్టీలో చేరిన నేతలు ప్రయత్నిస్తున్నారని ఓరం ఆరోపించారు. వారు తనను అప్రతిష్టపాలు చేసి, కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించేందుకు ఒక ప్రచారాన్ని మొదలుపెట్టారని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో, కొందరు వ్యక్తులు డబ్బు ఖర్చు చేసి తనను అప్రతిష్టపాలు చేయడానికి, తమ స్థానాన్ని దెబ్బతీయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి ఓరం ఆరోపించారు. అలా చేయడం ద్వారా తమకు అవకాశం దక్కుతుందని వారు భావిస్తున్నారని ఆయన తెలిపారు. తన పార్టీ గురించి తనకు బాగా తెలుసని, అలాగే తన కృషిని కూడా అది గుర్తిస్తుందని ఓరం వ్యాఖ్యానించారు. ఒడిశాలోని సుందర్‌గఢ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓరం.. తన ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన వారికి గట్టి హెచ్చరిక కూడా జారీ చేశారు. ఈ వ్యవహారంపై ఒడిశా బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీతో ఇప్పటికే చర్చించినట్లు పేర్కొన్న ఓరం వారిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. తనను అప్రతిష్టపాలు చేసేవారి చేతులను నరికే సత్తా, అలాగే వాటిని దహనం చేసే సత్తా తనకు ఉందన్నారు. జ్యుయర్ ఓరం గిరిజన ప్రాబల్యం కలిగిన సుందర్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఓరం వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ తీవ్రంగా స్పందించాయి. ఓరం వ్యాఖ్యలతో బీజేపీ రాజకీయాలు మరోసారి బయటపడ్డాయని విమర్శించాయి.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన సమావేశం

- 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై చర్చ
- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుకు బిజెపి కార్యాచరణను సిద్ధం చేసింది. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు అధ్యక్షతన పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో 22ఏ, ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు, రైతుల సమస్యలపై నేతలు చర్చించారు. సమావేశం అనంతరం బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏపై బిజెఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి రెండు రోజుల దీక్ష, 7వ తేదీన ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై బిజెవైఎం మహా ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ యాత్ర త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులందరూ సమన్వయంతో కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగ అంశాలు, రైతుల సంక్షోభంపై దృష్టి సారించామని, రానున్న రోజుల్లో విద్యార్థులు, రైతుల సమస్యలపై దశలవారీగా చేపట్టాల్సిన ప్రజా పోరాటాలపై పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. చేవెళ్ల పరిధిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా వికారాబాద్, తాండూర్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను పరిశీలించనున్నట్టు వివరించారు. చేవెళ్ల నియోజకవర్గంలో 90 శాతానికిపైగా రోడ్లను కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్. గౌతం రావు, తుళ్ల వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగువారందరిపై ఉంది



గిడుగు రామ్మూర్తిపంతులు ముదిమనువడు, ముది మనవరాలుని సత్కరిస్తున్న దృశ్యం

**విజయవాడ, ఆగష్టు 29, ప్రభాతవార్త :** తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రపంచంలోని తెలుగువారందరిపై ఉందని గిడుగు రామ్మూర్తిపంతులు ముది మనువడు గిడుగు నాగేశ్వరావు పిలుపునిచ్చారు. గిడుగు రామ్మూర్తిపంతులు జయంతి సందర్భంగా శనివారం విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈకార్యక్రమానికి గిడుగు రామ్మూర్తి పంతులు ముదిమనువడు గిడుగు నాగేశ్వరావు, ముది మనువరాలు గిడుగు సరస్వతి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు తెలుగుభాషను కాపాడుకోవాల్సి ఉందన్నారు. సవరభాషకు లిపిలేదని, రామ్మూర్తిపంతులు సవరభాషను నేర్చుకుని ప్రత్యేకంగా పదభాషను తయారు చేసి ఎన్నో పుస్తకాలు రచించారని తెలిపారు. సొంతనిధులతో సవరభాషకు ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేసి వాటిలో ఉపాధ్యాయులను నియమించి విద్యనేర్పించనందుకు ఆంగ్లేయులు 1934లో కైజర్ ది హిండ్ అనే బిరుదుతో సత్కరించారని చెప్పారు. 1938లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారని గుర్తుచేసారు. సరస్వతి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్దులను తెలుగులో మాట్లాడేటట్లు ప్రోత్సహించటంతోపాటు, తెలుగు పుస్తకాలు చదివించాలని సూచించారు. ఈసందర్భంగా నాగేశ్వరావు, సరస్వతి, మల్లెతీగ పత్రిక ఎడిటర్ కలిమిశ్రీలను సత్కరించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది, పోటీపరీక్షలకు హాజరయ్యే విద్యార్దులు పాల్గొన్నారు.

# గ్లేసియర్ కూలుతున్న దృశ్యాలు చైనా టూరిస్టు కెమెరాకు చిక్కాయి




గ్లేసియర్ కూలుతున్న దృశ్యం

**ఖాట్మాండు, ఆగస్టు 29:** టిబెట్ సరిహద్దులో ఉన్న గిరాంగ్ కౌంటీతోపాటు నేపాల్‌లో వరదలు విలయం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే చైనాలోని జిజాంగ్ అటోనమస్ ప్రాంతంలో ఉన్న పర్వతాలను ఓ పర్యాకుడు తన కెమెరాతో షూట్ చేస్తున్న సమయంలో యాదృచ్ఛికంగా మంచుకొండ కూలిన దృశానయలు చిక్కాయి. అయితే ఆ దృశ్యాల్లో ఉన్నది.. ప్రస్తుతం నేపాల్‌లో విలయానికి కారణమైన ప్రాంతమేనని చైనా అంచనా వేసింది. హై ఆల్టిట్యూడ్‌లో ఉన్న గ్లేసియర్ కూలిపోవడం వల్లే భీకరమైన బురదతో కూడిన వరద గిరాంగ్ పోర్టును తుడిచిపెట్టేసిందని చైనా పేర్కొన్నది. చైనాలోని జినువా న్యూస్ రిపోర్టు ప్రకారం.. వీడియోలో ఉన్న లోకేషన్, రిమోట్ సెన్సింగ్ ఇమేజ్‌లు రిలీజ్ చేసిన ప్రాంతాలు ఒక్కటిగా ఉన్నట్లు చైనీస్ ఎన్విరాన్‌మెంట్ అకాడమీ డైరెక్టర్ కాంగ్ సిచాంగ్ తెలిపారు. అయితే నేపాల్ వైపున్న మంచుకొండ కుప్పకూలినట్లు ఫుటేజ్ ద్వారా స్పష్టం అవుతున్నట్లు చైనీస్ మీడియా పేర్కొన్నది. మంచుకొండ కూలి,సరస్సులో పడడం, ఆ తర్వాత రాళ్లు, బురద ప్రవాహం.. జల ప్రళయాన్ని సృష్టించినట్లు చైనా మీడియా తమ రిపోర్టులో వెల్లడించింది. కొండచరియ విరిగిపడడం వల్ల భారీ స్థాయిలో మంచు ఫలకం, రాళ్లు, బురద.. కొండ లోయల్లో.. ఓ శక్తివంతమైన ప్రవాహంలా మారింది. అది చైనా బోర్డర్‌లోని గిరాంగ్ పోర్టును ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అయితే సుమారు 5,140 మీటర్ల ఎత్తులో ఉన్న మంచుకొండ కూలినట్లు చైనీస్ మీడియాల తెలిపారు. సుమారు 6,200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక ఆ మంచు, రాళ్లు, బురద సుమారు 20 కిమీ దిగువకు ప్రవహించి, సముద్ర మట్టానికి 3,300 మీటర్ల ఎత్తులో ఉన్న గిరాంగ్ పోర్టును నేలమట్టం చేసినట్లు చైనా మీడియా పేర్కొన్నది. అయితే ఈ ప్రక్రియ మొత్తం కేవలం ఏడు నిమిషాల్లోనే ముగిసినట్లు ఆ కథనంలో తెలిపారు.

# అప్పటికప్పుడు చేసుకునే పచ్చళ్లు



## బీట్ రూట్‌తో..

బీట్‌రూట్-ఒకటి, ఉప్పు- తగినంత, కారం-అరకప్పు, ఆవపిండి- పావుకప్పు, నిమ్మరసం-ఆరుచెంచాలు, పసుపూ, నూనె-కప్పు, ఆవాలు-అరచెంచా, ఎండుమిర్చి-రెండు.

**తయారీ :** బీట్‌రూట్‌ని చిన్నముక్కలుగా తరిగి అందులో నిమ్మరసం కలిపి పక్కనపెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చీ వేయించి పొయ్యి కట్టేయాలి. అందులోనే తగినంత ఉప్పు, కారం, ఆవపిండీ వేసి నిమిషం అయ్యాక ఈ తాలింపునంతా బీట్‌రూట్ ముక్కలకు కలిపితే చాలు.

## క్యాబేజీతో..

క్యాబేజీ-చిన్న ముక్క, ఉప్పు-తగినంత, కారం-నాలు చెంచాలు, వెనిగర్-రెండు చెంచాలు, ఆవపిండి-మూడు చెంచాలు, ఆవాలు-అరచెంచా, ఎండుమిర్చీ-నాలుగు, వెల్లుల్లి రెబ్బలు-రెండు, పల్లీనూనె-కప్పు.



**తయారీ :** క్యాబేజీని సన్నగా తరిగి వెనిగర్ కలిపి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో ఉప్పు, కారం, నూనె, ఆవపిండి కలపాలి. ఇందులో వెల్లుల్లి తరుగు వేయాలి. వెనిగర్‌లో క్యాబేజీ వూరిన తర్వాత ఇందులో కలపాలి. దీనిపై ఆవాలూ, ఎండుమిరినచతో తాలింపు వేస్తే ఆ వేడికి క్యాబేజీ బాగా మగ్గి మంచి రుచి వస్తుంది. ఇష్టమైన ఆరు పల్లీలు కూడా వేసుకోవచ్చు.

## దొండ కాయతో...

దొండకాయలు-ఎనిమిది, ఉప్పు రెండు చెంచాలు, కారం-నాలుగు చెంచాలు, ఆవపిండి-రెండు చెంచాలు, పల్లీనూనె-పావుకప్పు, నిమ్మరసం నాలుగు చెంచాలు, పసుపూ-పావుచెంచా, ఆవాలు-అరచెంచాఎండు మిర్చి-రెండు, మెంతిపిండి-పావు చెంచా.



**తయారీ :** దొండకాయలను చిన్న ముక్కలుగా తరిగి పసుపూ, నిమ్మరసం పట్టించి పక్కన పెట్టుకోవాలి. ఓ గిన్నెలో తగినంత ఉప్పు, కారం, ఆవపిండీ, మెంతుపిండీ, ముప్పావువంతు నూనె వేసి అన్నింటినీ బాగా కలిపి పెట్టుకోవాలి. ఇందులో దొండకాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇప్పుడు మిగిలిన నూనెను వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చి వేయించి పచ్చడిపై వెయ్యాలి. ఇష్టమైన వాళ్ల ఆ తాలింపులో వెల్లుల్లీ వేసుకోవచ్చు.

## కూరగాయలతో..

క్యారెట్, క్యాప్సికం, ఉల్లిపాయ-ఒక్కోటి చొప్పున, క్యాబేజీ తరుగు-రెండు పెద్ద చెంచాలు, పచ్చిమిర్చి-ఐదు, వెల్లుల్లి తరుగు-పెద్ద చెంచా, ఆవనూనె-పావుకప్పు, ఉప్పు-తగినంత, ఆవపిండి-రెండు చెంచాలు, ఎండు మిర్చి-మూడు, నిమ్మ కాయ-ఒకటి, ఆవాలు- చెంచా.



**తయారీ :** క్యారెట్, క్యాప్సికం, ఉల్లిపాయని సన్నగా తరిగి ఈ ముక్కలకు క్యాబేజీ కూడా కలపాలి. వీటిపై ఆవపిండీ, తగినంత ఉప్పు వేసి మరోసారి కలపాలి. తరవాత నిలువుగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చీ. వెల్లుల్లి ముక్కలు వేయించి.. ఈ కూరముక్కలపై వేయాలి. చివరగా నిమ్మరసం కలిపితే చాలు. ఇందులో పచ్చిమిర్చి వేస్తాం కాబట్టి కారం అవసరంలేదు.

## క్యాలీఫ్లవర్‌తో..

క్యాలీఫ్లవర్ పువ్వులు-కప్పు, ఉప్పు-తగినంత, కారం-నాలుగు చెంచాలు, ఆవపిండి-చెంచా, నిమ్మరసం రెండు చెంచాలు, నువ్వుల నూనె-అరగ్లాసు, మెంతి పిండి-చెంచా, ఇంగువ. పసుపు-చిటికెడు చొప్పున.



**తయారీ :** ఒక పాత్రలో కానయలీఫ్లవర్ పువ్వులుతప్ప మిగిలిన పదార్థాలన్నీ తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. తరవాత కడిగి తడి పూర్తిగా ఆరిన క్యాలీఫ్లవర్ పువ్వులు వేయాలి. ఇందులో ఇంగువ ఉంటుందికాబట్టి. అదనంగా తాలింపు వేయాల్సి న అవసరం లేదు. □

## సేవలో మహిళలు ముందు !

విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు సేవ చేయడానికి ముం దుం డేది ఆడవాళ్లే. సామాజిక కార్యకర్తలుగా, హెల్త్‌కేర్ వర్కర్లుగా పనిచేసే వాళ్లలో 70 శాతం మంది మహిళలూ, అమ్మాయి లేనట. అయితే, 50 శాతం మహిళలకు కృషికి తగ్గ గుర్తింపు, ఫలితం అందడం లేదట. ఏది ఏమైనా..అమ్మ ప్రేమను కుటుంబానికే కాదు, సమాజానికి అందించడంలోనూ మనకు మనమే సాటి! □



# సొగసుల రోజా !

**సౌందర్య పరిరక్షణలోనూ గులాబీల పాత్ర ఎంతో ఉందంటు న్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందామా?**



నల్లటి వలయాలు దూరం... కళ్ల కింద వలయాల సమస్యకు చెక్ పెట్టడానికి గులాబీలను ఉపయోగించవచ్చు. కొద్దిగా రోజ్ వాటర్‌ని తీసుకొని అందులో కాటన్‌ను ముంచి కళ్లకింద మృదువుగా మర్దన చేయాలి. ఇలా కనీసం రెండు రోజులకోసారి చేస్తే ఫలితం ఉంటుంది. గులాబీ రేకల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటను తగ్గిస్తాయి.

**క్లెన్సర్‌గానూ :..** గులాబీ మంచి క్లెన్సర్‌గా కూడా పని చేస్తుంది. రోజ్‌వాటర్ మన ముఖంపై ఉన్న జిడ్డుని, పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా మార్చుతుంది. అంతేకాదు.. గులాబీ రేకల్లోని సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయి. అందుకే స్నానం చేసే నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా కొన్ని గులాబీ రేకలను వేసుకుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుంది. విటమిన్ 'సి' పుష్కలం... గులాబీల్లో విటమిన్ 'సి' శాతం ఎక్కువ. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేసి అతినీల లోహిత కిరణాల నుంచి రక్షణ కల్పిస్తుంది. అందుకే ఎండలోకి వెళ్లేముందు రోజ్‌వాటర్ అప్లై చేసుకొని వెళ్లడం మంచి దంటున్నారు నిపుణులు. అంతేకాదు. గులాబీ ట్యాన్‌ని కూడా తొలగిస్తుంది. దీనికోసం కీరా దోస, గులాబీ, గ్లిజరిన్‌లు కలిపిన ప్యాక్‌ని వేసుకుంటే ఫలితం ఉంటుంది.



**జుట్టు ఆరోగ్యానికి ...** గులాబీల్లో ఉండే సహజ సిద్ధమైన కండిషనింగ్ గుణాలు జుట్టును పట్టుకుచ్చులా మెరిసేలా చేస్తాయి. దీనికోసం మీరు వాడే షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్క రోజ్ వాటర్ కలుపుకొంటే సరి లేదా గులాబీ రేకల పేస్ట్‌ను జుట్టుకు, కుదుళ్లకు పట్టించి కాసేపయ్యాక తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. □

# నాగమ్మా.. కొలిచేమమ్మా !

**అగ్ని పురాణం, స్కంద పురాణం, నారద పురాణం మహాభారతం వంటి భారతీయ గ్రంథాలు పాములను ఆరాధించే క్రతువును పాముల చరిత్ర వివరాలను తెలియజేస్తాయి.** మహా భారత ఇతిహాసంలో, కురు వంశానికి చెందిన పరీక్షిత మహారాజు కుమారుడు జనమేజయుడు, తక్షకుడు అనే పాము కాటుతో తన తండ్రి మరణించినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి సర్ప సత్రం యాగం చేస్తున్నాడు. ఒక బలి కొరివి ప్రత్యేకంగా నిర్మించబడింది మరియు ప్రపంచంలోని అన్ని పాములను చంపడానికి అగ్ని యాగం నేర్చుకున్న నబ్రాహ్మణ ఋషుల గెలాక్సీ ద్వారా ప్రారంభించ బడింది. జనమేజయుని సమక్షంలో చేసిన యాగం చాలా శక్తివంత మైనది, ఇది అన్ని పాములను యజ్ఞకుండలో పడేలా చేస్తుంది. పరీక్షితుడిని కాటువేసి చంపిన తక్షకుడు మాత్రమే తన రక్షణ కోరుతూ ఇంద్రలోకానికి పారిపోయాడని పురోహితులు గుర్తించి నప్పుడు, ఋషులు తక్షకుడిని మరియు ఇంద్రుడిని కూడా యజ్ఞ అగ్నికి లాగడానికి మంత్రాలు పఠించే వేగాన్ని పెంచారు. తక్షకుడు ఇంద్రుని మంచం చుట్టూ చుట్టుకున్నాడు, అయితే యజ్ఞ యొక్క బలం చాలా శక్తివంతమైనది. తక్షకుడితో పాటు ఇంద్రుడు కూడా అగ్ని వైపుకు లాగబడ్డాడు. ఇది దేవుళ్ళను భయపెట్టింది, అప్పుడు మానసాదేవి జోక్య చేసుకుని సంక్షోభాన్ని పరిష్కరించమని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆమె తన కొడుకు ఆస్తికను యజ్ఞ జరిగే ప్రదేశానికి వెళ్లి సర్ప సత్ర యజ్ఞాన్ని ఆపమని జనమేజయుడిని కోరింది. ఆస్తికుడు జనమేజయుడిని అన్ని శాస్త్రాల జ్ఞానంతో ఆకట్టుకున్నాడు, ఆ సమయంలోనే ఆస్తికుడు జనమేజయుడిని అన్ని శాస్త్రాల జ్ఞానంతో ఆకట్టుకున్నాడు. అతను అతనికి వరం కోరడానికి అనుమతించాడు. ఆ సమయం లోనే ఆస్తికుడు సర్ప సత్రాన్ని ఆపమని జనమేజేయుడిని అభ్యర్థిం చాడు. రాజు బ్రాహ్మణుడికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. యజ్ఞ చేస్తున్న ఋషులచే రక్షించబడి నప్పటికీ అతను పశ్చాత్తాపం చెందాడు. అప్పుడు యజ్ఞ నిలిపివేయశాడు. రోజు ఇంద్రదు కూడా మానసాదేవి వద్దకు వెళ్లి పూజించాడు. గరుడ పురాణం ప్రకారం, ఈ రోజున పాములకు పూజలు చేయడం శుభప్రదం ఒకరి జీవితంలో శుభవార్తలను అందిస్తుంది. దీన్ని అనుసరించి బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. నాగపంచమి రోజున, నాగుపాము, పాములను పాలు, మిఠాయిలు, పువ్వులు, దీపాలతో పూజించడమే కాకుండా నైవేద్యాలతో పూజిస్తారు. వెండి, రాయి, చెక్క లేదా గోడపై చిత్రించిన నాగ లేదా సర్ప దేవతలను



మొదట నీటితో పాలతో స్నానం చేసి, తరువాత **'నాగ ప్రీతా భవంతి శాంతిమాప్నోతి బిల విభోధ్ సశాంతి లోక్ మా సాధ్య సత్య సత్యే' ' నాగ్ ప్రీతా భవని శాంతిమాప్నోతి బియా విభోః స శాంతి లోకా మా సాధ్యా మోదతే షష్ఠితః సుమః'** అనే మంత్రాలను పఠిస్తూ పూజిస్తారు. □

# తెర

## మహేంద్రగిరి వారాహి : ట్రైలర్ విడుదల



మహేంద్రగిరి వారాహి పై నాకు చాలా నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని సెప్టెంబర్ 11న థియేటర్లలో చూస్తారు: హీరో సుమంత్‌సుమంత్, సిద్దు జొన్నలగడ్డ, సంతోష్ జాగర్ల పూడి, లక్ష్మణ్, కలిపు మధు, రాజ శ్యామల ఎంటర్‌టైన్ మెంట్స్ బ్రిడ్జ్ ఫిల్మ్స్ 'మహేంద్రగిరి వారాహి' ట్రైలర్ లాంచ్'మహేంద్రగిరి వరాహి' ట్రైలర్ లో సర్‌ప్రైజ్ చేసిన స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ హీరో సుమంత్ విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చు కున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఆధ్యాత్మిక మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' మహేంద్రగిరి పర్వతాల నేపథ్యంతో, వారాహి మాత దైవశక్తి చుట్టూ అల్లుకున్న ఆసక్తికరమైన కథతో రూపొందుతోంది. సంతోష్ జగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లా డుతూ.. అనూప్ మ్యూజిక్‌కి నేను ఫ్యాన్‌ని. లక్ష్మణ్ గారు ఎక్కడుంటే అక్కడ డబ్బు ఉంటుంది. ఆయనది లక్కీ హ్యాండ్. ఈ సినిమా కూడా సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను. హీరో సుమంత్ మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. మా టీజర్ ఇప్పటికే చాలా వైరల్ అయిం ది. దానికంటే పది రెట్లు ఈ ట్రైలర్ మా సినిమాని ముం దుకు తీసుకెళ్తుందని ఆశిస్తు న్నాను. డైరెక్టర్ సంతోష్ మాట్లా డుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన వెంకీ అట్లూరి గారికి థాంక్యూ. ఆయన చేతుల మీదుగా ట్రైలర్ లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. మేమం దరం ఒక టీమ్ వర్క్‌లా చేశాం. మాకు ఈ అవకాశం ఇచ్చిన మా నిర్మాతలకు కృతజ్ఞతలు. నిర్మాత మధు మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన వెంకీ అట్లూరికి థాంక్యూ సో మచ్. ట్రైలర్ చూసిన తర్వాత మాకు మరింత గొప్ప విశ్వాసం కలిగింది. సెప్టెంబర్ 11న సినిమా రిలీజ్ అవుతుంది.

## 'కింగ్ 100' డిసెంబర్ 24న గ్రాండ్ రిలీజ్

కింగ్ నాగార్జున మైల్ స్టోన్ 100వ చిత్రం కింగ్ 100, అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మాణంలో, రా కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుం టోంది. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా పవర్‌ఫుల్ టైటిల్ గ్లింప్స్ ను విడుదల చేశారు. నాగార్జున వాయిస్‌ఓవర్‌తో ప్రారంభమయ్యే గ్లింప్స్ లో సమాజం మనుషులను వారి సంపద ఆధారంగా ఎలా విభజిస్తుందనే అంశాన్ని ఆసక్తికరంగా ప్రస్తావిం చారు. తన దగ్గర ఏమీ లేనప్పుడు తనను 'లూజర్' అని పిలిచారని, అదే సంపద సంపాదించిన తర్వాత 'ది కింగ్' అని పిలుస్తున్నారని నాగార్జున చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. నాగార్జున మైల్‌స్టోన్ 100వ సినిమాకు 'కింగ్ 100' అనే టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంది. నాగార్జున తన స్టార్‌డమ్‌కు తగ్గట్టుగా పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను ఎంచుకున్నా రని గ్లింప్స్ చూస్తుంటే అర్థమౌ తోంది. నాగార్జు నను అత్యంత స్టైలిష్, డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, స్టైల్, యాటిట్యూడ్ ఆకట్టుకున్నాయి. నిజమైన సూపం స్టార్‌కు ఉండే రాయల్ స్వాగ్‌తో నాగార్జున కనిపిం చారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతోం దనే ఆసక్తిని గ్లింప్స్ మరింత పెంచింది. డైరెక్టర్ రా కార్తీక్ స్టోరీ తెల్లింగ్ కూడా ఫ్రెష్‌గా, ఇంట్రెస్టింగ్‌గా ఉంది. గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్, రిచ్ విజువల్స్ గ్లింప్స్ ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళాయి. 'కింగ్ 100' టైటిల్ గ్లింప్స్ మజెస్టిక్‌గా, మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. నాగార్జున పవర్‌ఫుల్ అవతార్, ఆసక్తికర మైన కథాంశం, గ్రాండ్ విజువల్స్, హైఎనర్జీ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. అక్కినేని అభిమానులు, ప్రేక్షకులను ఈ గ్లింప్స్ అలరించింది.



## రవితేజ క్రేజీ కాంబినేషన్‌లో కొత్త సినిమా



'ఇరుముడి'తో అద్భుతమైన విజ యాన్ని అందు కున్న మాస్ మహా రాజా రవితేజ మరో ఆసక్తికర మైన ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతు న్నారు. సరిపోదా శనివారం తో బ్లాక్‌బస్టర్ అందుకున్న ట్యాలెంటెడ్ ఫిల్మ్‌మేకర్ వివేక్ ఆత్రేయతో రవితేజ జతకట్టను న్నారు .'ఇరుముడి' బాక్సా ఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సాధిస్తూ, రికార్డు స్థాయి వసూళ్లతో దూసు కెళ్తోంది. ఈ చారిత్రాత్మక విజ యాన్ని పురస్కరించుకుని నిర్వ హించిన ప్రత్యేక వేడుకలో దర్శకుడు వివేక్ ఆత్రేయ, నిర్మాత లు లక్ష్మణ్, శ్రీని.. రవితేజను కలిసి బ్లాక్‌బస్టర్ విజయానికి అభినందనలు తెలిపారు. రవితేజ, వివేక్ ఆత్రేయ, లక్ష్మణ్, శ్రీని, బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ కొత్త చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. రవితేజ, వివేక్ ఆత్రేయ కలయికలో రాబోతున్న ఈ సినిమా ప్రత్యేకమైన కాంబినేషన్‌గా నిలవనుంది. వివేక్ ఆత్రేయ తనదైన ట్రీట్‌మెంట్‌తో రూపొందించే ప్రపంచంలోకి రవితేజ అడుగుపెట్టడం ద్వారా సరికొత్త సినీ అనుభూతి అందించనున్నారు. రవితేజ ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్, లార్జర్‌దేన్‌లైఫ్ పర్సనాలిటీకి వివేక్ ఆత్రేయ స్టైల్ ప్రత్యేకంగా నిలవనుంది. దర్శకుడు హాసిత్ గోలితో రవితేజ చేయనున్న సినిమా పూర్తయిన తర్వాత ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

## మీడియా పతాకాలు నిర్మిస్తున్న సినిమాలో ఫోక్ స్టార్ కిట్టు పవన్



తెలంగాణా మట్టి వాసనలతో సంచలనమైన జానపద పాటలతో వందల మిలియన్ల వ్యూస్ సాధించి ప్రేక్షకు లకు దగ్గరైన కిట్టు హీరోగా శనివారం రోజున సినిమా ప్రారంభమైంది. యం.యస్ వారాహి క్రియేషన్స్ , శివమ్ మీడియా పతాకంపై ప్రొడక్షన్ నం 3గా ముని శివ, శివమల్లాలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు దిలీప్ సాయి నాయక్. మాదాపూర్ శివమ్ మీడియా కార్యాలయం లో చిత్రం వై వంగా ప్రారంభ మైంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ , దర్శకుడు ఆర్.పి పట్నాయక్, నేషనల్ అవార్డు విన్నర్ సతీష్ వేగేశ్న, బిగ్ టీవి చైర్మెన్ విజయ్ వెన్నం పాల్గొన్నారు. దర్శకుడు దిలీప్‌కి స్క్రిప్ట్‌ని సతీష్ వేగేశ్న, బుల్లెట్‌బండి లక్ష్మణ్ అందించగా హీరో కిట్టుపై చంద్రబోస్ క్లాప్ నిచ్చారు. ఆర్ పి పట్నాయక్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా బిగ్ టీవి విజయ్ కెమెరా స్విచాన్ చేసి టీమ్‌కి అభినందనలు తెలిపారు. చంద్రబోస్ మాట్లాడుతూ- ఈ టీమ్ గురించి నాకు చాలా బాగా తెలుసు. టీమంతా ఎంతో టాలెంట్ ఉన్నవారు. నిర్మాతలు ముని శివ, శివమల్లాలల, బుల్లెట్‌బండి లక్ష్మణ్, సంగీత దర్శకుడు మదిన్ నాకు ఎంతో ఆత్మీయులు. వారందరూ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సతీష్ వేగేశ్న మాట్లాడుతూ- మంచికథతో వచ్చిన దర్శకుడు దిలీప్‌కి మా శివలిద్దరూ ఎంతో సపోర్ట్ చేస్తున్నారు. వీరందరికి పెద్ద విజయం రావాలని కోరుకుంటున్నా అన్నారు. ఆర్‌పి పట్నాయక్ మాట్లాడుతూ ఈ నిర్మాతలిద్దరూ మంచి సినిమాలు చేసి పెద్ద నిర్మాతలుగా మారి పదులకొద్ది సినిమాలు తీయాలని కోరుకుంటున్నా అన్నారు. హీరో కిట్టు మాట్లాడుతూ- నేను చాలా చిన్న నటునిగా ఫోక్ సాంగ్స్ చేసేవాడిని. అలాంటిది నేను చేస్తున్న ఈ సినిమాకి ఇంత పెద్దవాళ్లు వచ్చి సపోర్టు చేయటం ఎంతో ఆనందంగా ఉంది అన్నారు



## 'ధర్మస్థల నియోజకవర్గం' ట్రైలర్ లాంచ్

సెప్టెంబర్ 4న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న 'ధర్మస్థల నియోజ కవర్గం' సినిమా మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయి కుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం ధర్మస్థల నియోజకవర్గం. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం.. సెప్టెంబర్ 4న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఆర్ట్ డైరెక్టర్ భార్గవాచారి నౌండ్ల మాట్లాడుతూ ధర్మస్థల నియోజ కవర్గం చాలా మంచి మూవీ. సెప్టెంబర్ 4న రిలీజ్ కు వస్తోంది. థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మహావీర్ ఏలేందర్ మాట్లాడుతూ ఈ సినిమాకు మంచి సాంగ్స్ చేసే అవకాశం కలిగింది. మొత్తం ఐదు పాటలు ఉంటాయి. పాటలన్నీ మా గురువు చంద్రబోస్ రాశారు. ప్రొడ్యూసర్ మేరుం భాస్కర్ మాట్లాడుతూ మా మూవీని ఎంతో క్లారిటీతో రూపొందిం చారు దర్శకుడు జై జ్ఞాన ప్రభ. 45 రోజుల్లో మొత్తం షూటింగ్ చేయాలని ప్లాన్ చేసుకున్నాం. అనుకున్నట్లుగా 45 రోజుల్లోనే మొత్తం ప్యాచ్ వర్క్ తో సహా షూటింగ్ కంప్లీట్ చేశారు. యాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ సినిమాను ప్యాషన్ తో నిర్మించే బ్యానర్ ఇది. ఇలాంటి బ్యానర్స్ బాగుంటే అందరూ బాగుంటాయి. ఈ చిత్రంలో ఒక బ్యూటిఫుల్ రోల్ చేశాను. డైరెక్టర్ కొత్త వారైనా ఎవరికీ అలా అనిపించలేదు. చాలా క్లారిటీతో సినిమాను రూపొందిం చారు. అన్నారు.

## బిల్లా రంగా బాషా: ది ఫస్ట్ బ్లడ్ ప్రమోషనల్



సూపర్‌స్టార్ బాద్‌షా కిచ్చా సుదీప్ ప్రతిష్టాత్మక పీరియడ్‌యాక్షన్ స్పెక్టకిల్ బిల్లా రంగా బాషా: ది ఫస్ట్ బ్లడ్ థియేట్రికల్ రిలీజ్ దిశగా యూనిక్ ప్లానింగ్‌తో ముందుకు సాగుతోంది. అనూప్ భండారి దర్శకత్వం వహిస్తున్న ఈ హైబడ్జెట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ వినూత్న మైన ప్రమోషనల్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ఈ ప్రమోషనల్ క్యాంపెయిన్ 2026 సెప్టెంబర్ 2 నుంచి 2027 చివరి క్వార్టర్లో సినిమా విడుదలయ్యే వరకు కొనసాగనుంది. సుదీప్ పుట్టినరోజు అయిన సెప్టెంబర్ 2, 2026న ఈ ప్రచార కార్యక్రమం అధికారికంగా ప్రారంభ మవుతుంది. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించ నున్నారు. తాజాగా విడుదల చేసిన అనౌన్స్ మెంట్ పోస్టర్ మంచుతో నిండిన ల్యాండ్‌స్కేప్స్, ఎత్తైన మంచు నిర్మాణాలతో ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ఈ అనౌన్స్‌మెంట్‌లో ముఖ్యంగా ఆకట్టుకునే అంశం మేకర్స్ రూపొందించిన లాంగ్‌టర్మ్ ప్రమోషనల్ స్ట్రాటజీ. 2027 తొలి క్వార్టర్లో టీజర్ విడుదల చేయనున్నారు. అనంతరం 2027 మూడో క్వార్టర్లో భారీ ప్రమోషనల్ ఫేజ్‌ను ప్రారంభించి, ట్రైలర్, పాటలను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత 2027 చివరి క్వార్టర్లో సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నారు. చాలా ముందుగానే రూపొందించిన ఈ ప్రమోషనల్ టైమ్‌లైన్ బిల్లా రంగా బాష్యాకు ప్రత్యేకమైన ప్రమోషనల్ విధానాన్ని అందిస్తోంది. ఎక్కువ కాలం పాటు ప్రేక్షకుల్లో ఆసక్తిని క్రమంగా పెంచేలా మేకర్స్ ఈ ప్లాన్‌ను రూపొందించారు. విజయవంతమైనవిక్రాంత్ రోణా తర్వాత సుదీప్, అనూప్ భండారి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం బిల్లా రంగా బాషా. దర్శకుడు మరోసారి విస్తృతమైన సినిమాటిక్ యూనివర్స్‌ను క్రియేట్ చేస్తున్నారు. సుదీప్ ఈ పీరియడ్‌యాక్షన్ అడ్వెంచర్‌లో లార్జర్‌దేన్‌లైఫ్ పాత్రలో నటిస్తున్నారు.

ఆట



## మాంటెర్రే ఓపెన్‌లో బార్టుంకోవాపై మెర్టెన్స్ విజయం

**మెక్సికో:** బార్టుంకోవాపై విజయం సాధించిన మెర్టెన్స్, మాంటెర్రే ఓపెన్ ఫైనల్‌లో ప్యారీ సరసన చేరింది. ఈ టోర్నీలో బెల్జియంకు చెందిన రెండో సీడ్ ఎలిస్ మెర్టెన్స్ ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని చెక్ క్రీడాకారిణి నికోలా బార్టుంకోవాను 1-6, 6-4, 6-2 తేడాతో ఓడించి, డయాన్ ప్యారీతో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. 23 ఏళ్ల ఫ్రెంచ్ క్రీడాకారిణి ప్యారీ, అంతకుముందు జరిగిన మొదటి సెమీఫైనల్‌లో అమెరికన్ ఐదవ సీడ్ ఆన్ లీని రెండు గంటల మూడు నిమిషాల పోరులో 7-6(7) 6-4 తేడాతో ఓడించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. రెండవ సెమీఫైనల్‌లో, బార్టుంకోవా అద్భుతమైన ఆరంభం చేసింది. తొలి గేమ్‌లోనే మెర్టెన్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, 4-1 ఆధిక్యంతో దూసుకుపోయింది. ఆ 20 ఏళ్ల క్రీడాకారిణి రెండోసారి కూడా సర్వీస్‌ను బ్రేక్ చేసి, మెర్టెన్స్‌కు తిరిగి పుంజుకునే అవకాశం ఏమాత్రం ఇవ్వలేదు. చివరి గేమ్‌లో మూడోసారి సర్వీస్‌ను బ్రేక్ చేసి, సెట్‌ను 6-1తో కైవసం చేసుకుంది. తొలి సెట్‌లో వెనుకబడిన తర్వాత, మెర్టెన్స్ రెండో సెట్‌లో 3-0తో వెనుకబడినప్పటికీ పుంజుకుంది. వరుసగా మూడు రిటర్న్ గేమ్‌లలో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, చివరి ఏడు గేమ్‌లలో ఆరింటిని గెలుచుకొని, సెట్‌ను 6-4తో కైవసం చేసుకుని స్కోరును సమం చేశాడు. మెర్టెన్స్ ఆ ఊపును నిర్ణయాత్మక సెట్‌లోకి కొనసాగించి చివరకు 6-2 తేడాతో సెట్‌ను కైవసం చేసుకుంది.




## ఆసియా క్రీడలకు నీరజ్ దూరం

**న్యూఢిల్లీ:** భారతదేశానికి రెండుసార్లు ఒలింపిక్ పతకం అందించిన నీరజ్ చోప్రా, చీలమండకు గాయం కావడంతో రాబోయే 2026 ఆసియా క్రీడలకు దూరమవ్వనున్నాడు. గత వారం లౌసాన్ డైమండ్ లీగ్‌లో సీజన్‌లోనే అత్యుత్తమంగా 88.05 మీటర్ల త్రో నమోదు చేసి రెండో స్థానంలో నిలిచిన చోప్రా, శిక్షణా సెషన్‌లో గాయపడ్డాడు. తన వైద్యుడు, జట్టుతో సంప్రదించిన తర్వాత, 2026 సీజన్ నుండి పూర్తిగా వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు రెండుసార్లు ఆసియా క్రీడల ఛాంపియన్ వెల్లడించారు. ఈ సీజన్‌ను ముగించాలన్న చోప్రా నిర్ణయం వల్ల, అతను ఈ వారం ప్రారంభంలో అర్హత సాధించిన 2026 డైమండ్ లీగ్ ఫైనల్‌కు, అలాగే అర్హత సాధించే అవకాశం ఉన్న తొలి వరల్డ్ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్‌కు కూడా దూరంకానున్నాడు.

## కోల్‌కతా ఫుట్‌బాల్ లీగ్.. మోహన్ బగాన్ హ్యాట్రిక్ విక్టరీ

### 3-1 తేడాతో రైల్వే ఓటమి

**కోల్‌కత్తా:** కలకత్తా ఫుట్‌బాల్ లీగ్‌లో శనివారం నాడు రైల్వే ఎఫ్‌సిపై మోహన్ బగాన్ సూపర్ జెయింట్ విజయం సాధించి, సూపర్ సిక్స్‌లోకి ప్రవేశించడానికి మరో అడుగు వేసింది. అరగంట తర్వాత రైల్వే తరఫున ఉమేష్ మారండీ తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని అందించగా, ఎనిమిది నిమిషాల్లోనే బగాన్ తిరిగి పుంజుకుని మోహన్ బగాన్ గ్రౌండ్‌లో 3-1 తేడాతో విజయం సాధించింది. వరుసగా బాగాన్ చేస్తున్న దాడులను రైల్వే అదుపు చేయడంలో విఫలమవగా, ఐదు నిమిషాలలోపే రోబిలాల్ మండి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి మెరైనర్స్‌ను ముందుకు నడిపించాడు. ఆ తర్వాత భారత అండర్23 అంతర్జాతీయ ఆటగాడు సుహైల్ అహ్మద్ భట్ గోల్ చేయడంతో, బాగాన్ జట్టు రెండవ అర్ధభాగంలో ఆటను మలుపు తిప్పి, లీగ్‌లో నాలుగో స్థానంలో ఉన్న యునైటెడ్ ఎసిపై తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని, ఆ రోజును



చిరస్మరణీయంగా ముగించింది. ఒక మ్యాచ్ ఎక్కువగా ఆడినప్పటికీ, తొమ్మిది మ్యాచ్‌లలో 19 పాయింట్లతో ఉన్న ఈస్ట్ బెంగాల్ కంటే బాగాన్ ఒక పాయింట్ వెనుకబడి ఉంది. ఇక సెప్టెంబర్ 1న బిఎస్ఎస్ స్పోర్టింగ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది. అదే రోజు రైల్వే, కిడ్డర్‌పోర్‌తో తలపడనుంది. ఇటీవల డ్యూరాండ్ కప్ ఫైనల్‌లో రెడ్‌అండ్‌గోల్డ్ బ్రిగేడ్ చేతిలో ఓడిపోయిన బగాన్, ఈ మ్యాచ్‌లో తమ ప్రధాన జట్టులోని పలువురు ఆటగాళ్లను బరిలోకి దింపింది. విరామం తర్వాత వెంటనే మన్వీర్ సింగ్ గోల్ చేయడంతో స్కోరు 11తో సమమైంది.




## టీమిండియాకు శ్రీలంక ఎఫెక్ట్

### కివిస్‌తో సిరీస్‌కు ఐదుగురు ఔట్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్న టీమిండియా, ఇప్పుడు రాబోయే న్యూజిలాండ్ పర్యటనపై దృష్టి సారించింది. నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో తొలి టెస్ట్, అలాగే నవంబర్ 27న క్రైస్ట్ చర్చ్‌లో రెండో మ్యాచ్ జరగనుంది. న్యూజిలాండ్ పరిస్థితులు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటీసీ) భారత జట్టులో కీలక మార్పులు జరిగే అవకాశం ఉన్నాయి.

శ్రీలంక సిరీస్‌లో ఆడిన ఐదుగురు ఆటగాళ్లపై సెలెక్టర్లు పునరాలోన చేస్తున్నారు. భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇటీవల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. లంక రెండు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ కేవలం 139 పరుగులు మాత్రమే చేశాడు. అందులో 34.75 సగటు మాత్రమే ఉంది. న్యూజిలాండ్‌లో బంతి స్వింగ్ అయ్యే పరిస్థితులు ఉండటంతో ఫుట్‌వర్క్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ఓపెనింగ్ కాంబినేషన్‌లో మార్పులు జరగాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. దీంతో జైస్వాల్ స్థానంలో సాయి సుదర్శన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది.

అప్పుడు కె.ఎల్. రాహుల్‌తో సుదర్శన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నారు. ఇక లంకలో కుల్దీప్ యాదవ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 25 ఓవర్లలో 103 పరుగులు ఇచ్చి ఒకే వికెట్ మాత్రమే తీశాడు. దీంతో అతన్ని పక్కన పెట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా న్యూజిలాండ్‌లో పరిస్థితులు స్పిన్నర్ల కంటే పేసర్లకి ఎక్కువగా అనుకూలించే విధంగా ఉండటంతో ఎక్కువ మంది స్పిన్నర్లతో వెళ్లాల్సిన అవసరం ఉండదు. సాయి సుదర్శన్ స్థానంలో లంక టూర్‌లో సర్ఫరాజ్ ఖాన్‌ని ఎంపిక చేసింది. అయితే రెండు టెస్టుల్లోనూ బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కొలంబో టెస్ట్‌లో రిషభ్ పంత్ గాయపడిన సమయంలో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా సేవలు అందించాడు. అయితే సుదర్శన్ పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో సర్ఫరాజ్‌కు జట్టులో చోటు కష్టమే. యువ పేసర్ గుర్‌నూర్ బ్రార్ కూడా కీవిస్ టూర్‌లో పోటీ ఎదురుకానుంది. జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌గా ఉంటే అతన్ని ఎంపిక చేయడం కష్టమే. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పేస్ విభాగంలో బలమైన పోటీదారులుగా ఉన్నారు. అంతేకాదు, హర్షిత్ రాణా గాయం నుంచి కోలుకుంటే అతడు కూడా పోటీలోకి వస్తాడు. దీంతో గుర్‌నూర్ బ్రార్‌కు తుది జట్టులో చోటు దక్కేది అనుమానమే. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో 33 ఏళ్ల వయసులో టెస్ట్ అరంగేట్రం చేసిన సారంచ్ జైన్ పెద్దగా రాణించలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్ సిరీస్‌కు అతడికి చోటు దక్కడం అనుమానమే.

## మహిళల ఆసియా కప్‌లో నేడు థాయిలాండ్‌తో భారత్ ఢీ

**దుబాయ్:** మహిళల టీ20 ఆసియా కప్ గ్రూప్ ఎ ఆరంభ మ్యాచ్‌లో థాయిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా క్రికెట్ జట్టు ఈ నెల 30వ తేదీన దుబాయ్‌లో తలపడనుంది. గత దశాబ్ద కాలంగా మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్ అత్యంత ఆధిపత్యం చెలాయించిన జట్టుగా ఉంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత, ఆస్ట్రేలియాతో జరిగిన అత్యంత కీలకమైన పోరులో హర్మన్‌ప్రీత్ రాణించింది.

అయితే, ఉన్నత ర్యాంకు జట్లపై భారత్ తడబడిన ఈ టోర్నమెంట్‌లో, బ్యాటింగ్‌లో ఆమె నిలకడ లేకపోవడం ప్రధాన చర్చనీయాంశాలలో ఒకటిగా నిలిచింది. ఇక నమ్మకమైన బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ దూరమవడంతో, ఆ స్థానంలో ప్రతీకా రావల్‌ను చేర్చుకుంది. అయితే, ఈ ఎంపిక మిడిల్ ఆర్డర్ ఎన్‌ఫోర్సర్ అవసరాన్ని ఏమాత్రం తీర్చదు. ఓపెనర్లుగా భారత్‌కు స్మృతి మంధాన, షఫాలీ వర్మల పటిష్టమైన ఓపెనింగ్ జోడి కొనసాగుతుంది, కానీ 3వ, ఆ తర్వాతి స్థానాల్లోని బ్యాటర్లకు అదే ఊపును కొనసాగించి, స్కోరుబోర్డుకు మరింత వేగాన్ని అందించడం అతిపెద్ద సవాలుగా నిలుస్తోంది. గతసారి ఈ ఫార్మాట్‌లో భారత్ ఆడినప్పుడు కూడా పేలవమైన ఫీల్డింగ్ ఒక ప్రధాన ఆందోళనగా నిలిచింది.



బౌండరీల సమీపంలో వరుసగా అవకాశాలను జారవిడవడం వారి పతనానికి దారితీసింది. దీంతో ఈసారి జట్టు అటువంటి లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంది. స్పిన్ బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించేందుకు అనుభవజ్ఞురాలైన ఆల్‌రౌండర్ దీప్తి శర్మపై ఆధారపడనుంది. టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన శ్రీ చరణీ, రాధా యాదవ్, ప్రేమా రావత్‌లు ఈ బాధ్యతను పంచుకోనున్నారు. మరో అనుభవజ్ఞురాలైన రేణుకా సింగ్ ఠాకూర్‌కు తోడు క్రాంతి గౌడ్, అరుంధతిరెడ్డి, నందినీ శర్మ వంటి వారు బాధ్యతలను పంచుకోవడంతో భారత సీమ్ బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగా కనిపిస్తోంది. ఈ టీమిండియాలో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), భారతీ ఫుల్మాలి, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), గుణాలన్ కమలిని (వికెట్‌కీపర్), ప్రతీకా రావల్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, ప్రేమ రావత్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, నందనీ చార్మ ఉన్నారు.

## మళ్లీ సంపాదిస్తా..

### ఆత్మవిశ్వాసంతో పైకొస్తా

### జి ఛైర్మన్ సుభాష్‌చంద్ర



**ముంబయి, ఆగస్టు 29:** దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర, తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాదాపు రూ.22,006 కోట్ల రుణాలకు గాను కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేలా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఆమోదించిన రుణ పరిష్కార ప్రణాళిక నేపథ్యంలో ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లుతున్న ఈ తరుణంలో, తన భవిష్యత్ ప్రణాళికలను ఆయన ధైర్యంగా ప్రకటించారు. నేను సర్వస్వం కోల్పోయిన వ్యక్తిగా మాట్లాడటం లేదు. నా దగ్గర మిగిలిన చివరి రూ.6.5 కోట్లు కూడా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే చెల్లించాల్సి ఉంటుంది. నాకు ఒక చిన్న ఇల్లు ఉంది, దానిని అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతోనే నా ఖర్చులు వెళ్లదీస్తున్నాను. నాకేమీ పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. నేను ఒక మార్గదర్శకుడిని. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు, ఆ పని కొనసాగిస్తానని 75 ఏళ్ల సుభాష్ చంద్ర తన వీడియో సందేశంలో వివరించారు. ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్‌గా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఇప్పుడు తన తదుపరి ప్రణాళికల గురించి మాట్లాడుతూ, స్విట్జర్లాండ్‌లో కొత్త కార్యాచరణ షురూచేయనున్నట్లు తెలిపారు. "ప్రస్తుతం, స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేసే నా స్నేహితులతో కలిసి పనిచేయాలని ఆలోచిస్తున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు వారాల్లో వెల్లడిస్తాను. అలాగే, కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు నా కుటుంబం నుంచి రూ.24 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం, రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉంటాయి. ఇది రుణదాతలకు భారీ నష్టాన్ని మిగిల్చినప్పటికీ, సుభాష్ చంద్ర మాత్రం ఆత్మవిశ్వాసంతో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం గమనార్హం.

వాణిజ్యం




## ఐటి రిటర్నులకు గడువు ముంచుకొస్తోంది

**ముంబయి, ఆగస్టు 29:** ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి వేర్వేరు రకాల పన్ను చెల్లింపుదారులకు వేర్వేరు డెడ్‌లైన్స్ ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం లేదా 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి కొందరు పన్ను చెల్లింపుదారులకు 2026, ఆగస్ట్ 31 గడువుగా ఉంది. ముఖ్యంగా ఎలాంటి టాక్స్ ఆడిట్ అవసరం లేని వారికి, బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న పన్ను చెల్లింపుదారులు ఈ తేదీలోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే తర్వాత బిలేటెడ్ ఐటీ రిటర్న్ దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఆలస్య రుసుముతో పాటు ఇతర ప్రభావాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ గడువు ప్రధానంగా కింది వర్గాలకు వర్తిస్తుంది. బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న, టాక్స్ ఆడిట్ అవసరం లేని సంస్థల భాగస్వాములు, చట్టంలో పేర్కొన్న కొన్ని ఇతర వర్గాల పన్ను చెల్లింపుదారులు, ట్రస్టులు వంటి వర్గాలకు గతంలో జులై 31 గడువుగా ఉండగా, కొన్ని మార్పుల నేపథ్యంలో ఆగస్ట్ 31 వరకు అదనపు సమయం లభించినట్లు సమాచారం. 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి సాధారణ ఐటీఆర్ గడువులు ఇలా ఉన్నాయి. వేతన జీవులు, బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం లేని నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లకు జులై 31 లాస్ట్ డేట్. టాక్స్ ఆడిట్ అవసరం లేని బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న వారికి ఆగస్ట్ 31 లాస్ట్ డేట్‌గా ఉంది. కంపెనీలు, టాక్స్ ఆడిట్‌కు లోబడే టాక్స్ పేయర్లకు అక్టోబర్ 31, సెక్షన్ 92ని కింద ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ రిపోర్ట్ అవసరమైనవారికి 2026, నవంబర్ 30 డెడ్‌లైన్ ఆగస్ట్ 31 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సిన అర్హత ఉన్న నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లు గడువు మిస్ అయితే, నిబంధనలకు లోబడి బిలేటెడ్ ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దీనికి సాధారణంగా 2026, డిసెంబర్ 31 వరకు అవకాశం ఉంటుంది. అయితే వర్తించే నిబంధనలు, వ్యక్తిగత పరిస్థితులపై ఇది ఆధారపడి ఉంటుంది. ఇంకా గడువు దాటిన తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే సెక్షన్ 234ఎఫ్ కింద రూ. 5 వేల వరకు లేట్ ఫీ పడుతుంది. ఇక్కడ ఆదాయం రూ. 5 లక్షల్లోపు ఉంటే రూ. 1000 ఫైన్, రూ. 5 లక్షలు దాటితే రూ. 5 వేల వరకు జరిమానా పడుతుంది.




## జియోబ్లాక్‌రాక్ నుంచి కొత్త ఫండ్ ఆఫర్!

**ముంబయి, ఆగస్టు 29:** మ్యూచువల్ ఫండ్ సంస్థ జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ మరో కొత్త స్కీమ్‌ను తీసుకురాబోతుంది. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ పేరుతో ఈ కొత్త ఎన్‌ఎఫ్‌ఓను (న్యూ ఫండ్ ఆఫర్) సెప్టెంబరులో ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ఎన్‌ఎఫ్‌ఓ 2026, సెప్టెంబర్ 11న ప్రారంభం కానుండగా, అదేనెల 26 లాస్ట్ డేట్‌గా ఉంది. ఎన్‌ఎఫ్‌ఓలో యూనిట్ల కేటాయింపు పూర్తయిన తర్వాత కనీసం 5 పని దినాల్లోపు ఈ స్కీమ్‌ను నిరంతర కొనుగోలు, విక్రయాల కోసం తిరిగి ప్రారంభించనున్నారు. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ అనేది ఒక ఓపెన్ ఎండెడ్ డైనమిక్ అసెట్ అలోకేషన్ ఫండ్. ఇది ప్రధానంగా ఈక్విటీ, ఇతర ఈక్విటీకి సంబంధించిన సాధనాలు, డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడి వ్యూహాన్ని బట్టి ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడులను నిర్వహించడమే ఈ తరహా ఫండ్లలో ప్రధాన ప్రత్యేకత. ఈ స్కీమ్ లక్ష్యం దీర్ఘకాలంలో మంచి మూలధన వృద్ధితో పాటు ఇన్వెస్టర్లకు ఆదాయం అందించడమే. ఈక్విటీ, ఈక్విటీ రిలేటెడ్ సాధనాల్లో 65 శాతం నుంచి 90 శాతం వరకు పెట్టుబడుల్ని డెట్, మనీమార్కెట్ సాధనాల్లో 10నుంచి 35% వరకు కేటాయించనున్నారు. మార్కెట్ పరిస్థితులు, ఫండ్ వ్యూహాన్ని బట్టి వాస్తవ పెట్టుబడి కేటాయింపుల్లో మార్పులు ఉండొచ్చు. ఈ ఎన్‌ఎఫ్‌ఓలో లంప్ సమ్ పెట్టుబడికి కనీస మొత్తం రూ. 500 గా నిర్ణయించారు. గరిష్ఠ పెట్టుబడికి పరిమితి అంటూ ఏం లేదు. సిప్ ద్వారా కూడా కనీసం రూ. 500 తో పెట్టుబడిని ప్రారంభించొచ్చు. అయితే కనీసం 6 సిప్‌లైనా చేసి ఉండాలి. అదనపు కొనుగోలు లేదా స్విచ్ ఇన్ కోసం కూడా కనీస పెట్టుబడి మొత్తం రూ. 500 గానే ఉంది.

## టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్ వాటా విక్రయం!




**ముంబయి,ఆగస్టు 29:** టాటా గ్రూప్‌లో అతిపెద్ద మైనారిటీ వాటాదారుగా ఉన్న శాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్‌తో టాటా గ్రూప్ చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఖరీదైన రుణాలను తీర్చేందుకు నిధులు సమీకరించుకోవాలని చూస్తున్న ఎస్పీ గ్రూప్‌కు లిక్విడిటీ అందించే మార్గాలపై ఇరు వర్గాలు చర్చిస్తున్నాయి. ఇందులో టాటా గ్రూప్‌కు చెందిన లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు బదిలీ చేసే 'షేర్ స్వాప్ ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం. టాటా కుటుంబ అధిపతి నోయెల్ టాటా ప్రతినిధులు ఈ అంశంపై పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్‌కు ఉన్న 18.4 శాతం వాటాలో కొంత లేదా మొత్తం వాటాకు బదులుగా టాటా పవర్ వంటి లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు అందించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టాటా సన్స్ స్వయంగా ఎస్పీ గ్రూప్ వాటాను కొనుగోలు చేయడం.

ఇందుకోసం విదేశీ బ్యాంకుల నుంచి నిధులు సమీకరించే అవకాశం ఉంది. మరో ప్రత్యామ్నాయం ఎస్పీ గ్రూప్ వాటాను బయటి పెట్టుబడిదారుడికి విక్రయించడం. ముఖ్యంగా అంతర్జాతీయ పెట్టుబడిదారుడికి విక్రయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు తప్పనిసరిగా ఒప్పందానికి దారితీస్తాయని చెప్పలేమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చర్చలు ముందుకు సాగుతున్న కొద్దీ ప్రతిపాదిత లావాదేవీ నిర్మాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపాయి. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన సవాలు టాటా సన్స్ విలువను నిర్ణయించడమేనని నిపుణులు భావిస్తున్నారు. టాటా గ్రూప్‌లోని అనేక కీలక సంస్థలను టాటా సన్స్ నియంత్రిస్తోంది. ఎయిర్ ఇండియా, ఐఫోన్ తయారీ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ వంటి అనేక పెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీలు కూడా టాటా సన్స్ పరిధిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో టాటా సన్స్‌కు సరైన విలువను నిర్ణయించడం, తద్వారా ఎస్పీ గ్రూప్‌కు చెందిన 18.4 శాతం వాటాకు న్యాయమైన విలువ కేటాయించడం అత్యంత క్లిష్టమైన అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. న్యాయ, నియంత్రణ అంశాలపై పరిశీలషేర్ స్వాప్ ప్రతిపాదనలో టాటా పవర్ వంటి లిస్టెడ్ టాటా కంపెనీల షేర్లు ఉండే అవకాశం ఉన్నందున, దీనికి సంబంధించిన చట్టపరమైన, నియంత్రణపరమైన అంశాలను కూడా ఇరు వర్గాలు పరిశీలిస్తున్నాయి. ఎస్పీ గ్రూప్‌కు తక్షణం నిధులు సమీకరించి రుణభారం తగ్గించుకోవాల్సిన అవసరం ఉండగా, టాటా గ్రూప్ ప్రయోజనాలు, ఇతర వాటాదారుల ఆందోళనలు, నియంత్రణ సంస్థల నిబంధనలు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.



## భారత్ మార్కెట్లకు ఫెడ్ ఛైర్మన్ ఎఫెక్ట్!

**న్యూఢిల్లీ,ఆగస్టు, 29:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ జాక్సన్ హోల్ సింపోజియంలో చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయ మార్కెట్లలో కలకలం రేపుతున్నాయి. వార్ష్ చేసిన కఠిన వైఖరి వ్యాఖ్యలతో సెప్టెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చన్న అంచనాలు పెరిగాయి. ఫెడ్ రేట్లు ఎక్కువ కాలం అధిక స్థాయిలో కొనసాగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులఅంచనా. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు , రూపాయి మారకం విలువ, భారత బాండ్ రాబడులపై ప్రభావాన్ని నిశితంగా గమనించాల్సి ఉంటుంది. అమెరికాలో వడ్డీ రేట్లు ఎక్కువ కాలం అధికంగా కొనసాగితే అక్కడి ఆస్తులు పెట్టుబడిదారులకు మరింత ఆకర్షణీయంగా మారతాయి. దీంతో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ నిధుల ప్రవాహం తగ్గే ప్రమాదం ఉంది. అదే సమయంలో బలపడే అమెరికా డాలర్ భారత రూపాయిపై అదనపు ఒత్తిడిని తీసుకురావచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత బలహీనపడే అవకాశం ఉంటుందన్న అంచనాలున్నాయి. అమెరికా బాండ్ రాబడులు పెరిగితే భారత్‌లోనూ బాండ్ రాబడులు పైకి వెళ్లే అవకాశం ఉంది. ఫెడ్ రేట్ల పెంపు అంచనాలు బంగారం ధరలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.